గురువారం
3•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 99
• పేజీలు : 14 + 16

మన రాష్ట్రం • మన పత్రిక

# నమస్తే తెలంగాణ

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM /NTDAILYONLINE







బుధవారం మాజీ ఎంపీ కవిత గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్‌భవన్‌లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించడంపై కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక బతుకమ్మకు ప్రాముఖ్యాన్నివ్వడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పూలసింగిడి పుస్తకంతోపాటు బతుకమ్మ జ్ఞాపికను అందజేశారు.



రాజ్‌భవన్‌లో మూడోరోజు నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

## బతుకమ్మ అద్భుతమైన పండుగ

- పల్లె జీవితాన్ని, ప్రకృతి రమణీయతను ఆవిష్కరిస్తుంది
- తెలంగాణ జాగృతితోనే దేశ, విదేశాలకు బతుకమ్మ
- ఆడబిడ్డలందరికీ శుభాకాంక్షలు: మంత్రి కేటీఆర్



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మను నిషేధిస్తే హైకోర్టుకు వెళ్లి మరీ బతుకమ్మను సంబురంగా ఆడిన ఘనచరిత్ర తెలంగాణ జాగృతిదని ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. తెలంగాణ మహిళలకు మాత్రమే ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ అని బుధవారం ఆయన ఓ వీడియో సందేశంలో తెలిపారు. పువ్వులను పూజించే విశిష్ట సంప్రదాయాన్ని స్వరాష్ట్ర సాధనలో సాంస్కృతిక ఆయుధంగా, విడదీయలేని ఉద్యమరూపంగా మార్చిన ఘనత తెలంగాణ జాగృతిది అన్నారు. విదేశాల్లోనూ తెలంగాణ ఆడబిడ్డలు సగర్వంగా, ఘనంగా బతుకమ్మ జరుపుకోవడానికి తెలంగాణ జాగృతి విశేష కృషి చేసిందని చెప్పారు. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు మాజీ ఎంపీ కవితకు కూడా ఆ ఘనత దక్కుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు ఒక వైపు ఉపాధి కల్పిస్తూ మహిళలకు బతుకమ్మ చీరెలను అందిస్తున్నదని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలందరికీ మంత్రి కేటీఆర్ హృదయపూర్వక బతుకమ్మ శుభాకాంక్షలు, దశాబ్దకాలంగా జాగృతిలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.





ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ -2019 అవార్డు అందుకుంటున్న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన

## పెద్దపల్లి కలెక్టర్‌కు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

ప్రధాని మోదీ నుంచి అందుకున్న శ్రీదేవసేన

**పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ (ఎస్ఎస్‌జీ)-2019 జాతీయ అవార్డును పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేనకు ప్రధాని నరేంద్రమోదీ ప్రదానం చేశారు. బుధవారం రాత్రి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మహాత్మాగాంధీ 150వ జయంతి వేడుకల్లో భాగంగా స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ అవార్డు అందుకున్న సందర్భంగా కలెక్టర్ శ్రీదేవసేన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమష్టి కృషితోనే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డు దక్కిందని సంతోషం వ్యక్తంచేశారు.

## ముత్యపుపందిరి వాహనంపై శ్రీవారు



తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా సాగుతున్నాయి. మూడోరోజు బుధవారం మలయప్పస్వామివారు ఉదయం సింహవాహనంపై యోగ నారసింహుడిగా.. రాత్రి ముత్యపు పందిరి వాహనంపై శ్రీవేణుగోపాలస్వామి అవతారంలో తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముత్యాల నిర్మలకాంతులు వ్యాపించడానికి, ఆ కాంతులు దర్శించి భక్తులు ముక్తులు కావడానికి రాత్రివేళ అనుకూలం. అందుకే శ్రీమలయప్పకు మూడోరోజు రాత్రి ముత్యాల పందిరిలో కూర్చొని విహరించే కైంకర్యాన్ని పెద్దలు నిర్ణయించారు. ఉదయం సింహవాహనంపై దేవదేవుని వైభవాన్ని చూసి భక్తులు పులకించిపోయారు. - తిరుమల

# హుజూర్‌నగర్ దశ మారుస్తాం

### డెడ్‌స్టోరేజీలోనూ పంటలకు నీళ్లిచ్చిన ఘనత టీఆర్‌ఎస్‌దే

- అన్ని నియోజకవర్గాలతోపాటు హుజూర్‌నగర్‌కూ నిధులు
- ఉత్తమ్ అహంకారంతోనే అభివృద్ధికి దూరం
- రేపు మంత్రి కేటీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలి
- హుజూర్‌నగర్ ఉపఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



వివిధ పార్టీల నుంచి టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న హుజూర్‌నగర్ ఉపఎన్నికల టీఆర్‌ఎస్ ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



నేరేడుచర్లలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్

**హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ:**

'రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలకు ఇచ్చినవిధంగానే ముఖ్యమంత్రి కేసీఆర్ హుజూర్‌నగర్‌కు కూడా నిధులు విడుదల చేశారు. 24 గంటల కరంటు, ఆసరా పింఛన్లు, గొర్రెలు, చేపల పంపిణీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా పథకాలన్నింటినీ కల్పించారు. కానీ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అహంకారంతో నియోజకవర్గం అభివృద్ధికి దూరమయింది' అని హుజూర్‌నగర్ ఉపఎన్నికల టీఆర్‌ఎస్ ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ జలాశయం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎడమకాల్వ కింద రెండు పంటలకు నీళ్లిచ్చిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎలాంటి పక్షపాతం లేకుండా నియోజకవర్గానికి నిధులు విడుదల చేశారన్నారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి రూ. 20 కోట్లు ఇస్తే పనులు కాకుండా ఉత్తమ్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. టీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే హుజూర్‌నగర్ రూపురేఖలే మారుస్తామని.. ఈ ఎన్నికలు నియోజకవర్గ అభివృద్ధే అంశంగా జరుగుతున్నాయన్నారు. మహిళపై ఇందరు మంత్రులు, ఎమ్మెల్సీలను సీఎం పంపుతున్నారని కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉన్నదని.. తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను ఉత్తమ్ ఓడించినప్పుడు ఆమె ఓ మహిళ అనే విషయం పద్మావతికి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన సుమారు 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

### రేపు కేటీఆర్ రోడ్‌షో

హుజూర్‌నగర్‌లో శుక్రవారం టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలని పల్లా పిలుపునిచ్చారు. 20వేల మందితో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు రోడ్‌షో జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీలు భానుప్రసాద్, గంగాధర్‌గౌడ్, టీఆర్‌ఎస్ జనరల్ సెక్రటరీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, వై వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సైదిరెడ్డి పాల్గొన్నారు.

### ముమ్మరంగా ఇంటింటి ప్రచారాలు

హుజూర్‌నగర్ ఉపఎన్నికల్లో టీఆర్‌ఎస్ ప్రచారం ముమ్మరంగా జరుగుతున్నది. బుధవారం నియోజకవర్గంలోని ఏడుమండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. నేరేడుచర్లలో వివిధపార్టీల నుంచి 200 మంది ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మండలంలోని సోమారం, రోళ్లవారిగూడెంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్‌హుస్సేన్, దిర్శించర్ల, పెంచికల్‌దిన్నె, కల్లూరులో టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శులు తాతా మధుసూదన్, చాడా కిషన్‌రెడ్డి ప్రచారంచేశారు. మేళ్లచెర్వు మండలం రామాపురంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు టీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. కందిబండలో శానంపూడి రజిత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ అధికార ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్ మేళ్లచెర్వులో ప్రచారంలో పాల్గొన్నారు. గరిడేపల్లి మండలం పొనుగోడు, గారకుంటతండా, కొత్తగూడెం, తాళ్లమల్కాపురంలో కార్యకర్తలతో మండలి చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు,అయిల్ ఫెడరేషన్ చైర్మన్ రామకృష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు. పాలకీడు మండలం నాగిరెడ్డిగూడెం, గుడుగుంట్లపాలెం, జాన్‌పహాడ్‌లో బూత్‌స్థాయి సమావేశంలో విప్ కర్నె ప్రభాకర్ పాల్గొన్నారు. చింతలపాలెం మండలంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాజాముజీబుద్దీన్, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ప్రచారం నిర్వహించారు.

### టీఆర్‌ఎస్‌కు మాలమహానాడు మద్దతు

హుజూర్‌నగర్ ఉపఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి సంపూర్ణ మద్దతు పలుకుతున్నట్టు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ప్రకటించారు. బుధవారం హుజూర్‌నగర్‌లో సైదిరెడ్డిని కలిసి మద్దతిస్తున్నట్టు తెలిపారు. అనంతరం మాలమహానాడు నాయకులతో కలిసి చెన్నయ్య మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని మాల మహానాడు కమిటీలు టీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలని సూచించారు.

### ఉపఎన్నికల్లో మద్దతుపై 6న సీపీఎం నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** హుజూర్‌నగర్ ఉపఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైన నేపథ్యంలో ఆ పార్టీ ఎవరికి మద్దతునిస్తుందనే అంశం ఆసక్తిగా మారింది. వామపక్ష పార్టీ అయిన సీపీఐ ఇప్పటికే టీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో సీపీఎం కూడా అదేబాటలో మద్దతు ప్రకటిస్తుందా? అనే చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో పార్టీ వైఖరిని తెలుసుకోవడానికి మీడియా ప్రయత్నించగా.. నామినేషన్ తిరస్కరణపై న్యాయపరమైన అవకాశాలను చర్చిస్తున్నామని, ముందుగా ఈ విషయంపై ఈసీని కలిసిన అనంతరం కోర్టును ఆశ్రయించనున్నట్టు చెప్పారు. న్యాయపరంగా పోటీలో నిలిచే అవకాశం లేకపోతే.. 6వ తేదీన పార్టీ వైఖరిని స్పష్టం చేస్తామని కీలకనేత ఒకరు వెల్లడించారు. సెంట్రల్‌కమిటీ ఆదేశాలకనుగుణంగా నిర్ణయం వెల్లడించనున్నట్టు పేర్కొన్నారు.

# ఎథిక్స్ కమిటీ ఆమోదం తప్పనిసరి

- క్లినికల్ ట్రయల్స్‌పై ఓయూ వైద్యకళాశాల ప్రిన్సిపాల్
- డీసీజీఐ అనుమతీ అవసరమే
- కళాశాల దశలో క్లినికల్ ట్రయల్స్‌కు రెండు ఎథిక్స్ కమిటీలు
- సభ్యులుగా న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, సైంటిస్టులు




**హైదరాబాద్ సిటీబ్యూరో:**

నీలోఫర్ దవాఖానలో చిన్నారులపై క్లినికల్ ట్రయల్స్‌కు సంబంధించి వస్తున్న ఆరోపణలు వైద్యారోగ్యశాఖలో పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. కొందరు వైద్యాధికారులు.. ఫార్మా కంపెనీలతో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా రోగులపై వారి అనుమతి లేకుండా ప్రయోగాలు చేస్తున్నారేనది ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో క్లినికల్ ట్రయల్స్ అనేవి నైతికమేనని.. కానీ వీటిని చేయడానికి ముందు ఎథిక్స్ కమిటీ, డీసీజీఐ (డ్రగ్ అండ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా) ఆమోదం తప్పనిసరి అని ఉస్మానియా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ చెప్పారు. క్లినికల్ ట్రయల్స్ అనేవి వైద్య విద్యలో భాగమేనని.. వీటిని చేయదలచుకొన్నవారు తప్పనిసరిగా ఈ కమిటీల ముందు తమ ప్రాజెక్టును ప్రజెంటేషన్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డాక్టర్ శశికళ చెప్పిన వివరాల ప్రకారం.. ప్రతి వైద్యకళాశాలకు రెండు ఎథిక్స్‌కమిటీలు ఉంటాయి. వీటిలో ఒకటి తొమ్మిదిమంది సభ్యులతో కూడిన ప్రధాన కమిటీ కాగా..రెండవది ఏడుగురు సభ్యుల ఉపకమిటీ. ప్రధాన కమిటీ విశ్రాంత ఉప కులపతి పర్యవేక్షణలో పనిచేస్తుంది. ప్రస్తుతం ఉస్మానియా వైద్యకళాశాల ఎథిక్స్ కమిటీకి విశ్రాంత వీసీ డాక్టర్ శ్యాంసుందర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఉపకమిటీకి ప్రిన్సిపాల్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈ రెండు కమిటీలు క్లినికల్ ట్రయల్స్‌కు సంబంధించిన ప్రాజెక్టులను అతి సూక్ష్మంగా పరిశీలించిన తర్వాతే గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది.

### పీజీ విద్యార్థులంతా ట్రయల్స్ చేయాల్సిందే



వైద్యవిద్యాభ్యాసంలో భాగంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చేస్తున్న ప్రతి విద్యార్థి క్లినికల్ ట్రయల్స్ చేయాల్సిందేనని డాక్టర్ శశికళ స్పష్టంచేశారు. ఉస్మానియా వైద్య కళాశాల పరిధిలో 340 మంది పీజీలు ఉన్నారని తెలిపారు. వారితోపాటు ఫ్యాకల్టీ కూడా ఈ ట్రయల్స్ చేయడం తప్పనిసరి అన్నారు. ప్రొఫెసర్లు, విభాగాధిపతుల పర్యవేక్షణలోనే ఈ ట్రయల్స్ జరుగుతాయని చెప్పారు. సాధారణంగా ఫార్మా కంపెనీలు క్లినికల్ ట్రయల్స్ కోసం వైద్య కళాశాలలను ఆశ్రయిస్తాయని.. కొన్ని సందర్భాలలో వైద్య పరిశోధనలతోపాటు, పబ్లికేషన్ల కోసం ఆయా దవాఖానలకు చెందిన ఫిజిషియన్లు ఫార్మాకంపెనీలను ఆశ్రయించి క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తారని డాక్టర్ శశికళ వివరించారు.

### ప్రధాన కమిటీ సభ్యులు

విశ్రాంత వీసీ నేతృత్వంలో పనిచేసే ప్రధాన కమిటీలో న్యాయనిపుణుడు, సామాజిక కార్యకర్త, జాతీయ పౌష్టికాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్త, యురాలజిస్ట్, ఎండోక్రినాలజిస్ట్ వంటి వైద్యులు ముగ్గురు, వైద్యకళాశాల ప్రిన్సిపాల్, ఫార్మకాలజిస్టు, ప్రివెంటివ్ మెడిసిన్ విభాగానికి చెందిన ప్రతినిధి ఉంటారు.

### సబ్ కమిటీ సభ్యులు

వైద్యకళాశాల ప్రిన్సిపాల్ నేతృత్వంలోని సబ్ కమిటీలో ఒకశాస్త్రవేత్త, ముగ్గురువైద్యులు, ఫార్మకాలజిస్టు, యూరాలజిస్టు, ప్రివెంటివ్ మెడిసిన్ విభాగం నుంచి ఒక ప్రతినిధి ఉంటారు.

### డీసీజీఐ ఆమోదమూ తప్పనిసరి

మందులకు సంబంధించి ఫార్మా కంపెనీలు అన్ని దశలను పూర్తిచేసుకొన్న తర్వాత చివరగా వైద్య కళాశాలలను ఆశ్రయిస్తాయని శశికళ తెలిపారు. ఆయా కంపెనీలతోపాటు ట్రయల్స్ నిర్వహించే వైద్యాధికారులు ముందుగా కళాశాల పరిధిలోని సబ్‌కమిటీ ఆమోదం.. ఆ తర్వాత ప్రధాన కమిటీ అనుమతిని పొందాల్సి ఉంటుందని.. ఆ తర్వాత సదరు ప్రాజెక్టును డీసీజీఐ ఆమోదానికి పంపుతామని.. అక్కడి నుంచి ఆమోదం లభించిన తర్వాత ఐసీఎమ్మార్ మార్గదర్శకాల ప్రకారం క్లినికల్ ట్రయల్స్ నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## టమాట.. ఉల్లి బాట

- వరుస వర్షాలతో పెరుగుతున్న ధరలు
- మార్కెట్‌కు తగ్గిన దిగుబడులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొద్దిరోజులుగా ఉల్లి ధరలు సామాన్యుడిని కంటనీరు పెట్టిస్తుంటే.. తాజాగా టమాట అ జాబితాలో చేరింది. వారం, పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా టమాట పంట దెబ్బతినడంతో మార్కెట్ రాక భారీగా తగ్గిపోయి ధరలు పెరుగుతున్నాయి. రెండు వారాల క్రితం వరకు రూ.10కు లభించిన టమాట ఇప్పుడు రూ.50 వరకు పలుకుతున్నది. వారంరోజుల క్రితం వరకు హైదరాబాద్‌కు రోజుకు 100 నుంచి 150 లారీలు దిగుమతి కాగా.. ప్రస్తుతం 60 నుంచి 80 లారీలకు పరిమితమయిందని వ్యాపారులు చెప్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న కొద్దిపాటి పంట నాణ్యత కూడా సరిగాలేదని అధికారులు తెలిపారు. తెలంగాణలో చాలా జిల్లాల నుంచి పూర్తిగా పండని టమాటనే మార్కెట్‌కు వస్తున్నది. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో టమాట ధర రూ.25 నుంచి రూ.30 రూపాయలు పలుకుతుండగా.. వ్యాపారుల చేతికి వచ్చాక రూ.40 నుంచి రూ.50 అమ్ముతున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ నుంచి కూడా టమాట వస్తున్నా.. సాధారణ రోజుల్లో కంటే తక్కువగా ఉందని వ్యాపారులు తెలిపారు.

# పొత్తు పొడవక.. లోపాయికారి కుట్ర!

### మఖ్దూంభవన్‌కు వెళ్లినా మద్దతివ్వని కామ్రేడ్లు

బీజేపీ శ్రేణులతో ఉత్తమ్ రహస్య మంతనాలు

ఉపఎన్నిక ఉత్తమ్ ఇంటిపోరు అనే రీతిలో సీనియర్లు

కాంగ్రెస్‌కు సంబంధం లేదన్నట్టుగా దూరం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌పార్టీ కళతప్పింది. పార్టీ సీనియర్లు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అది ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇంటి వ్యవహారమన్నట్టు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. దీంతో ప్రత్యామ్నాయాల వైపు పరుగులు తీస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. స్వయంగా మఖ్దూంభవన్‌కు పోయి మద్దతుకోరినా సీపీఐ నాయకులు టీఆర్‌ఎస్‌కే తమ మద్దతు అంటూ కరాఖండీగా చెప్పేశారు. సొంతగూటి అనైక్యత, ఇతరపార్టీలు ఇస్తున్న వరుసషాక్‌లతో ఉత్తమ్ శిబిరానికి ఏం చేయాలో పాలుపోడం లేదు. మరోవైపు అధికార టీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రచారంలో దూసుకుపోతున్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంతో గులాబీ నేతలు, శ్రేణులు ప్రజలతో మమేకమై ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. దీంతో బెంబేలెత్తిన ఉత్తమ్ బీజేపీతో లోపాయికారీగా వ్యవహారాలు సాగిస్తున్నట్టు సమాచారం. ఆ పార్టీ నేతలతో అంతర్గతంగా మంతనాలు సాగిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతున్నది. టీడీపీ అభ్యర్థి కూడా బరిలో ఉండటంతో ఓట్లు చీలితే కొంత ప్రయోజనం చేకూరుతుందనే ఆశతో ఉన్నారు. ప్రచారాన్ని గాలికొదిలి.. ఇలా అక్రమమార్గాలపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టిసారించడంతో పార్టీ క్యాడర్ కూడా అయోమయానికి గురవుతున్నది. బీజేపీ నామమాత్రపు పోటీగా బరిలో ఉన్నదని కాంగ్రెస్‌వర్గాలు ప్రచారం చేసుకుంటున్నాయి. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం చెప్పినా అగ్రశ్రేణి నేతలు ఇంకా ప్రచారానికి దూరంగానే ఉంటున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ప్రచారానికి వెళ్లేది లేదంటూ తన వర్గీయులతో కరాఖండిగా చెప్తున్నారు. ఈ నేపథ్యంలో హుజూర్‌నగర్‌లో ఉత్తమ్ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలుస్తున్నది.

## పక్కాగా వ్యర్థాల నిర్వహణ

- కొత్త చట్టంలో మున్సిపాలిటీలకు కొత్త విధులు, బాధ్యతలు
- గేటెడ్ కమ్యూనిటీలు చెత్తను వేరుచేయాలి
- ప్రతిఒక్కరూ ఆహారభద్రతను పాటించాలి




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొత్త మున్సిపల్‌చట్టం.. పురపాలికలకు పలు కొత్త విధులు, బాధ్యతలను అప్పగించింది. ఇప్పటివరకూ తూతూమంత్రంగా పాటించే కొన్నింటిని ఇకనుంచి ప్రతి మున్సిపాలిటీ కచ్చితంగా అమలుచేయాల్సిందేనని చెప్తున్నది. జీహెచ్ఎంసీ మినహా అన్ని మున్సిపాలిటీలు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోని అపార్టుమెంట్లు, నివాసయోగ్య భవనాలు, నివాసయేతర కట్టడాల్లో చెత్తను వేరు చేసే బాధ్యతను కచ్చితంగా నిర్వహించాలి. అపార్టుమెంటులోనే తడిచెత్త, పొడిచెత్తను వర్గీకరించాలి. ఆ చెత్తను ప్రతిరోజు తీసుకెళ్లే మున్సిపాలిటీకి విడిగా వినియోగపు చార్జీలను చెల్లించాలి. ఘనవ్యర్థాలను సేకరించి, వాటిని శాస్త్రీయ పద్ధతిలో వర్గీకరించి నిర్వహించాల్సిన బాధ్యతను మున్సిపాలిటీలకు కొత్త చట్టం కల్పించింది. బయోమైనింగ్, బయో ప్రాసెస్ వంటివన్నీ ప్రభుత్వం సూచించిన ఏజెన్సీ ద్వారా మున్సిపాలిటీలు చేపట్టాలి. ప్రస్తుతం ఆయా మున్సిపల్ పరిధిలోని డంపింగ్ సైటులను శాస్త్రీయ పద్ధతి లేదా ఇతర విధానంలో క్యాపింగ్ చేయాలి. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర నిబంధనలను తప్పకుండా పాటించాలి. మున్సిపాలిటీల్లో దవాఖానలు, ల్యాబ్‌లు వంటివి బయోవ్యర్థాలను వర్గీకరించాలి. వాటిని నిర్ధారిత ప్రదేశాల్లో రవాణా చేసేందుకు వీలుండేలా ఏర్పాట్లుచేయాలి. ఇందుకోసం ప్రతి మున్సిపల్ కమిషనర్ ఆరోగ్య, కాలుష్య నియంత్రణ సంస్థలను సంప్రదించి చేపట్టాలి. ఈ నిబంధనను పట్టించుకోని సంస్థలపై జిల్లా కలెక్టర్ తగుచర్యలు తీసుకోవాలి. ప్రతి మున్సిపాలిటీ నిర్మాణాల వ్యర్థాలను సమర్థంగా నిర్వర్తించాల్సి ఉంటుంది.

## 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఊరట

- మెరిట్ అభ్యర్థులకు నాలుగువారాల్లో ఉద్యోగాలివ్వాలి
- అవసరమైతే సూపర్‌న్యూమరరీ పోస్టులు సృష్టించాలి
- హైకోర్టు ఆదేశాలు
- నలుగురు డీఈవోలకు శిక్షపై స్టే



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డీఎస్సీ-1998 నియామకాలకు సంబంధించిన కేసులో ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, 2011లో హైకోర్టు ఇచ్చిన తీర్పులను అమలుచేయాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. ఇందుకు నాలుగు వారాల గడువు ఇచ్చింది. మెరిట్ అభ్యర్థులకు ఆలోపు ఉద్యోగాలివ్వాలని, అవసరమైతే సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించాలని ఆదేశించింది. ఈ కేసులో పోరాడుతున్న అభ్యర్థులకు హైకోర్టు డివిజన్‌బెంచ్ తీర్పుతో ఊరట లభించినట్లయింది. ఇదేకేసులో కోర్టు ధిక్కరణ కింద నల్లగొండ, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ డీఈవోలకు విధించిన శిక్షపై స్టే విధించింది.

### కేసు పూర్వాపరాలు..

1998లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఓసీ క్యాటగిరీలో 50, బీసీ 45, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు40 మార్కులను కటాఫ్‌గా నిర్ణయించి అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచారు. ఈ మేరకు 221 జీవోను జారీఅయింది. కొన్ని క్యాటగిరీల్లో కటాఫ్ ఉన్న అభ్యర్థులు లేకపోవడంతో ఓసీలో 45, బీసీలో 40, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులలో 35మార్కులను కటాఫ్‌గా నిర్ణయిస్తూ మళ్లీ జీవో 618 జారీచేశారు. అదేసమయం లో ఉప ఎన్నికలు రావడంతో కొన్ని జిల్లాల్లో నియామక ప్రక్రియ వాయిదా పడింది. ఈ జిల్లాల్లో 1998 డీఎస్సీ నియామకాలకు త ర్వాత ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొదట 221జీవో ప్రకారం ఎక్కువ కటాఫ్ మార్కులు ఉన్న వారందరికీ ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత 618 జీవో ప్రకారం తక్కువ కటాఫ్ మార్కు లు ఉన్న అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉన్నది. అప్పటి అధికారుల పొరపాటు కారణంగా ఎక్కువ కటాఫ్, తక్కువ కటాఫ్ ఉన్న రెండురకాల అభ్యర్థులను ఒకేసారి ఇంటర్వ్యూలకు పిలిచారు. దీంతో 221 జీవో ప్రకారం ఎక్కువ కటాఫ్ మార్కులు ఉన్న అభ్యర్థులకు ఉద్యోగాలు లభించలేదు. వీరు ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా..వారికి ఉద్యోగాలు ఇవ్వాలని ట్రిబ్యునల్ 2009లో ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు 2011లో ట్రిబ్యునల్ తీర్పును సమర్థిస్తూ తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పు అమలుకాకపోవడంతో అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు ఆదేశాల మేరకు మెరిట్ ఉన్న అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలని ఆదేశించింది. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల డీఈవోలు హైకోర్టు తీర్పును అమలుచేయకపోవడంతో అభ్యర్థులు ధిక్కరణ కేసు దాఖలుచేశారు. ఈ కేసులో ఈ నలుగురు డీఈవోలకు ధర్మాసనం రెండునెలల జైలు, జరిమానా విధించింది. చీఫ్ జస్టిస్ రాఘువేంద్రసింగ్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం.. ఈ జైలుశిక్ష అమలుపై నాలుగు వారాలపాటు స్టే విధించింది.

## నీటిలెక్కలపై క్షేత్రస్థాయిలో ఆరా

- పోతిరెడ్డిపాడు, సాగర్ ఎడమకాల్వ పరిశీలన పూర్తి
- సాగర్ కుడికాల్వ డిశ్చార్జిని పరిశీలిస్తున్న బోర్డు
- 9న కృష్ణాబోర్డు సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలుగు రాష్ట్రాల కృష్ణాజలాల వినియోగంపై కృష్ణానదీ యాజమాన్యబోర్డు కొత్త పంథాను అమలుచేస్తున్నది. కొన్నేండ్లుగా రెండురాష్ట్రాల నీటివినియోగంపై పరస్పర ఫిర్యాదులు కొనసాగుతూనే ఉన్నాయి. కానీ తాజా నీటిసంవత్సరంలో మాత్రం ఆదినుంచి బోర్డు ఇంజినీర్లు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు. ముఖ్యంగా పోతిరెడ్డిపాడు డిశ్చార్జిపై చాలాకాలంగా ఫిర్యాదులు వస్తున్నాయి. వాస్తవ డిశ్చార్జి కంటే తక్కువ నమోదు చేస్తున్నారని మొదట్లోనే తెలంగాణ ఈఎన్సీ ఆధారాలతో సహా ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో పలుమార్లు ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీకి బోర్డు సభ్యకార్యదర్శి లేఖ రాయడంతోపాటు క్షేత్రస్థాయిలోనూ బోర్డు ఇంజినీర్లతో పరిశీలన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ప్రధానంగా ఏడీసీపీ (అకాస్టిక్ డాప్లర్ కరంట్ (ప్రొఫైలర్) యంత్రం ద్వారా వాస్తవ డిశ్చార్జిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. పోతిరెడ్డిపాడు డిశ్చార్జిని కూడా పరిశీలించి, ఆ వివరాలను ఏపీ ఈఎన్సీకి పంపించారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వ డిశ్చార్జిపై ఆంధ్రప్రదేశ్ ఫిర్యాదు చేసిన క్రమంలో దాని డిశ్చార్జిని కూడా బోర్డు ఇంజినీర్లు ఏడీసీపీ యంత్రంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదిక రూపొందించారు. తెలంగాణ నీటిపారుదలశాఖ కోరిక మేరకు బుధవారం ఏడీసీపీతో తాజాగా నాగార్జునసాగర్ కుడికాల్వ డిశ్చార్జిని నమోదుచేసినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో స్వతహాగా పరిశీలన చేయడం ద్వారా బోర్డు పరంగా డిశ్చార్జి లెక్కలు నమోదవుతున్నాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుం చి రెండు రాష్ట్రాల వినియోగాన్ని సమీక్షించేందుకు తొమ్మిదో తేదీన నిర్వహిస్తున్న బోర్డు సమావేశంలో ఇవి కీలకం కానున్నాయి. రెండు రాష్ట్రాల ఇంజినీర్లు తమతమ నీటిలెక్కలను సమర్పిస్తారు. బోర్డు ఇంజినీర్లు కూడా క్షేత్రస్థాయి పరిశీలన లెక్కల్ని వాటితో సరిపోల్చేందుకు అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో 9న జరిగే సమావేశంలో రెండు రాష్ట్రాల కృష్ణాజలాల వాస్తవ వినియోగంపై ఒక స్పష్టత వచ్చేందుకు అవకాశం ఉన్నది.

గురువారం 3•10•2019
కరీంనగర్
మన రాష్ట్రం • మన పత్రిక
# నమస్తే తెలంగాణ
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD
WWW. NTNEWS.COM /NTDAILYONLINE


మానుకోటలో బతుకమ్మ ఆడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత





బుధవారం ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో గాంధీజీ సమాధివద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ


బుధవారం లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో బాపూజీకి పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

150 గాంధీజీ జయంతి ఉత్సవాలు

పూజ్య బాపూజీ 150వ జయంతి ఉత్సవాలు బుధవారం దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. జాతిపిత సేవలను, బోధనలను మనసా ప్రజలు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌ఘాట్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ, ఇతర ప్రముఖులు నివాళులర్పించారు. 7

4
## అసెంబ్లీ ఆవరణలో గాంధీజీకి నివాళి
లండన్‌లో గాంధీ విగ్రహానికి స్పీకర్ పోచారం పుష్పాంజలి

# అంగన్‌వాడీలకు శుభవార్త
### దసరాకు ముందే వేతనాల విడుదల ▪ రూ.83 కోట్లు విడుదలచేస్తూ ఉత్తర్వులు
### హర్షం వ్యక్తంచేసిన ఉద్యోగసంఘాలు ▪ 71 వేలకుపైగా కుటుంబాల్లో ఆనందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

అంగన్‌వాడీలు దసరా పండుగను సుఖసంతోషాలతో జరుపుకొనేందుకు తెలంగాణ సర్కారు శుభవార్త అందించింది. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలకు ముందుగానే వేతనాలు చెల్లించేందుకు రూ.83 కోట్లు విడుదలచేస్తూ ఆర్థికశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. అడిగిన వెంటనే అంగన్‌వాడీల వేతనాల కోసం నిధులు విడుదల చేయడంపై సీఎం కేసీఆర్‌కు గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ ధన్యవాదాలు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రతి నెలా మాసాంతంలో వేతనాలు అందుతున్నాయి. ఈ నెలలో దసరా పండుగ మొదటివారంలోనే రావటంతో వేతనాలు లేకపోవటం వల్ల పండగ చేసుకోవటం ఇబ్బందిగా ఉన్నదని తెలంగాణ అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాల సంఘం నేతలు మంగళవారం మంత్రి సత్యవతిరాథోడ్‌ను కలిసి విన్నవించారు. వేతనాలు ముందే విడుదల చేయాలని విజ్ఞప్తిచేశారు. మంత్రి ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి.. అంగన్‌వాడీల వేతనాల కోసం నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం దసరా పండుగ దరిమిలా తీసుకున్న ఈ నిర్ణయం వేల కుటుంబాల్లో ఆనందాన్ని నింపింది. రాష్ట్రంలో 35 వేలమంది అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, మరో 35వేల మంది హెల్పర్లు ఉన్నారు. వీరితోపాటు మరో 1100 మంది మినీ అంగన్‌వాడీలు ఉన్నారు. మొత్తంగా 71,100 మందికి తాజాగా వేతనాలు విడుదలయ్యాయి. దీంతో ఆయా కుటుంబాలు సంతోషాన్ని వ్యక్తంచేస్తున్నాయి.

**మహిళా పక్షపాత ప్రభుత్వం: మంత్రి సత్యవతి రాథోడ్**

అంగన్‌వాడీలకు సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి సత్యవతిరాథోడ్ చెప్పారు. ఇది.. మహిళా సమస్యలు పరిష్కరించే మహిళా పక్షపాత ప్రభుత్వమని అన్నారు. గత ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లను గుర్రాలతో తొక్కిస్తే.. తమ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నదని చెప్పారు. మహిళల కోసం బిడ్డ గర్భంలో ఉన్నప్పటినుంచి పెండ్లిచేసేవరకు

మిగతా 4వ పేజీలో


7
తిరుచ్చిలోని లలితా జ్యుయెలర్స్‌లో ముఖాలకు మాస్కులు ధరించి దోపిడీ చేస్తున్న దొంగలు

## నగల షాపులో భారీ చోరీ
తిరుచ్చిలో రూ.13 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాల దొంగతనం

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 79.00 | రిటైల్ లైవ్ | 101.00 |
| డ్రెస్‌డ్ | 146.00 | స్కిన్‌లెస్ | 167.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 407.00 | రంగారెడ్డి | 407.00 |
| మెదక్ | 407.00 | కరీంనగర్ | 410.00 |
| వరంగల్ | 410.00 | చిల్లర ధర | 4.65 |

# నేడు ఢిల్లీకి సీఎం కేసీఆర్
### రేపు ప్రధాని నరేంద్రమోదీతో భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్థికమాంద్యం నేపథ్యంలో రాష్ట్రానికి ఇచ్చే నిధులను పెంచాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరనున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రితో సమావేశం కావడంకోసం గురువారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్తారు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రధానమంత్రితో సీఎం భేటీ అవుతారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఈ భేటీలో చర్చిస్తారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను పెంచడంతోపాటు రాష్ట్రంలో ఏదైనా ఒక ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలని ప్రధానిని సీఎం కోరనున్నారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయప్రాజెక్టు హోదా కల్పించాలని ఇదివరకే అనేకసార్లు ప్రధానిని

మిగతా 4వ పేజీలో

# పండుగపూట సమ్మె వద్దు
### ప్రయాణికులకు ఇబ్బంది.. సంస్థకూ నష్టం


- ఆర్టీసీ సమస్యలపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి
- ప్రత్యేక కమిటీ వేశారంటే సానుకూలంగా ఉన్నట్లే
- సమగ్ర నివేదిక తయారీకి సమయం కావాలి
- మాకు పూర్తి నమ్మకం ఉన్నది.. కొంత ఓపిక అవసరం
- ఆర్టీసీ యూనియన్ నేతలతో త్రిసభ్య కమిటీ భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దసరా పండుగ నేపథ్యంలో సమ్మె ఆలోచన విరమించుకోవాలని ఆర్టీసీ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన త్రిసభ్య కమిటీ.. యూనియన్ నేతలకు విజ్ఞప్తిచేసింది. ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతాయని, సంస్థ మరింత నష్టపోతుందని పేర్కొన్నది. ఆర్టీసీ సమస్యలపై సీఎం కేసీఆర్ ప్రత్యేకదృష్టి సారించారని, అందుకే ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేశారని తెలిపింది. అన్ని సమస్యలు, డిమాండ్ల సాధనపై పూర్తి పరిశీలన చేసి, సమగ్ర నివేదిక రూపొందించేందుకు సమయం పడుతుందని, అప్పటివరకు సమ్మె ఆలోచన విరమించుకొని ఓపికపట్టాలని జేఏసీ నేతలను కోరింది. బుధవారం ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బీ భవన్‌లో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సోమేశ్‌కుమార్ నాయకత్వంలో ఏర్పాటైన త్రిసభ్య కమిటీ.. అధికారులు, యూనియన్ నేతలతో సమావేశమైంది. ఈ చర్చల్లో సోమేశ్‌కుమార్, కమిటీ సభ్యులు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ, ఆర్టీసీ జేఏసీ నాయకులు అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డి, థామస్‌రెడ్డి, తిరుపతి, వీఎస్‌రావు, ఇతర నేతలు పాల్గొన్నారు. మంగళవారం నాటి క్యాబినెట్ సమావేశంలో

మిగతా 4వ పేజీలో

# నిజాం నిధులు భారత్‌కే


7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్

- 307 కోట్ల సొమ్ము భారత ప్రభుత్వానికి, నిజాం వారసులకే చెందాలి
- సొమ్ము ఎవరు తీసుకోవాలనేది వారే నిర్ణయించుకోవాలి
- 70 ఏండ్ల కేసులో లండన్ కోర్టు తీర్పు
- దశాబ్దాలపాటు పోరాడిన పాకిస్థాన్‌కు భంగపాటు

**లండన్, అక్టోబర్ 2:** హైదరాబాద్ నిజాం నవాబు లండన్‌లోని నాట్‌వెస్ట్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన 3.5 కోట్ల పౌండ్లు (సుమారు రూ.307 కోట్లు) ఆయన వారసులకే దక్కుతాయని లండన్ కోర్టు బుధవారం తీర్పు చెప్పింది. ఈ నిధుల కోసం ఏడు దశాబ్దాలపాటు న్యాయపోరాటం చేసిన పాకిస్థాన్‌కు భంగపాటు ఎదురైంది. లండన్‌లోని రాయల్ కోర్ట్స్ ఆఫ్ జస్టిస్‌కు చెందిన జస్టిస్ మార్కస్ స్మిత్ తీర్పును వెలువరిస్తూ 'సదరు నిధులు

మిగతా 7వ పేజీలో




epaper.ntnews.com



అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎంపీ కే కేశవరావు, మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, మల్లారెడ్డి, సబిత తదితరులు

# అసెంబ్లీ ఆవరణలో గాంధీకి నివాళి


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహాత్మాగాంధీ 150 వ జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. అసెంబ్లీ ఆవరణలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు గొంగిడి సునీత, బాల్క సుమన్, ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, నవీన్‌కుమార్, రఘోత్తంరెడ్డి, ఎగ్గె మల్లేశం, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయ కార్యదర్శి కే రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

### లండన్‌లో పోచారం నివాళి

గాంధీ 150వ జయంతి సందర్భంగా లండన్‌లో గాంధీ విగ్రహం వద్ద అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. అధికారిక పర్యటనలో భాగంగా బ్రిటన్‌లో పర్యటిస్తున్న స్పీకర్.. లండన్‌లోని టావోస్టిక్ స్క్వేర్‌పార్క్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో బ్రిటన్‌లోని ఇండియన్ హైకమిషనర్ రుచి ఘనశ్యాం, అసెంబ్లీ కార్యదర్శి దాంతం నర్సింహాచార్యులు పాల్గొన్నారు.



అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, తదితరులు



లండన్‌లోని టావోస్టిక్ స్క్వేర్ పార్క్‌లోని గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

# జాతిపితకు ఘననివాళి

బాపూఘాట్‌లో పుష్పాంజలి ఘటించిన గవర్నర్, సీఎం

సర్వమత ప్రార్థనలతో గాంధీకి శ్రద్ధాంజలి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నివాళులర్పించింది. లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సహా పలువురు ప్రముఖులు బాపూజీకి పుష్పాంజలి ఘటించారు. తొలుత బాపూఘాట్‌కు చేరుకొన్న సీఎం కేసీఆర్.. గవర్నర్ తమిళిసైకి సాదరంగా స్వాగతం పలికారు. ఇద్దరూ కలిసి బాపూ స్మారకం వద్ద పుష్పాలు ఉంచి ప్రదక్షిణలు నిర్వహించారు. అక్కడి నుంచి నేరుగా ప్రార్థనామందిరానికి చేరుకొని గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. సమాచారశాఖ ఏర్పాటుచేసిన సర్వమత గురువుల ప్రవచనాలు, ప్రార్థనల కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల (రాంకోఠి) బృందం ఆలపించిన భజనలను ఆలకించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రులు చామకూర మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఎంపీలు కే కేశవరావు, సంతోష్‌కుమార్, బండా ప్రకాశ్, రంజిత్‌రెడ్డి, మాజీమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, ఎంఎస్ ప్రభాకర్‌రావు, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, బాల్క సుమన్, బేతి సుభాష్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పన్యాల భూపతిరెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ ఎంకే సింగ్, జీఏడీ (పొలిటికల్) ప్రిన్సిపల్ సెక్రటరీ అధర్‌సిన్హా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, నగర సీపీ అంజనీకుమార్, జిల్లా కలెక్టర్ మాణిక్‌రాజ్ కన్నన్, పలువురు కార్పొరేటర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### విద్యాసంస్థల్లో 'స్వచ్ఛ క్యాంపస్'

**యాక్షన్ ప్లాన్‌ను ఆవిష్కరించిన గవర్నర్**

గాంధీ జయంతిని పురస్కరించుకొని ఉన్నత విద్యాసంస్థల్లో చేపట్టనున్న వార్షిక స్వచ్ఛ క్యాంపస్ యాక్షన్ ప్లాన్‌ను రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ బుధవారం ఆవిష్కరించారు. నేషనల్ సర్వీస్ స్కీంలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో దేశంలోని 45 వేల విద్యాసంస్థల్లో స్వచ్ఛ క్యాంపస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. విద్యాసంస్థల పరిధిలో జలశక్తి గ్రామ్ అండ్ స్వచ్ఛ క్యాంపస్ పేరిట వార్షిక యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు.



జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యాలయంలో గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న పురపాలకశాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో మేయర్ బొంతు రామ్మోహన్ కూడా ఉన్నారు.

# అహింసకు ప్రతిరూపం మహాత్ముడి జీవితం

- పురపాలకశాఖ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** జాతిపిత మహాత్మాగాంధీ 150 వ జయంతిని పురస్కరించుకొని మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు బుధవారం బుద్ధభవన్‌లోని జీహెచ్‌ఎంసీ విపత్తు నిర్వహణ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. అక్కడ ఏర్పాటుచేసిన గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేశానికి గాంధీ చేసిన సేవలను మంత్రి కేటీఆర్ గుర్తుచేసుకొన్నారు. అసలైన భారతీయతకు, అహింసకు, నిరాడంబరతకు ఆయన జీవితం నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. ఇప్పటితరానికి గాంధీజీ సిద్ధాంతాలు స్ఫూర్తిని అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఢిల్లీకి సీఎం కేసీఆర్

మూడోపేజీ తరువాయి...

సీఎం కోరిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో గొలుసుకట్టు చెరువుల పూడిక తీసే 'మిషన్ కాకతీయ' కార్యక్రమాన్ని నీతిఆయోగ్ ప్రశంసించింది. దీనివల్ల తెలంగాణలో భూగర్భజలాలు పెద్దఎత్తున పెరుగుతున్నాయి. ఈ పథకానికి ఆర్థిక సహాయం అందించాలని గతంలోనే ప్రధానికి సీఎం విజ్ఞప్తిచేశారు. ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించే మిషన్ భగీరథ పథకాన్ని స్వయంగా ప్రధానే రాష్ట్రానికి వచ్చి ప్రారంభించారు. ఈ పథకానికి ఆర్థికసాయం అందించాలని నీతి ఆయోగ్ కేంద్రానికి సిఫారసు కూడా చేసింది. ఈ రెండు పథకాలకు ఆర్థిక సహాయమివ్వాలని ప్రధానిని ఈ భేటీలో కోరనున్నారు. కంటోన్మెంట్ ఏరియాలో రోడ్ల విస్తరణకు భూములు ఇవ్వాలని ఇదివరకే కేంద్రాన్ని సీఎం కోరారు. తాజాగా మరోసారి ఈ భూమిని ఇచ్చే విషయంపై ప్రధానితో సీఎం చర్చించనున్నారు.

# మనవే తక్కువ అప్పులు!

పరిమిత అప్పులున్న రాష్ట్రాల్లో 17%తో రెండోస్థానంలో తెలంగాణ




అన్ని రాష్ట్రాల సగటు అప్పు 24.9%

30% పరిధిదాటిన ఆరు పెద్దరాష్ట్రాలు

2020లో తెలంగాణ అప్పు 17% లోపే

- ఆర్‌బీఐ తాజా నివేదికలో వెల్లడి

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

సంపదను గణనీయంగా పెంచుకుంటూ తక్కువ రుణాలు తీసుకుంటున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందువరుసలో నిలిచింది. ఫిస్కల్ రెస్పాన్స్‌బిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌ఆర్బీఎం) కింద మొత్తం జీఎస్డీపీలో 25% వరకు అప్పులు తీసుకోవటానికి తెలంగాణకు వీలున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఈసారి 2020లో అప్పులు 17% మించక పోవచ్చునని రిజర్వ్ బ్యాంక్ తాజా నివేదిక అంచనా వేసింది. మరోవైపు దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతుండగా రాష్ట్రంలో మాత్రం తక్కువగా ఉన్నదని కార్మికశాఖ విడుదలచేసిన త్రైమాసిక గణాంకాల్లో వెల్లడైంది. చాలా రాష్ట్రాలు పరిమితికి మించి అప్పు తీసుకుని ఎఫ్‌ఆర్బీఎం పరిధిని దాటాయి. ఐదు రాష్ట్రాలు మాత్రమే పరిమితికి లోబడి అప్పులు తీసుకున్నాయి. అందులో మహారాష్ట్ర మొదటిస్థానంలో, తెలంగాణ రెండోస్థానంలో నిలిచాయి. మహారాష్ట్ర 16.9%, తెలంగాణ 17.0%, అసోం 18.9%, గుజరాత్ 19.2%, కర్ణాటక 18.7% అప్పులు తీసుకున్నాయి. పరిధులు దాటకుండా అప్పులు తీసుకుని ఆర్థిక క్రమశిక్షణ కలిగిన రాష్ట్రంగా తెలంగాణ ఖ్యాతికెక్కింది. ఇక అత్యధికంగా అప్పులు తీసుకున్న ఆరు రాష్ట్రాల్లో పంజాబ్ తన జీఎస్డీపీలో 39%, ఉత్తరప్రదేశ్ 38.1%, హిమాచల్‌ప్రదేశ్ 34.9%, రాజస్థాన్ 33.6%, పశ్చిమబెంగాల్ 32.6%, ఆంధ్రప్రదేశ్ 31% అప్పులు తీసుకున్నాయి. ఇప్పటివరకు మొత్తం పరిస్థితిని అంచనావేస్తే 20.77 శాతానికి లోబడే తెలంగాణ అప్పు తీసుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆఖరునాటికి జీఎస్డీపీ మొత్తంలో 17% వరకు మాత్రమే అప్పు ఉండే అవకాశమున్నదని ఆర్‌బీఐ తన తాజా నివేదికలో పేర్కొన్నది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాటినుంచి జీఎస్డీపీ పరిమితి కంటే దాదాపు 8% నుంచి 10% వరకు తక్కువ అప్పులు చేస్తున్నట్లు ఆర్‌బీఐ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత రాష్ట్రసంపద పెంచుకోవడంతోపాటు స్థిరమైన వృద్ధిరేటు సాధించి, ముందువరుసలో నిలిచింది. జీఎస్డీపీ వృద్ధిరేటులో అగ్రపథాన సాగిపోతున్నది. వాస్తవానికి 2016లో మొత్తం జీఎస్డీపీలో 15.7% అప్పులున్నాయి. 2017లో అది 12.4 శాతానికి తగ్గింది. 2018లో 21.3 శాతానికి పెరిగినా.. 2019లో 16.5శాతానికే పరిమితమైందని ఆర్‌బీఐ తన నివేదికలో పేర్కొన్నది.

### 8.66 లక్షల కోట్లకు పెరిగిన సంపద

తాజా లెక్కల ప్రకారం 2018-19 ఆర్థికసంవత్సరంలో వివిధరంగాల్లో రాష్ట్రం మొత్తం సంపద రూ.8,66,688 కోట్లకు పెరిగింది. 2014-15లో 12% ఉన్న జీఎస్డీపీ వృద్ధిరేటు 2015-16లో 14.2%గా, 2016-17లో 14.2%గా 2017-18లో 14.3 శాతంగా ఉండగా.. ఈసారి 14.8%కు పెరిగింది. రాష్ట్ర స్థూల గృహోత్పత్తి ప్రస్తుత ధరల వద్ద 10.5%కి పెరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో అది 5.4 %గానే ఉండేది. అదే సమయంలో దేశ జీడీపీ 6.8 శాతంగానే ఉన్నది. 2018-19 ఆర్థికసంవత్సరంలో డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ముందస్తు అంచనాల ప్రకారం రాష్ట్ర మొత్తం సంపద ప్రస్తుత ధరలవద్ద రూ.8,65,688 కోట్లకు పెరిగింది. గతేడాది ఇదే సమయానికి రూ.7,53,804 కోట్లుగా ఉన్న సంపద అదనంగా రూ.1,13,071 కోట్లు పెరిగింది. ఇది మొత్తం జాతీయ సంపదలో 4.43 శాతంగా ఉన్నది. ఉమ్మడి రాష్ట్రంలో వాటా కేవలం 3.95 శాతంగా ఉండటం గమనార్హం. గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ ప్రస్తుత ధరల వద్ద రూ.8,66,875 కోట్లుగా ఉండగా జాతీయస్థాయిలో జీడీపీ రూ.1,90,53,967 కోట్లు గా ఉంటుందని 2018-19 ముందస్తు అంచనాల్లో వెల్లడైంది. తెలంగాణ సంపద వృద్ధి రేటు 15%గా ఉండగా, జాతీయస్థాయిలో వృద్ధిరేటు 11.5%గానే ఉన్నది. ఇక 2011-12 స్థిరధరలవద్ద రాష్ట్ర మొత్తం సంపద రూ.6,25,003 కోట్లు కాగా జాతీయసంపద రూ.1,41,00,119 కోట్లుగా ఉన్నది. స్థిరధరల వద్ద రాష్ట్ర సంపద వృద్ధిరేటు 10.6 శాతం కాగా జాతీయస్థాయిలో అది 6.8 శాతంగా మాత్రమే ఉన్నది.

### అదుపులో ద్రవ్యోల్బణం

జాతీయస్థాయితో పోలిస్తే తెలంగాణలో ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నదని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దేశంలో ద్రవోల్బణం అంతకంతకు పెరిగి ఆందోళన కలిగిస్తున్నది. సామాన్యుడికి అందనిస్థాయిలో ధరలు భగ్గుమంటున్నాయి. ప్రస్తుత ధరలు, హోల్‌సేల్ ధరలను పరిగణనలోకి తీసుకుంటే జాతీయస్థాయిలో ద్రవ్యోల్బణం 5.63 శాతంగా ఉండగా రాష్ట్రంలో మాత్రం 4.21 శాతం వరకే ఉన్నది. రాష్ట్రంలో సంక్షేమపథకాల అమలు, పటిష్ఠమైన ప్రజాపంపిణీ వ్యవస్థవల్ల ప్రజల కొనుగోలుశక్తికూడా పెరిగిందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న సంక్షేమపథకాల ఫలాలు క్షేత్రస్థాయిలో అందటం, ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్ఠంగా ఉండటం వల్ల ధరలు అదుపులో ఉండి పౌరుల కొనుగోలు శక్తి పెరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు.

# పండుగపూట సమ్మె వద్దు

మూడోపేజీ తరువాయి...

ఆర్టీసీ పరిరక్షణకు కీలక నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్.. కార్మికుల సమస్యల పరిష్కారం, ఆర్టీసీ రక్షణ కోసం నివేదిక రూపొందించేందుకు సీనియర్ ఐఏఎస్‌లతో త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీ బుధవారం నుంచి పని మొదలుపెట్టింది. జేఏసీ నేతలకు పలు సూచనలు చేసిన త్రిసభ్య కమిటీ.. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని, ఓపికపట్టాలని కోరింది. తొలిదఫా చర్చల వివరాలను సోమేశ్‌కుమార్ అనంతరం మీడియాకు వెల్లడించారు. ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై చర్చించామని, దసరా పండుగ నేపథ్యంలో సమ్మె వద్దని సూచించామని తెలిపారు. ఆర్టీసీ సమస్యలను సమూలంగా పరిష్కరించేందుకే ప్రయత్నిస్తున్నామన్నారు. ఆర్టీసీపై సీఎం కేసీఆర్ ప్రత్యేకదృష్టి సారించారని, ప్రతి అంశంపై చర్చించాలంటే కొంత సమ యం పడుతుందని చెప్పారు. సహజంగానే ప్రభుత్వం వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉంటాయని, సమ్మె విరమించకుంటే ప్లాన్ ఏతోపాటు ప్లాన్ బీ ఉన్నదని అన్నారు. అయితే ఆ అవసరం రాదని, పరిష్కారం అవుతుందని పూర్తి నమ్మకంతో ఉన్నామని సోమేశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ప్రభు త్వం సానుకూల ధోరణితో ఉన్నదని, నేతలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. గురువారం మరోసారి అధికారుల కమిటీ, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య చర్చలు జరుగనున్నాయి.





బుధవారం ఎర్రమంజిల్ ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో జరిగిన చర్చలకు హాజరైన ఆర్టీసీ జేఏసీ నేతలు అశ్వత్థామరెడ్డి తదితరులు చర్చల్లో పాల్గొన్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్ శర్మ

# సమ్మె చట్టవిరుద్ధం

**ఆర్టీసీ యూనియన్లకు లేబర్ కమిషన్ నోటీసులు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 5 నుంచి సమ్మెకు వెళుతున్నట్టు ఆర్టీసీ జేఏసీ ప్రకటించడంపట్ల లేబర్ కమిషన్ అభ్యంతరం వ్యక్తంచేసింది. లేబర్ కమిషన్‌తో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో జేఏసీ చర్య సమంజసం కాదని పేర్కొన్నది. పారిశ్రామిక వివాదాల పరిష్కార చట్టం ప్రకారం.. అంశం చర్చల్లో ఉండగా ఏకపక్షంగా సమ్మెకు వెళ్లటం చట్టవిరుద్ధమని స్పష్టంచేసింది. ఆర్టీసీలో సమ్మెను చట్టవిరుద్ధంగా పరిగణించాల్సి ఉంటుందని జంటనగరాల లేబర్ జాయింట్ కమిషనర్ బుధవారం నోటీసులు జారీచేశారు. ఈ నెల 4న సమావేశం ఉన్నదని, ఇప్పటికే యూనియన్లకు ఈ సమాచారం చేరిందని లేబర్ కమిషన్ పేర్కొన్నది. పరిపాలన కారణాల వల్ల గత సమావేశాలు వాయిదా పడ్డాయని, ఈ నేపథ్యంలో 4వ తేదీ సమావేశం జరుపాలని నిర్ణయించామని తెలిపింది.

# స్థలాలు ఇచ్చి ఫలాలు పొందండి

మేడారం జాతరపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మేడారం జాతరలో సౌకర్యాలు కల్పించేందుకు కనీసం వంద ఎకరాల భూమి కావాలని, దీనికి భూయజమానులు ముందుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి కోరారు. జాతరకు అవసరమయ్యే భూమి ఇచ్చి అభివృద్ధి ఫలాలు అందుకునేలా సహకరించాలని సీఎస్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. జాతరలో పాల్గొనే అనేక సంస్థలు స్థలాలను తమ వ్యాపారాల నిమిత్తం వినియోగించుకుంటాయని, వాటి ఫలాలను భూ యజమానులు పొందుతారని సీఎస్ తెలిపారు.

# హైదరాబాద్ డిజైన్ వీక్‌కు వినూత్న ప్రచారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరల్డ్ డిజైన్ అసెంబ్లీలో భాగంగా నిర్వహిస్తున్న హైదరాబాద్ డిజైన్ వీక్‌కు వినూత్న తరహాలో ప్రచారం చేపడుతున్నారు. ఈ నెల 9 నుంచి 13 వరకు జరిగే కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన, చైతన్యం తీసుకురావడానికి చర్యలు తీసుకున్నారు. ఇండీఫోలియో నెట్‌వర్క్ (ఐఎఫ్‌ఎన్) ఆధ్వర్యంలో ఆటోలు, తదితర ప్రజా రవాణా వాహనాలపై వినూత్నరీతిలో డిజైన్ వీక్ గురించి తెలుపుతూ ప్రచారం చేస్తున్నారు. హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్, హుస్సేన్‌సాగర్, ఇతర ముఖ్య ప్రదేశాలను తెలిపేలా చిత్రాలను అందంగా వేశారు. వీటిద్వారా కార్యక్రమానికి మంచి ప్రచారంతోపాటు డిజైనింగ్ రంగంలోకి ఔత్సాహికులను ఆకర్షించేలా చర్యలు తీసుకున్నారు.

# అంగన్‌వాడీలకు శుభవార్త

### ముహూర్తం



సూర్యోదయం: 6.07 గంటలకు



సూర్యాస్తమయం: 5.59 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, పంచమి ఉదయం 10.11 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: అనురాధ మధ్యాహ్నం 12.09 వరకు, తదుపరి జ్యేష్ఠ, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 1.32 నుంచి 3.01 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 10.04 నుంచి 10.52 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.49 నుంచి 3.37 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.47 నుంచి రాత్రి 7.24 వరకు.

మూడోపేజీ తరువాయి...

ప్రతిస్థాయిలో బాలికలు, మహిళల కోసం దేశంలో ఎక్కడాలేనన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్నాయన్నారు. మహిళల పేరు మీదనే అన్ని పట్టాలు ఇస్తూ, వారికి భద్రత కోసం సమగ్రచట్టాలు చేసి అమలుచేస్తున్న ప్రభుత్వం తమదని చెప్పారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో మహిళలంతా టీఆర్‌ఎస్‌వైపు ఉండి భారీ మెజారిటీ ఇవ్వబోతున్నారని అన్నారు. ప్రతిపక్షాల్ని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు. టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి భారీ మెజారిటీతో గెలుస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ ఏం ముఖం పెట్టుకొని ఓట్ల కోసం మహిళల వద్దకు పోతున్నదో అర్థం కావడంలేదని ఎద్దేవాచేశారు.

### సీఎం కేసీఆర్‌కు ఉద్యోగసంఘాల ధన్యవాదాలు

అంగన్‌వాడీలకు ముందే వేతనాలు విడుదలచేసినందుకు ఉద్యోగుల కుటుంబాల తరపున సీఎం కేసీఆర్, మంత్రి సత్యవతిరాథోడ్‌కు టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కారం రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు భిక్షవమ్మ, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు నల్లా భారతి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.



బతుకమ్మ, దసరా పండుగలకు ఇండ్లకు తరలిపోతున్న ప్రయాణికులతో బుధవారం కిక్కిరిసిపోయిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం

# రైల్వేస్టేషన్లలో ప్లాస్టిక్ వద్దు

ప్రయాణికులను కోరిన రైల్వే జీఎం గజానన్‌మాల్యా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైల్వేస్టేషన్లలో ప్లాస్టిక్ వినియోగం నిషేధమని, ప్రయాణికులు నిబంధనలు పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్‌మాల్యా తెలిపారు. 35 స్టేషన్లలో 54 బాటిల్ క్రషింగ్ మిషన్లను, 28 స్టేషన్లలో 35 సానిటరీ న్యాప్కిన్ ఇన్‌సినరేటర్లను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. రైల్వేస్టేషన్లు, కార్యాలయ భవనాలు, వర్క్‌షాపులు, శిక్షణ సంస్థలకు గ్రీన్ రేటింగ్ సర్టిఫికేషన్ సాధించడానికి ఉద్యమరూపంలో ప్రయత్నం సాగుతున్నదని పేర్కొన్నారు. హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో బుధవారం నిర్వహించిన మహాత్మాగాంధీ జయంతి వేడుకలో మాల్యా అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులతో స్వచ్ఛతా ప్రమాణం చేయించారు. ప్లాస్టిక్ ఉపయోగించం అని సంతకాల సేకరణ చేపట్టారు. హైదరాబాద్ రైల్వేస్టేషన్‌కు ఐఎస్వో 14001 సర్టిఫికేట్ అవార్డు రావటంపై సంతోషం వ్యక్తంచేశారు. విద్యుదీకరించిన బీబీనగర్- నల్లపాడు సెక్షన్‌లో హైదరాబబాద్- నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను పర్యావరణ అనుకూలంగా ఉత్తమ సదుపాయాలతో నడుపుతున్నట్టు తెలిపారు.

# ఐఎంఎస్ స్కాంలో మరో అక్రమం

ఓమ్ని మెడి ఉద్యోగి ఇంట్లో అధికారిక డాక్యుమెంట్లు

46 కోట్ల విలువైన ఒరిజినల్ పర్చేజ్ ఆర్డర్లు, ఇండెంట్లు


ఐఎంఎస్ డైరెక్టరేట్‌లో ఉండాల్సినవి ప్రైవేటు వ్యక్తి వద్ద

తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్న ఏసీబీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) మందుల కొనుగోలు కుంభకోణంలో మరో అక్రమం వెలుగుచూసింది. ఐఎంఎస్ డైరెక్టరేట్‌లో ఉండాల్సిన అధికారిక పత్రాలు, ఇతర పత్రాలు ఓమ్నీ మెడి రిప్రజెంటేటివ్‌గా పని చేసిన నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో లభించిన వైనం నిత్యం అవినీతి కేసుల దర్యాప్తులో తలమునకలయ్యే ఏసీబీ అధికారులను సైతం నివ్వెరపరుస్తున్నది. వందా వెయ్యి కాదు.. ఏకంగా రూ.46 కోట్ల విలువైన ఒరిజినల్ కొనుగోలు ఆర్డర్లు, ఇండెంట్లు నాగరాజు ఇంట్లో తనిఖీల సందర్భంగా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఒక్కో పర్చేజ్ ఆర్డర్ కనీసం రూ.3 లక్షల నుంచి రూ.36 లక్షల వరకు ఉన్నట్టు తెలుస్తున్నది. ఇటువంటివి వందకుపైగా ఒరిజినల్ పత్రాలు బయటపడటం గమనార్హం. ఓమ్నీ మెడీ ఎండీ శ్రీహరిబాబు, ఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణిసహా ప్రతి ఒక్కరు ఎవరిస్థాయిలో వారు అవినీతి సొమ్ముకోసం బరితెగించడాన్ని చూసి అధికారులు సైతం ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఎవరేంచేస్తారులే అన్న ధీమాకు తోడు ఓమ్నీ మెడి ఎండీకి ఉన్న లింకులతో భారీస్థాయిలో అక్రమాలకు పాల్పడినట్టు తెలుస్తున్నది. ఇప్పటికే ఏసీబీ అధికారులు నాగరాజును అరెస్టు చేశారు. నాగరాజు ఇంట్లో దొరికిన ఇంకొన్ని పత్రాలు, ఇతర సాంకేతిక ఆధారాల మదింపుపై ఏసీబీ అధికారులు దృష్టిసారించారు. నాగరాజుతోపాటు అరెస్టుచేసిన ఇతర సిబ్బందిని తమ కస్టడీకి ఇవ్వాలనీ ఏసీబీ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలుచేసిన విషయం తెలిసిందే. నిందితులందరినీ కస్టడీకి తీసుకుని విచారిస్తే.. వారిచ్చే సమాచారంతో మరెన్ని అక్రమ చిట్టాలు బయటికి వస్తాయోనన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సీఎంఏలో కిరణ్‌కు ఆలిండియా 2వ ర్యాంక్

మంచిర్యాల జిల్లావాసి ప్రతిభ



**దండేపల్లి:** సీఎంఏ (కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్)లో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రానికి చెందిన అయ్యోరు కిరణ్ ఆలిండియా రెండో ర్యాంకుతో సత్తాచాటాడు. బుధవారం ఫలితాలు విడుదలయ్యాయి. 800 మార్కులకు 541 మార్కులు (67.63) సాధించాడు. కిరణ్ తల్లిదండ్రులు శంకరయ్య,ఉమ స్థానికంగా టైలరింగ్ చేస్తుంటారు. అతని తమ్ముడు ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్నాడు. కిరణ్ ప్రాథమిక విద్యాభ్యాసం దండేపల్లిలో, బెల్లంపల్లి గురుకుల పాఠశాలలో, ఇంటర్ ట్రినిటీ కళాశాలలో కొనసాగింది. మెకాన్ లిమిటెడ్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ ఉద్యోగానికి కిరణ్ ఎంపికయ్యాడు. బాగా చదవగలననే ఆత్మవిశ్వాసం, కష్టపడే తత్వం ఉంటే ఏమైనా సాధించవచ్చని కిరణ్ ఈ సందర్భంగా చెప్పాడు.

# చైతన్య స్ఫూర్తి

## 30రోజుల ప్రణాళికతో ప్రజల్లో మార్పు

**గ్రామాల అభివృద్ధికి విశేష కృషి • స్వచ్ఛత దిశగా పల్లెల పయనం • 27వ రోజు కొనసాగిన శ్రమదానాలు**

**సొంతూర్ల ఉన్నతికి విరాళాల వెల్లువ • పారిశుద్ధ్యానికి విఘాతం కలిగించిన వారికి జరిమానాలు**



బుధవారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేటలో చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞచేస్తున్న గ్రామస్థులు

**30రోజుల ప్రణాళిక ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని రగిలించింది. ఊళ్లను అభివృద్ధి చేసుకొనేందుకు ముందుకురావాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునకు గ్రామీణుల్లోంచి విశేష స్పందనవచ్చింది. పారిశుద్ధ్య నిర్వహణ, డంపింగ్‌యార్డులు, శ్మశానవాటికల నిర్మాణాలతోపాటు మొక్కల పెంపకంలో గ్రామస్థుల భాగస్వామ్యం పెరిగింది. 27వ రోజు బుధవారం శ్రమదాన కార్యక్రమాలు విరివిగా జరుగగా, పలుజిల్లాల్లో మంత్రులు పాల్గొన్నారు. సొంతూర్ల అభ్యున్నతికి విరాళాలు వెల్లువెత్తుతుండగా, పారిశుద్ధ్యానికి విఘాతం కల్పిస్తున్న పలువురికి జరిమానాల పరంపర కొనసాగుతున్నది.**

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:**

30 రోజుల ప్రణాళిక ఉత్సాహంగా కొనసాగుతున్నది. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జెడ్పీ చైర్మన్ జనార్దన్‌రాథోడ్, స్థానిక ఎమ్మెల్యే జోగురామన్న పిచ్చిమొక్కలను తొలగించారు. స్టేడియం పరిసరాలను శుభ్రపరచాలని ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్‌కు వచ్చేవారికి ఇబ్బందులు కలిగించకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్‌డీవో వెంకట్వేర్లుకు జెడ్పీచైర్మన్ సూచించారు.

### ఉత్సాహంగా ప్రణాళిక పనులు

రాష్ట్రవ్యాప్తంగా 30 రోజుల పల్లెప్రణాళిక కార్యాచరణ పనులు ఉత్సాహంగా సాగుతున్నాయి. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం నాడపూర్‌లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు మొక్కలు నాటారు. 30 రోజుల ప్రణాళికతో గ్రామాలు స్వచ్ఛంగా మారుతున్నాయని చెప్పారు. నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి మండలాల్లో కలెక్టర్ రామ్మోహన్‌రావు పర్యటించి పనులను పరిశీలించారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పల్లెప్రణాళిక పనులను పరిశీలించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పల్లెప్రగతి కార్యక్రమం జోరుగా సాగుతున్నది. బాలానగర్ మండలం మోతీఘణపూర్, సూరారం, గంగాధరపల్లిలో 30 రోజుల ప్రణాళిక పనులను జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరిశీలించారు. గ్రామాల అభివృద్ధిలో స్థానికుల పాత్ర చక్కగా ఉన్నదని ఆయన అభినందించారు. భూత్పూరు మండలం హస్నాపూర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం పోల్కంపల్లిలో సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో 500 మంది మహిళలు శ్రమదానం చేశారు.

### విద్యుత్ సమస్యల పరిష్కారం

పల్లె ప్రణాళికలో భాగంగా చేపట్టిన పవర్‌వీక్‌లో విద్యుత్ సమస్యలు తొలగుతున్నాయి. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రణాళిక కార్యాచరణ ముమ్మరంగా సాగుతున్నది. బుధవారం జిల్లావ్యాప్తంగా కరంటు సమస్యలను పరిష్కరించారు. ఈ పనులను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. కలెక్టర్ మస్రత్ ఖానమ్ ఆయేషా వికారాబాద్‌లోని రామయ్యగూడలో తడి, పొడిచెత్తపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఇండ్ల ముందు చెత్తచెదారం కనిపిస్తే ఉపేక్షించేదిలేదని కలెక్టర్ హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో జెడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ శ్రమదానంలో పాల్గొని పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం పారిశుద్ధ్యం పట్ల గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

### ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్లాస్టిక్ నిషేధంపై జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. జనగామ జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతర్యాలీలు, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు, తడి,పొడి చెత్తబుట్టల పంపిణీ నిర్వహించారు. బచ్చన్నపేట మండలం వీఎస్‌ఆర్‌నగర్, కట్కూరు, జనగామ మండలం గోపిరాజుపల్లి గ్రామాలను జిల్లా కలెక్టర్ టీ వినయ్‌కృష్ణారెడ్డి గ్రామస్థులకు చెత్తబుట్టలను అందజేశారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ట్రాన్స్‌కో డీఈ విద్యుత్ లైన్లను మరమ్మతు చేయించారు. 30 రోజుల ప్రణాళికలో భాగంగా తమ గ్రామాన్ని చెత్త రహితంగా తీర్చి దిద్దుతామని జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగలిపేట గ్రామస్థులు బుధవారం ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు పారిశుద్ధ్యంపై ప్రత్యేకాధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో ర్యాలీ తీసి ప్రజలకు అవగాహన కల్పించారు. సంగారెడ్డిని ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ హనుమంతరావు పిలుపునిచ్చారు. 30 రోజుల ప్రణాళిక కార్యాచరణ అమల్లో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. జిల్లాలో సేకరించిన ప్లాస్టిక్‌ను బుధవారం కలెక్టరేట్ నుంచి ఫ్యాక్టరీలకు తరలించగా, కలెక్టర్ హనుమంతరావు జెండా ఊపి ప్లాస్టిక్ వ్యర్థాల ట్రక్కులను ప్రారంభించారు. అందోలు - జోగిపేట మున్సిపాలిటీలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో మెగా శ్రమదానం కార్యక్రమం చేపట్టారు. జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, కలెక్టర్, యువజన సంఘాల ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### పదెకరాల్లో వెయ్యి మొక్కలు

30 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా హరితహారం కార్యక్రమం కొనసాగుతున్నది. బుధవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట శివారులోని పదెకరాల ప్రభుత్వభూమిలో యువత, మహిళలు గ్రామస్థులు బుధవారం సుమారు వెయ్యి మొక్కలు నాటారు.

### తెలంగాణ జాతిపిత కేసీఆర్: మంత్రి ఎర్రబెల్లి

సీఎం కేసీఆర్ తెలంగాణ జాతిపిత అని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కొనియాడారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చుంచుపల్లి మండలం చుంచుపల్లి తండాలో మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, ఎంపీ నామానాగేశ్వర్‌రావు, ప్రభుత్వ విప్ రేగా కాంతారావుతో కలిసి ఎర్రబెల్లి దయాకర్ 30 రోజుల ప్రణాళిక పనులను పరిశీలించి అనంతరం మొక్కలు నాటారు. చుంచుపల్లి తండాలో నిర్వహించిన గ్రామసభలో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ నిరంతర ప్రక్రియ అని ప్రజలందరూ శ్రమదానంలో పాల్గొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మంత్రులు పువ్వాడ అజయ్, సత్యవతి రాథోడ్, ఎంపీ నామానాగేశ్వర్‌రావు తదితరులు ప్రసంగించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ కార్యాలయంలో 30 రోజుల పల్లె కార్యాచరణ ప్రణాళికపై జిల్లా అధికారులతో మంత్రులు సమీక్షించారు. అనంతరం మంత్రులు ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలం భవాన్‌నాయక్‌తండాలో పల్లె ప్రణాళిక పనులను పరిశీలించి గ్రామంలో శ్రమదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వర్‌రావు, బానోత్ హరిప్రియనాయక్, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శ్రమదానం చేస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే జోగు రామన్న



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో శ్రమదానం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



ఖమ్మం జిల్లా ఎన్కూర్‌లో ఓ పెట్రోల్‌బంక్ పరిసరాలను పరిశీలిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పువ్వాడ అజయ్, ఎంపీ నామా నాగేశ్వరరావు


### మా ఊరు పచ్చగయితంది



30 రోజుల పనిల మొక్కలు నాటడంతో మా ఊరు పచ్చగయితంది. మేము ఉండేదే గుట్టలప్రాంతంలో. కానీ చెట్టనేదే కన్పించకుండా పోయింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ దయ వల్ల మా ఊరు ఏడాది తిరగకుండా పచ్చబడతది. గతంల గెలిచినోళ్లు పల్లెలను బీడులుగా మార్చిండ్రు. కేసీఆర్ సారు వచ్చినంక హరితహారం స్టార్ట్ చేసిండ్రు. మా ఊళ్లో మా సర్పంచ్, అధికారులతో కలిసి చాలా మొక్కలు నాటినం. గంటల గూడెం నుంచి సింగరేణి రోడ్డు వరకు రెండువైపుల పెట్టిండ్రు. నాటిన ప్రతి మొక్కకు కంచెలు ఏర్పాటు చేసిండ్రు. పెద్దపెద్ద సార్లు వస్తుండ్రు.. పనులను చేపిస్తుండ్రు. ముఖ్యమంత్రి సారు ఊరికి మంచి పనులు చేపిస్తున్నందుకు మాలాంటి గిరిజనులు ఉండే గ్రామాల్లో అందరు చానా సంతోష పడ్తుండ్రు.

**- కుర్సింగ చిన్ను, నర్సాపూర్, తాండూర్, మంచిర్యాల జిల్లా**

### కరంటు ప్రమాదాలు ఇక ఉండవు



మా గ్రామంలో భవిష్యత్‌లో కరంటు ప్రమాదాలు లేకుండా అధికారులు పనులు చేపిస్తుండ్రు. సీఎం కేసీఆర్ మొదలుపెట్టిన 30రోజుల గ్రామ కార్యాచరణ ప్రణాళికలో మాదారం పంచాయతీ పరిధిలో చాలా ప్రాంతాల్లో కరంటు పనులు పూర్తిచేసిండ్రు. పాఠశాల ఏరియాలో ఇండ్లపై ప్రమాదకరంగా ఉన్న వైర్లు, కిందకి వేలాడుతున్న తీగలను సరిచేసిండ్రు. వంగిన స్తంభాలు ఉన్నచోట కొత్తవాటిని పెట్టించిండ్రు. కరంటు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టివేయించిండ్రు. మాదారం, పోచంపల్లిలో వీధిదీపాల కోసం సెపరేట్‌గా వైర్లు పెట్టిండ్రు. కలలో కూడా కావనుకున్న పనులన్నీ అయిపోతున్నాయి. కేసీఆర్ సార్‌కు రుణపడి ఉంటాం.

**- మెకార్తి సూర్యప్రకాశ్, మాదారం, తాండూర్, మంచిర్యాల జిల్లా**

### ఊరంతా శుభ్రమయింది..



అందరం కలిసి మా ఊరిని బాగుచేసుకున్నాం. ఇంటితోపాటు ఊరిని మంచిగ చేసుకోవాలని అధికార్లు చెప్పితే ప్రతిఒక్కరు ముందుకొచ్చిండ్రు. ఇప్పుడు తాండూరు పరిశుభ్రంగా అయ్యింది. 30 రోజుల ప్రణాళికను విజయవంతం చేసేందుకు ప్రతి అధికారి, సర్పంచ్, వార్డుమెంబర్లు మంచిగ పనిచేస్తున్నరు. తాండూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బోయపల్లి బోర్డు వద్ద రోడ్లకిరువైపులా శుభ్రం చేసినం. కొత్తగుడిసెల నుంచి శనివారం అంగడి రైల్వేగేట్ వరకు కలెక్టర్ కూడా మాతో కలిసి శ్రమదానంలో పాల్గొని పిచ్చిమొక్కలు తొలగించడంతో రోడ్డుకిరువైపుల పరిశుభ్రంగా తయారైంది. ఇలాంటి కార్యక్రమాలు ఎప్పటికీ చేస్తూనే ఉండాలి.

**- అజీజాబాను, తాండూర్, మంచిర్యాల జిల్లా**

## పారిశుద్ధ్యలోపంపై మంత్రుల ఆగ్రహం

- వైరా, ఏన్కూరు మండలాల్లో ప్రణాళిక పనుల పరిశీలన
- రోడ్డుపై చెత్తవేసిన పలువురికి రూ.6,500 జరిమానా
- గుబ్బగుర్తి, ఏన్కూరు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

**కొణిజర్ల:** పల్లె ప్రగతి పనుల పరిశీలనలో భాగంగా బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరావు పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో రోడ్డుపై ఉన్న చెత్తను గమనించిన మంత్రులు వాహనాలు ఆపి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడిన మంత్రులు పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డుపై చెత్త వేసినందుకు దుకాణ యజమాని బండి శ్రీరాములుకు రూ.500 జరిమానా విధించారు. అలాగే ఏన్కూరు మండల కేంద్రంలో వెంకటకృష్ణా ట్రేడర్స్ యజమాని రాయల వీరభద్రరావుకి రూ.5000, ఐసర్ పెట్రోల్ బంక్ యజమాని చందమామ నరసింహారావుకు రూ.1000 జరిమానా విధించారు. అలాగే విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన గుబ్బగుర్తి, ఏన్కూరు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సతీశ్, వెంగళరావులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

## గ్రామాభివృద్ధికి భారీగా విరాళాలు

- సంగారెడ్డి జిల్లా బొంతపల్లికి రూ.70 లక్షలిచ్చిన హెటిరో డ్రగ్స్



సంగారెడ్డి జిల్లా బొంతపల్లిలో హెటిరో సంస్థ ప్రతినిధి ఉమామహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు

**గుమ్మడిదల:** సీఎం కేసీఆర్ పిలుపుతో గ్రామాల అభివృద్ధికి పరిశ్రమలు సైతం ముందుకొస్తున్నాయి. బుధవారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి అభివృద్ధికి హెటిరో డ్రగ్స్ పరిశ్రమ రూ.70 లక్షల సీఎస్‌ఆర్ నిధులను కేటాయించింది. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధి ఉమామహేశ్వర్‌రెడ్డిని సర్పంచ్ ఆలేటి నవీనా శ్రీనివాస్‌రెడ్డి, పాలకవర్గసభ్యులు ఘనంగా సన్మానించారు.

**నజ్దిక్‌సింగారం అభివృద్ధికి రూ. 2.81 లక్షలు..**

- రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నజ్దిక్‌సింగారం అభివృద్ధికి గ్రామస్థుడు యాచర్ల చంద్రారెడ్డి రూ. 2.81లక్షలు బుధవారం సర్పంచ్ అరుణమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డిని సర్పంచ్, గ్రామస్థులు అభినందించారు.
- జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని రాజారాంపల్లి అభివృద్ధికోసం గ్రామానికి చెందిన ఏలేటి దేవేందర్‌రెడ్డి తన తాత ఆశిరెడ్డి జ్ఞాపకార్థం బుధవారం రూ.లక్ష విరాళం సర్పంచ్ గెల్లు శేఖర్‌కు అందజేశారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం చుంచుపల్లి తండాకు ఎంపీ నామా నాగేశ్వర్‌రావు తన నిధుల నుంచి రూ. 5లక్షలు కేటాయించారు. ఈమేరకు ఆయన బుధవారం గ్రామసభలో ప్రకటించారు. గ్రామసర్పంచ్ మాలోత్ ధనలక్ష్మి కూడా గ్రామాభివృద్ధి కోసం రూ.5 లక్షలు విరాళంగా అందజేయనున్నట్టు తెలిపారు.
- నిజామాబాద్ జిల్లా ఏర్గట్లకు చెందిన ఇంజినీర్ మిట్టపల్లి జగన్‌రెడ్డి, నిజామాబాద్‌లో స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తున్న అతడి సోదరుడు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఏర్గట్ల గ్రామంలో నాటిన మొక్కల సంరక్షణకు ట్రీగార్డుల ఏర్పాటుకు రూ.25 వేల విరాళాన్ని బుధవారం గ్రామ పంచాయతీ పాలకవర్గానికి అందజేశారు.

## మొక్కలు ధ్వంసం చేసిన వ్యక్తికి 30 వేల జరిమానా

**సిద్దిపేట కలెక్టరేట్:** సిద్దిపేట పట్టణంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను ధ్వంసం చేసిన వ్యక్తికి మున్సిపల్ అధికారులు రూ.30 వేల జరిమానా విధించారు. పట్టణంలోని మిలాన్ గార్డెన్ రోడ్డులో బృందావన్ కాలనీకి ఎదురుగా నాటిన హరితహారం మొక్కలను తేల్జురు బాలయ్య అనే వ్యక్తి ధ్వంసం చేశారు. గమనించిన హరితహారం ప్రత్యేకాధికారి ఐలయ్య విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ బర్ల మల్లికార్జున్ వాటిని పరిశీలించి రూ.30 వేల జరిమానా విధించారు. జరిమానాతో పాటుగా బాలయ్యతో 30 మొక్కలు నాటించి సంవత్సరం వరకు వాటి సంరక్షణ బాధ్యతను అప్పగించారు.

- వికారాబాద్ రామయ్యగూడలో ఓ ఇంటిముందు చెత్తవేసి ఉండటాన్ని గమనించిన కలెక్టర్ ఇంటి యజమానికి రూ. 500 జరిమానా విధించారు.

## పల్లె ప్రగతితో గ్రామాల్లో అభివృద్ధి

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మహబూబ్‌నగర్ జిల్లా కోటకదిరలో శ్రమదానం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో కలెక్టర్ రొనాల్డ్ రోస్

**మహబూబ్‌నగర్:** పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాలు అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయని ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కోటకదిర గ్రామంలో చేపట్టిన శ్రమదానం కార్యక్రమంలో కలెక్టర్ రొనాల్డ్‌రోస్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. రోడ్లు ఊడ్చి మట్టి ఎత్తారు. ఈ సందర్భంగా ప్రజలంతా ఏకమైతే గ్రామాల స్వరూపం మారుతుందని మంత్రి పేర్కొన్నారు.



30 రోజుల ప్రణాళికతో పల్లెలు పరిశుభ్రంగా మారుతున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కొండేరు, కోదండాపురం గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం, కలెక్టర్ శశాంకతో కలిసి మంత్రి పర్యటించారు. పల్లె ప్రగతి పనులను పర్యవేక్షించారు. - ఆయిజ

## దాతల తోడ్పాటు.. వైకుంఠధామం ఏర్పాటు

- శ్మశానవాటికకు భూమి కొనుగోలు
- రూ.లక్ష విరాళమిచ్చిన పంచాయతీ కార్యదర్శి
- సంగారెడ్డి జిల్లా గోసాయిపల్లిలో అర ఎకరం వితరణ



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని ఇప్పలపల్లిలో శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్



సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని గోసాయిపల్లిలో దాతలు ఇచ్చిన స్థలాన్ని చదును చేయిస్తున్న సర్పంచ్

**శంకరపట్నం:** దాతల తోడ్పాటుతో శ్మశానవాటిక సమస్య తొలగిపోయింది. గ్రామంలో ప్రభుత్వ భూమి లేకపోవడంతో కొనుగోలు చేసేందుకు పంచాయతీ పాలకవర్గం నిర్ణయించగా, మొదట రూ.లక్ష విరాళం ఇచ్చి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆదర్శంగా నిలిచారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఇప్పలపల్లిలో దాతల తోడ్పాటుతో శ్మశానవాటిక సమస్య తొలగిపోయింది. శ్మశానవాటిక ఏర్పాటుకోసం సర్పంచ్ బైరి సంపత్ ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. భూమి కొనుగోలు కోసం పంచాయతీ కార్యదర్శి నాగిడి లవారెడ్డి మొదట రూ. లక్ష విరాళమిచ్చి ఆదర్శంగా నిలిచారు. ఆయన స్ఫూర్తితో పలువురు గ్రామస్థులు భూమిని, నగదును ఇచ్చి ఇచ్చి వైకుంఠధామం ఏర్పాటుకు మార్గం సుగమం చేసుకున్నారు. గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి తన భూమిని తక్కువ ధరకు విక్రయించేందుకు ముందుకొచ్చారు. 14 గుంటల స్థలాన్ని విక్రయించడంతోపాటు మరో రెండున్నర గుంటల స్థలాన్ని ఉచితంగా ఇస్తానని హామీఇచ్చారు. గ్రామానికే చెందిన పంజాల స్వామి రెండున్నర గుంటల స్థలాన్ని దానమిచ్చేందుకు హామీఇచ్చారు. బుధవారం శ్మశానవాటిక స్థలాన్ని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి జయశంకర్ పరిశీలించారు.

### అర ఎకరం భూమి వితరణ

**సిర్గాపూర్:** సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని గోసాయిపల్లిలో దాతలు అరఎకరం భూమిని విరాళంగా ఇచ్చారని సర్పంచ్ సాయాగౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన ప్రియదర్శిని, వివేక్‌గిరిపటేల్ రూ.10 లక్షల విలువైన తమ భూమిని దానం చేశారని తెలిపారు.

## రెండు కిలోల ప్లాస్టిక్ వస్తువులకు కిలో బియ్యం

**కథలాపూర్:** ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించేందుకు జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం పోతారంలో పంచాయతీ పాలకవర్గం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రెండు కిలోల ప్లాస్టిక్‌ను సేకరించి తీసుకొచ్చిన వారికి కిలో బీపీటీ బియ్యం అందించనున్నట్టు సర్పంచ్ ధర్మపురి జలేందర్, ఉపసర్పంచ్ అత, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ తెలిపారు.

- వికారాబాద్ జిల్లా పరిగి మండలం జాఫర్‌పల్లి గ్రామస్థులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ తీర్మానం చేశారు.



20వ శతాబ్దం మానవాళి సమస్యలను పరిష్కరిస్తూ స్వేచ్ఛా, సమానత్వాలను ప్రజాస్వామ్య ఫలాలుగా అందించింది. కానీ 21వ శతాబ్దం ప్రజల ఆశలను ఆవిరి చేస్తున్నది. దేశదేశాల్లో ఒకదాని తర్వాత ఒకటిగా ప్రజాస్వామ్యాలకు దూరమవుతున్నాయి. భారత్ ప్రయాణం కూడా ఎటు? స్వేచ్ఛకోసం పోరాటం అంతం లేనిది. నిరంతర జాగరూకతతో ఉండాలి.

**పి. చిదంబరం, సీనియర్ కాంగ్రెస్ నేత**

స్వాతంత్ర్యానంతరం దేశంలో మొదటిసారి ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. దేశంలో మూలమూలలా ప్రజలు భయంతో బతుకులీడుస్తున్నారు. బీజేపీ వారు గాంధీ, అంబేద్కర్ పేరును ఉచ్చరిస్తే సరిపోదు. వారి ఆలోచనల్లో, హృదయాల్లో వారి పట్ల ఏమున్నదో తెలుపాలి. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడని వారికి, బ్రిటిష్ వారికి వత్తాసు పలికిన వారికి గాంధీ పేరును ఉచ్చరించే అర్హత లేదు.

**అశోక్ గెహ్లాట్, రాజస్థాన్ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



## 1908

వియన్నాలో ఆశ్రయం పొంది 'ప్రావ్దా' పత్రికను ప్రారంభించిన లియాన్ ట్రాట్స్కీ.

## 1960

బ్రెజిల్ అధ్యక్షునిగా ఎన్నికైన జానియో కుద్రోస్.





## 1977

భారత ప్రధాని ఇందిరాగాంధీ అరెస్ట్.

పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం, విద్యాప్రమాణాలు పెంచే ప్రక్రియ పట్ల నీతిఆయోగ్ దేశవ్యాప్త గణాంకాలను సేకరించి అధ్యయనం చేస్తున్నది. దీనికిగాను 2015-16 విద్యాసంవత్సరాన్ని భూమికగా చేసుకుని పాఠశాల విద్యలో విద్యార్థుల హాజరు, ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటున్నది. దేశవ్యాప్తంగా వివిధరాష్ట్రాల్లో పాఠశాల విద్యాప్రమాణాలు చూస్తే, కాలంతో పాటు విద్యార్థి విద్యానైపుణ్యాలు పెరుగటానికి బదులు తరిగిపోవటం సమస్యను ఎలా పరిష్కరించాలన్నది తీవ్ర సమస్యగా ఉండటం గమనార్హం.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రేపు న్యూఢిల్లీ చేరుకోనున్న నేపథ్యంలో ఇరుదేశాల మధ్య వలస సమస్య ముందుకు వచ్చే అవకాశం ఉన్నది. అస్సాంలో చేపట్టిన జాతీయ పౌర పట్టికలో లక్షలాదిమంది పేర్లు పౌర రిజిస్టర్‌లో గల్లంతయ్యాయి. వారంతా బంగ్లా సరిహద్దుల నుంచి అక్రమంగా వలసవచ్చిన వారుగా ప్రచారం ఉన్నది. పౌరపట్టికలో పేర్లు లేనంత మాత్రాన ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రం చెబుతున్నా ప్రజల్లో మాత్రం తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో ఇరుదేశాలు వలస సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించేందుకు ప్రయత్నించాలి.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**



# ఎన్నార్సీ వివాదం

జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ) వివాదం రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తున్నది. సరిహద్దురాష్ర్టాల్లో అనిశ్చితి, అభద్రత ఏర్పడుతున్నది. అస్సాం ఎన్నార్సీ వివాదం అటుండగానే కేంద్ర హోంమంత్రి అమిత్ షా పశ్చిమబెంగాల్ పర్యటనలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా ఉన్నాయి. కోల్‌కతాలో జనజాగరణ్ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్‌షా పశ్చిమబెంగాల్‌లో ఎన్నార్సీని తప్పకుండా అమలుచేస్తామని ప్రకటించటమే కాదు, దేశంలోకి అక్రమంగా చొరబడిన వారందరినీ వెళ్లగొడతామని ప్రకటించారు. దేశభద్రత దృష్ట్యా ఎవరేమన్నా ఎన్నార్సీ అన్ని రాష్ర్టాల్లో అమలుచేసి తీరుతామనటం గమనార్హం. అయితే అమిత్‌షా ప్రకటనను విచ్ఛిన్న రాజకీయంగా మమతాబెనర్జీ తీవ్రంగా ఖండించారు. ఈ ఖండన మండనలు అటుంచితే ఈ సందర్భంగా అమిత్ షా వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయి. చొరబాటుదారులను వెళ్లగొట్టే ముందు శరణార్థులైన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులందరికీ భారత పౌరసత్వం కల్పించటానికి పౌరసత్వ (సవరణ) బిల్లును ఆమోదిస్తామని ప్రకటించటం బీజేపీ అనుసరించాలనుకుంటున్న వ్యూహాన్ని చెప్పకనే చెప్పినట్లయింది. పౌర జాబితా రూపకల్పనకు అనుసరిస్తున్న విధానం ఏదైనా ఉంటే, అది కుల మతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు అనువర్తింపచేసేదిగా ఉండాలి. కానీ కొన్ని మత సమూహాలకు మినహాయింపు ఇస్తున్నట్లుగా, నేరుగా కేంద్ర హోంమంత్రి ప్రకటించటం గర్హనీయం. దీనిద్వారా బీజేపీ కొన్నివర్గాలను లక్ష్యంగా చేసుకుని ప్రవర్తిస్తున్నట్లుగా వ్యవహరించటమే తీవ్ర అభ్యంతరకరం.

**ఏ దేశంలో ఏప్రాంతంలో నైనా దేశీయుల గణన కచ్చితమైన రీతిలో ఉండటం భద్రతరీత్యా అనివార్యం. కానీ అస్సాం అనుభవం భద్రతకు బదులు భయాందోళనలు రేకెత్తిస్తున్నది. అస్సాం లో ఏకంగా 40లక్షల మందిని విదేశీయులుగా తేల్చి, వారి భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చేశారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సంక్షోభంగా పరిణమించవచ్చన్న భయాలు కలుగుతున్నాయి. ఇంత సంఖ్యలో విదేశీయులు అంటే, ప్రపంచంలోని శరణార్థుల జనాభాలో పదో వంతు.**

భారతీయులను, విదేశీయులను వేరుచేసేందుకు చేపట్టిన కార్యక్రమమే ఎన్నార్సీ. మొదట 1950లో కేంద్ర ప్రభుత్వం జాతీయ పౌరసత్వ రిజిస్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్వాతంత్ర్యానంతరం తూర్పుపాకిస్థాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్) నుంచి పెద్దమొత్తంలో ఈశాన్యరాష్ర్టాల్లోకి వలసలు కొనసాగిన దాఖలాలున్నాయి. మిగతా రాష్ర్టాల స్థితి ఎలా ఉన్నా, ఈశాన్యరాష్ట్రమైన అస్సాంలో వలసదారుల సమస్య ముందుకు వచ్చింది. ఎనభైయవ దశకంలో అస్సాంలో వలసలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున విద్యార్థి ఉద్యమం పెల్లుబుకింది. వలసదారులను రాష్ట్రం నుంచి పంపించేయాలనే డిమాండ్‌తో ఆల్ అస్సాం స్టూడెంట్ యూనియన్ నేతృత్వంలో ఆందోళన చేపట్టిన విద్యార్థి నేతలు ఏకంగా అధికారంలోకే వచ్చారు. ఆ నేపథ్యంలోంచే 1951 ఎన్నార్సీ రికార్డులను అప్‌డేట్ చేస్తామని 2005లో అస్సాం ప్రభుత్వం ప్రకటించింది. దానికి ప్రాతిపదికగా 1951నాటి జాబితాలో పేరు ఉన్నవారిని,1971 మార్చి 24కు ముందు (ఇండో-పాక్ యుద్ధం మొదలవటా నికి ఒక రోజు ముందు) ఓటర్ జాబితాలో నమోదైన వారిని ప్రామాణికంగా తీసుకున్నారు. జాబితాలో పేర్లు నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, వివాదాల నేపథ్యంలో ఎన్నార్సీలో రెండు దఫాలుగా సవరణ తర్వాత తుది జాబితా గత ఆగస్టు నెలలో ముసాయిదాగా ప్రకటించారు. మూడున్నరేండ్ల ఎన్నార్సీ ప్రక్రియలో 41లక్షల మందిని విదేశీయులుగా తేల్చారు. ఈ క్రమంలో 16 రకాల ధృవపత్రాలను కలిగి ఉన్నవారిని పౌరులుగా గుర్తిస్తామన్న అధికారులు, ఓటర్‌లిస్టు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ఉన్నవారిని కూడా జాబితాలో చేర్చలేదు. అంతేకాదు, ప్రభుత్వ ఉద్యోగులనూ, సైనిక జవానులను విదేశీయుల జాబితాలో చేర్చటంతో అస్సాంలో చేపట్టిన ఎన్నార్సీ ప్రక్రియపై అనేక అనుమాలు రేకెత్తడమే కాదు, అది అభాసుపాలైంది. ఇప్పుడు ఏకంగా దేశవ్యాప్తంగా ఎన్నార్సీ చేపడుతామనటం కూడా అనేక అనుమానాలు వ్యక్తమవడం సహజం.

ఏ దేశంలో ఏప్రాంతంలో నైనా దేశీయుల గణన కచ్చితమైన రీతిలో ఉండటం భద్రతరీత్యా అనివార్యం. కానీ అస్సాం అనుభవం భద్రతకు బదులు భయాందోళనలు రేకెత్తిస్తున్నది. అస్సాంలో ఏకంగా 40లక్షల మందిని విదేశీయులుగా తేల్చి, వారి భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చేశారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సంక్షోభంగా పరిణమించవచ్చన్న భయాలు కలుగుతున్నాయి. ఇంత సంఖ్యలో విదేశీయులు అంటే, ప్రపంచంలోని శరణార్థుల జనాభాలో పదో వంతు. ప్రపంచవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మిగిలిన మయన్మార్ రోహింగ్యాల సంఖ్య పది లక్షలు మాత్రమే. అంటే ప్రపంచంలోనే అతి ఎక్కువ కాందిశీకులున్న ప్రాంతంగా అస్సాం మారిపోయింది. ఆ నలభై లక్షల మందిని ఏం చేస్తారో ప్రభుత్వం చెప్పటం లేదు. ఎన్నార్సీలో పేరులేని వారందర్నీ నిర్బంధగృహాల్లోకి తరలించటానికి కేంద్రం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇదే నిజమైతే పెద్ద విషాదమే. ఇలాంటి సంక్లిష్టతల్లోంచే తీవ్ర మానవ సంక్షోభాలు తలెత్తినట్లు చరిత్ర చెబుతున్నది. ఇన్నాళ్లుగా మతం, మెజారిటీ సామాజిక సున్నితాంశాలు కేంద్రంగా రాజకీయాలు చేసిన బీజేపీ ఇప్పుడు విదేశీయుల పేరిట మరో ఆయుధాన్ని ఓట్ల వేటలో వినియోగించటానికి సమాయత్తమవుతున్నదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఓట్ల కోసమే ప్రతిపక్షాలు విదేశీయులను వెనకేసుకొస్తున్నాయన్న బీజేపీ నేతల వాదనలు, గత అనుభవాల దృష్ట్యా పస లేనివి. ఇదిలా ఉంటే తాజాగా పశ్చిమబెంగాల్‌లోనే కాదు, దేశవ్యాప్తంగా ఎన్నార్సీ అమలు చేస్తామనటం దేశాన్నంతా అభద్రతా అనిశ్చితిలోకి నెట్టడమే.

**సందర్భం**


## బతుకమ్మ మొగ్గలు

గునుగు తంగేడుపూలన్నీ వనమొదిలి నేడు
ఉరికివచ్చెను చూడు మన వాకిళ్ళలోకి
బతుకమ్మగా మారే పూల భాగ్యమ్మ
హరివిల్లులు జారి ముంగిళ్ళలో ముగ్గులయ్యే వేళ
పువ్వులన్నీ తెలంగాణలో వాగులయ్యేను
పూలసంద్రంలో బతుకమ్మ పున్నమై మెరిసేను
బంగారుతంగేడు మురిసిపోతూనే
గౌరమ్మ మేనిపై చీరతానయ్యింది
పసుపుపచ్చని బాల మా తల్లి బతుకమ్మ
అన్నదమ్ములంతా ఉరికి వెళ్ళి
ఊరంతా పూలతో నింపిన వేళ
చెల్లి మోవిపై మెరిసేటి చిరునవ్వే బతుకమ్మ
కృష్ణమ్మకు గోదావరికి జాగ్రత్తలు చెప్పాలి
అలల ఊయల్లో అమ్మను మెల్లంగా ఊపమని
మల్లెలంత సుకుమారి అమ్మ బతుకమ్మ



**-శాంతి కృష్ణ, 9502236670**

## మహాత్ముడు



మహాత్ముడు మానవుడు
మనలో ఒకడు
భూమి మీద నడిచినాడు
మన కాలపు బుద్ధుడు
ధర్మపథం మార్గమని
నమ్మి ఆచరించాడు
సత్యదీక్ష ధ్యేయంగా
చాటిచెప్పి నిలిచాడు
మనుషుల్లో మహర్షి
మహనీయుడు అతడు
భరతజాతి మెచ్చిన
గాంధీ మహాత్ముడు

**-డాక్టర్ పత్తిపాక మోహన్, 9966229548**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**ఆలోకన**



**టంకశాల అశోక్**

# 'పచ్చదనం' క్షేత్ర నివేదిక

'పచ్చదనం-పరిశుభ్రత' 30 రోజుల కార్యక్రమం సెప్టెంబర్ 6న మొదలై 20 రోజులు గడిచిన తర్వాత, దాని అమలు తీరును ప్రత్యక్షంగా గమనించేందుకు ఐదు మండలాలు తిరిగిన ఈ రచయితకు ప్రధానంగా మూడు విషయాలు దృష్టికి వచ్చాయి. ఒకటి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులలో ఈ స్పృహ గత నాలుగు హరితహారాల కన్న చాలా ఎక్కువగా పెరుగటం. రెండు, ఈ కార్యక్రమంలోని అన్ని అంశాలు శ్రద్ధగా అమలవుతుండటం. మూడు, 30 రోజుల తర్వాత భవిష్యత్తులోనూ ఇది బాగా కొనసాగగలదనే ఆశాభావం ఏర్పడటం. అయితే అటువంటి కొనసాగుదలకు కొన్ని షరతులున్నాయి.

క్షేత్ర సందర్శన సందర్భంగా తిరిగిన అయిదు మండలాలు వరంగల్ (గ్రామీణ) జిల్లాలోని ఆత్మకూరు, శాయంపేట, గీసుకొండ, నెక్కొండ, రాయపర్తి. గమనించదలిచిన అంశాలు ప్రధానంగా కొన్నున్నాయి. అవి, పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పేర్కొన్న వేర్వేరు అంశాలు వాస్తవరూపంలో ఏ విధంగా అమలవుతున్నాయి? ఇది మొదటిది. వాటి అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజ లు ఏమేరకు పాల్గొంటున్నారు? ఇది రెండవది. అమలును అధికారులు, ప్రజాప్రతినిధులు ఏవిధంగా పర్యవేక్షిస్తున్నారు? ఇది మూడవది. ప్రజలకు చైతన్యాన్ని పెంచి, వారి ప్రస్తుత భాగస్వామ్యం కొరకు, ఆ భాగస్వామ్యం మునుముందు కొనసాగేందుకు ప్రజాప్రతినిధులు, అధికారు లు ఎటువంటి ప్రయత్నం చేస్తున్నారు? ఇది నాల్గవది. హరితహారం గత నాలుగు విడుతలతో పోల్చితే ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల చైతన్యాలు, భాగస్వామ్యాలు ఏ విధంగా పెరిగాయి? ఇది అయిదవది. అధికారపక్షం కాకుండా ఇతర పార్టీలకు చెందిన వారు సర్పంచ్‌లుగానో, వార్డు సభ్యులుగానో ఉన్నప్పుడు వారి పాత్ర ఏవిధంగా ఉంది? ఇది ఆరవది.

ఈ ఆరు అంశాలను ఇప్పుడు ఒకటొకటిగా చూద్దాం. కార్యక్రమ అంశాలు అన్నింటికి అన్నీ గ్రామాలలో అమలవుతున్నాయి. కొన్నిటి అమలు ఇప్పటికే పూర్తికాగా కొన్ని అమలు దశలో సాగుతున్నాయి. అమలు ప్రధాన గ్రామంలోనే గాక ఎస్సీ, ఎస్టీ కాలనీలలోనూ జరుగుతున్నది. ఆ పనులు కొద్ది మినహాయింపులతో ప్రస్తుత 30 రోజుల తొలిదశ ముగిసే సరికి పూర్తికాగల సూచనలున్నాయి. కొద్ది మినహాయింపులు అంటున్నవేమిటి? ఉదాహరణకు ఎస్సీ కాలనీల వంటి కొన్నిచోట్ల మరికొన్ని ఇతరచోట్ల మురుగునీరు, వాన నీరుపోయేందుకు సైడ్ కాల్వలు, ఇళ్ల ముందు గుంతల నిర్మాణం. ఆ పనులను అధికారులు గుర్తిస్తున్నారు. పనులు 30 రోజుల తర్వాత కాలంలో జరుగవచ్చు. అందుకు నిధుల కొరత లేదన్నారు అధికారులు, ప్రజాప్రతినిధులు. మరొక ఉదాహరణ ఎరుకల వారు పందుల కోసం బురద నీటి గుంటలు తప్పవంటున్నారు. దానిని ఏమి చేయాలనేది సమాధానం తేలికగా దొరకని ప్రశ్న. స్మశాన వాటికలకు స్థలాలు గుర్తించటం చాలావరకు జరిగింది. కొద్దిచోట్ల 30 రోజుల తర్వాత కాలానికి వాయిదాపడే అవకాశం ఉంది. అదేవిధంగా డంప్‌యార్డులు, గ్రామస్థాయి నర్సరీలు. కార్యక్రమాల అమలులో కొన్ని నెమ్మదించటానికి ఒక కారణం అక్కడక్కడ వ్యాపారులు సహకరించక పోవటం. దుకాణాలు, హోటళ్లు, ఇతర వ్యాపారాల వ్యర్థాలను రోడ్లపైన, కాల్వల్లో పడవేయటం ఇందుకు ఒక ఉదాహరణ. ఆ విషయంలో మొండికి వేసిన వారికి నచ్చచెప్పటం, నోటీసులు ఇవ్వటం, జరిమానాల విధింపు, సంక్షేమ పథకాల నిలిపివేత హెచ్చరికలు, కోర్టు కేసుల హెచ్చరికల వంటి మార్గాలలో దారికి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి పద్ధతి కొద్దిమంది పౌరుల విషయంలోనూ అవసరమవుతున్నది. అక్కడక్కడ జరిమానాలు నిజంగానే వసూలు చేశారు. గ్రామాలలోనైతే చెత్త తీసుకుపోయేందుకు ఇళ్లకు బుట్టలివ్వటం, చెత్త కుండీల ఏర్పాటు, దానిని తరలించే ట్రాక్టర్ల ఏర్పాటు వంటి చర్యలు అమలు దిశలో సాగుతున్నాయి. 'పవర్ వీక్' పేరు గల విద్యుత్ పనులు చాలా బాగా జరుగుతున్నాయి.

కార్యక్రమాల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యం వేర్వేరు విధాలుగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనటం పూర్తిస్థాయిలో, నిరంతరమైన విధంగా ఉంది. వారి భాగస్వామ్యాన్ని ఈసారి ముఖ్యమంత్రి కేసీఆర్ సమగ్రమైన రూపంలో, కచ్చితమైన పద్ధతులలో, వ్యవస్థీకృతమైన విధంగా నిర్దేశించటం ఇందుకు ముఖ్యకారణమనాలి. గ్రామ పంచాయతీ నుంచి మండలం, డివిజన్, జిల్లా స్థాయి వరకు, రాష్ట్ర రాజధాని వరకు అంచెలు అంచెలుగా నిరంతర పర్యవేక్షణలు సాగుతుండటం, అందుకోసం వాట్సప్ మొదలైన సాంకేతికతలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుండటం, అందరూ ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తుండటం వల్ల అన్నీ అవిశ్రాంతంగా సాగుతున్నాయి. కాని అధికార వ్యవస్థలో భాగం కాదు గనుక ప్రజల పరిస్థితి భిన్నంగా ఉంది. పచ్చదనం-పరిశుభ్రతలోని మంచిని గుర్తించటం వరకు సాధారణ ప్రజలలో ఎటువంటి కొరత కన్పించలేదు. కాని వారి భాగస్వామ్యాలలో తేడాలున్నాయి. గతంలో హరితహారాలు జరిగినప్పుడు దాని మంచిని గుర్తించటం కొంత తక్కువస్థాయిలో ఉండేది. ఇప్పుడు లాగా పెరిగిందన్నది స్పష్టం. అదేవిధంగా, ఇది పూర్తిగా ప్రభుత్వం చేయవలసిన పని అనే వాదనలు లోగడ వినిపించేవి.

హరితహారం మొదటి నాలుగు విడతలు ఏ కారణం వల్లనైతేనేమి పాక్షిక ఫలితాలను మాత్రమే ఇచ్చినట్లు ఈ అయిదు గ్రామీణ మండలాల సందర్శనలో అర్థమైంది. ఈ స్థితికి కారణాలను విశ్లేషించిన మీదట కావచ్చు ఇప్పుడు పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాన్ని కొత్త రూపంలో డిజైన్ చేసి వ్యవస్థీకరించారు ముఖ్యమంత్రి. దానివల్ల లోపాలు తొలిగిపోయాయి. పని విజయవంతంగా సాగుతున్నది. ఈ క్రమంలో అందరూ భాగస్వాములై అందరి చైతన్యాలు పెరుగుతున్నాయి.

ఇప్పుడు తమ బాధ్యత కూడా ఉందని గుర్తిస్తున్నారు. అయితే గ్రామీణులంతా ఎవరి పనులలో వారు ఉంటారు గనుక, 'మా ఇంటి ముందు మేము చేశాం, మొక్కలు పెంచటం, పరిశుభ్రతలు చేస్తాము. కాని ఊరిలోకి వెళ్లి శ్రమదానం, ఉమ్మడి పనులు చేయలేం' అనేవారు అత్యధికంగా కన్పించారు. శ్రమదానంలో మహిళా గ్రూపులు, యువజనులు, విద్యార్థి బృందాలు పాల్గొనటం ఉంది గాని ఇంకా తక్కువే. వారిని, సీనియర్ సిటిజన్లను, ఉద్యోగ విరమణ చేసిన వారిని మోటివేట్ చేసే పద్ధతులు కనుగొనటం అవసరం. ఈ బృందాలను కదిలించగలిగితే, పనిపాటలు చేసుకునే సాధారణ ప్రజల భాగస్వామ్యపు కొరత తీరుతుంది.

కార్యక్రమాల అమలును అధికారులు, ప్రజాప్రతినిధులు టెక్నాలజీని ఉపయోగిస్తూ అంచెలు అంచెలుగా పర్యవేక్షించటం గురించి పైన చెప్పుకున్నాం. అదిగాక వారు తమ పరిధిలోని గ్రామాలలో, వార్డులలో రోజంతా తిరుగుతుండటం కన్పించింది. సమస్యలను గుర్తించి వెంటనే ఎప్పటికప్పుడు సిబ్బందికి ఆదేశాలివ్వటం, పనులను గుర్తించి అవసరమైన నిర్మాణాలకు పథకం వేయటం, పచ్చదనం-పరిశుభ్రత అవసరాన్ని చాటింపులు, సమావేశాలు, గ్రామసభలు, వాడలలో తమ పర్యటన సందర్భంగా చెప్పిన వారికే మళ్లీ మళ్లీ చెప్తూ కూడా కాలినడకన తిరగటం, ప్రజల సూచనలను నోట్ చేసుకోవటం చేస్తున్నారు. పనుల కోసం నిధుల కొరత ఉండబోదనే భావన అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఏర్పడటం ఇందుకు ఊతమిస్తున్నట్లు కనిపించింది. అదే భావనను వారు ప్రజలకు కూడా కలిగిస్తున్నారు. పైగా అవేవీ భారీ ఖర్చుల పనులు కాదు. అందువల్లనే కావచ్చు, ఎవరు ఏ పనులు కోరినా, అందుకు నిధులు లేవనే మాటను వారు ప్రజలతో అనటం ఎక్కడా వినిపించలేదు. ప్రజాప్రతినిధులు, అధికారుల మాటతీరు, వ్యవహారణాశైలిలో, అంతకుముందు ఇరువై రోజులుగా పనులు జరుగుతూ వస్తున్న తీరుతో ప్రజలకు వారిపట్ల మంచి విశ్వాసం ఏర్పడినట్లు కన్పించింది. రెండవ దశ కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు నీటి పొదుపు ప్రచారాన్ని, చర్యలను అందులో భాగం చేయాలన్నది ఒకే గ్రామస్తుడి నుంచి వచ్చిన సూచన.

ప్రజల చైతన్యాలు, భాగస్వామ్యాల పెరుగుదలకు ప్రజాప్రతినిధులు, అధికారులు చేస్తున్న దాని గురించి ఇప్పటికే కొంత చెప్పుకున్నాం. పదే పదే చేసిన సూచనలను ఏ కారణం వల్లనైతేనేమి అనుసరించని వారి విషయంలో కొంత ఒత్తిడి తప్పదని అధికారులు, ప్రజాప్రతినిధులకు అర్థమైంది. అటువంటి వారిపై హెచ్చరికలు, నోటీసులు, జరిమానాలు, సంక్షేమ లాభాలపై ప్రభావం ఉండగలదన్న సూచనలు పనిచేస్తున్నాయి. కొందరి విషయంలో ఆ తరహా భయం అవసరమేమో కూడా. కొన్ని సందర్భాలలో చైతన్యానికి, తప్పనిసరి పరిస్థితులకు, భయానికి ఏదో ఒక రూపంలో పరస్పర సంబంధం ఉంటుంది కావచ్చు. మొత్తం మీద ఒకవైపు అధికారులు, ప్రజాప్రతినిధులు, మరొకవైపు ప్రజల చైతన్యాలు, భాగస్వామ్యాలు, కేసీఆర్ చేసిన వ్యవస్థీకృత ఏర్పాట్లు, ఒత్తిడులు ఇదే పద్ధతిలో ఈ 30 రోజుల అనంతరం కూడా కొనసాగితే, ఇదే కార్యాచరణలు, చైతన్యాలు స్థిర రూపం తీసుకునే అవకాశం ఉందనిపిస్తున్నది. భవిష్యత్తు కోసం ఇది అవసరమనే గుర్తింపు అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ఆలోచించగల పౌరులకు ఇప్పటికే ఏర్పడినట్లు తోస్తున్నది. హరితహారం మొదటి నాలుగు విడతలు ఏ కారణం వల్లనైతేనేమి పాక్షిక ఫలితాలను మాత్రమే ఇచ్చినట్లు ఈ అయిదు గ్రామీణ మండలాల సందర్శనలో అర్థమైంది. ఈ స్థితికి కారణాలను విశ్లేషించిన మీదట కావచ్చు ఇప్పుడు పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాన్ని కొత్త రూపంలో డిజైన్ చేసి వ్యవస్థీకరించారు ముఖ్యమంత్రి. దానివల్ల లోపాలు తొలిగిపోయాయి. పని విజయవంతంగా సాగుతున్నది. ఈ క్రమంలో అందరూ భాగస్వాములై అందరి చైతన్యాలు పెరుగుతున్నాయి. పోతే, ప్రతిపక్షాల సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా ఇది ఊరికంతా మంచి చేసే కార్యక్రమమన్న గుర్తింపుతో పూర్తి పట్టుదలతో పనిచేస్తుండటం సంతృప్తిని కలిగించే విషయం. ఈ విషయంలో అధికారపక్షం ప్రజాప్రతినిధులకు ఇతర పార్టీల ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయం లోపంగాని, పరస్పర అసంతృప్తిగాని ఏ గ్రామంలో కూడా కన్పించలేదు. గతం కన్నా పెరిగిన సాధారణ ప్రజల చైతన్యాన్ని, తమకు వీలైన మేర గల భాగస్వామ్యాన్ని ఆధారం చేసుకుంటూ, వాటిని ఇంకా పెంచేందుకు కొత్త పద్ధతులు కనుగొంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు ఇదే పట్టుదలతో పని చేస్తే తెలంగాణ గ్రామీణం అద్భుతంగా మారగలదు.

# తెలుగునాట గాంధీజీ

**గాంధేయవాదం**



**కోవెల సంతోష్‌కుమార్**

ప్రపంచానికి సత్యాహింసలను ప్రబోధించిన తత్త్వవేత్త జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంత్యుత్సవ సంవత్సరంలో మనం భాగస్వాములం కావటం అదృష్టమే. విశ్వమంతటా మానవసంబంధాలను, అంతర్జాతీయ సహకారాన్ని వ్యాపింపచేసేందుకు సార్వకాలీనమైన సూత్రాలను ప్రవచించిన యోధుడు. తెలుగువారితో మహాత్మాగాంధీకి ఉన్న అనుబంధం అనిర్వచనీయమైనది.

మహాత్ముని ప్రభావంతో ఎందరో తెలుగు ప్రముఖులు సర్వస్వం అర్పించి స్వాతంత్రోద్యమంలో పాలుపంచుకున్నారు. తమ జీవితాలను అంకితం చేసిన నిస్వార్థ సేవాపరాయణులెందరో ఉన్నారు. 1910-1946 మధ్య కాలంలో గాంధీజీ తెలుగురాష్ర్టాల్లో పలుమార్లు పర్యటించారు. నిజాం రాజరికం కొనసాగుతున్న సమయంలో కూడా గాంధీజీ హైదరాబాద్‌కు వచ్చి హరిజనోద్ధరణ ఉద్యమంలో పాల్గొన్నారు. దళితులపై జరుగుతున్న వివక్షపై జరుగుతున్న పోరాటానికి బాసటగా నిలిచేందుకు 1927 ఏప్రిల్ 7న హైదరాబాద్‌లో జరిగిన భారీ బహిరంగసభకు గాంధీ వచ్చారు. నగరం నడిబొడ్డున గల వివేకవర్ధిని హైస్కూల్లో జరిగిన సభకు హాజరయ్యారు. గాంధీజీ కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చిన్నవేదికపై కూర్చొని ఆయన సందేశం ఇచ్చారు. ఆ వేదిక ఇప్పటికీ వివేకవర్ధిని హైస్కూల్లో భద్రంగా ఉన్నది. విద్యాలయానికి వచ్చినపుడు సందర్శకుల పుస్తకంలో సందేశం రాశారు. గాంధీజీ హిందీలో రాసిన ఆ సందేశాన్ని పెద్దగా ఫోటో ఫ్రేమ్ చేయించి గ్యాలరీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

గాంధీజీకి ఆనాటి హైదరాబాద్ ప్రభుత్వ కార్యనిర్వాహక శాఖాధ్యక్షుడు సర్ అక్బర్ హైదరీతో సన్నిహిత అనుబంధం ఉండేది. తామిద్దరి మధ్య ఉన్న అనుబంధం గురించి హైదరీ మరణానంతరం గాంధీజీ తన 'హరిజన్' పత్రికలో ఇలా అన్నారు. 'సర్ అక్బర్ హైదరీలో చాలా సుగుణాలున్నాయి. అట్లా ఉండటం చాలా దుర్లభం. ఆయన గొప్ప పండితుడు, తత్వశాస్త్రవేత్త, సంస్కరణవాది, భక్తిపరుడైన మహనీయుడు. రెండో రౌండ్ టేబుల్ మహాసభ నుంచి తిరిగి వచ్చేటప్పుడు మేమిద్దరం కలిసి ఒకే నౌకలో ప్రయాణం చేశాం. నేను రోజూచేసే ప్రార్థనకు ఆయన హాజరవుతుండేవారు. గీతా శ్లోకాలలోను, మేము చేసే భజన కీర్తనల్లోను ఆయనకు ఆసక్తి కలిగింది. వాటినన్నిటినీ మహాదేవ్ దేశాయి చేత ఆయన అనువాదం చేయించుకున్నాడు. దేశంలో మతసామరస్యం కోసం మేమిద్దరం కలసి విస్తృతంగా పర్యటన చేయాలనుకున్నాం. ఆయన నా చేత ఆ మేరకు వాగ్దానం చేయించుకున్నారు కూడా. కానీ దేవుడు అన్యథా తలచాడు' అని గాంధీజీ రాశారు.

హైదరాబాద్‌కు గాంధీ వచ్చినప్పుడు ఆయనకు కులీనుడైన ధన్రాజ్ గిర్ రోల్స్ రాయిస్ కారును ఏర్పాటు చేశారట. ఈ ధన్ రాజ్ గిర్ జీ ప్రఖ్యాత కవి గుంటూరు శేషేంద్రశర్మ సతీమణి ఇందిరాదేవి తండ్రి.1919లో రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం ఉవ్వెత్తున సాగిన సందర్భంగా గాంధీజీ విజయవాడకు వచ్చి అక్కడ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 1921లో బెజవాడలో అఖిలభారత కాంగ్రెస్ జాతీయ మహాసభలు జరిగాయి. ఆ సభల్లో మహాత్మాగాంధీ త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్యను కాషాయం, ఆకుపచ్చ రంగులు, రాట్నంతో కూడిన పతాకాన్ని తయారుచేసి తీసుకురమ్మని చెప్పారట. ఆయన కేవలం మూడు గంటల్లో పతాకాన్ని రూపొందించి గాంధీజీకి అందించారట. దీనిగురించి 1921 ఏప్రిల్ 13న యంగ్ ఇండియా పత్రికలో గాంధీ ప్రత్యేకంగా ప్రస్తావించారు.1929లో ఆంధ్రదేశ పర్యటన చేసినప్పుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య అంతా తానే అయి నిలిచారట. ఆ తర్వాత ఉప్పుసత్యాగ్రహంలో భాగంగా గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమం నుంచి అనుచరులతో వచ్చిన గాంధీజీ 1930 ఏప్రిల్ 15న మచిలీపట్నం కోనేరుసెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో చిన్నచిన్న ఉప్పు పొట్లాలు అమ్మగా, జనం ఎగబడి కొనుగోలుచేశారు. దీంతో బందరులో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం ప్రారంభించాలని నిర్ణయించారు. డాక్టర్ పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, అయ్యదేవర కాళేశ్వరరావు తదితరులు సముద్రపు ఒడ్డు నుంచి ఉప్పు తెచ్చి కోనేరుసెంటర్‌లో ప్రదర్శించారు. అనంతరం ఇక్కడ ఉప్పుసత్యాగ్రహ శిబిరాన్ని కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ప్రారంభించారు. గాంధీజీ స్ఫూర్తితోనే బందరులో ఖద్దరు ఉద్యమానికి గొట్టిపాటి బ్రహ్మయ్య, దుగ్గిరాల రాఘవచంద్రయ్య వంటి మహానుభావులు ఎంతగానో కృషి చేశారు.

1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రజలను భాగస్వామ్యం చేయడం కోసం గాంధీజీ దేశవ్యాప్తంగా పర్యటించారు. ఆ పర్యటనలో భాగంగా మహాత్ముడు తెలుగు రాష్ర్టాల్లోని అనేక ప్రాంతాల్లో ఆగారు. రైల్వేస్టేషన్‌లోనే కొద్దిసేపు ఆగి అక్కడి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేవారు. ఇందులో భాగంగా కాజీపేట, వరంగల్ స్టేషన్లలో కాసేపు ఆగినప్పుడు వేలమంది ఆ మహాత్ముడిని చూసేందుకు గంటలకొద్దీ వేచిచూశారంటే ఆయన ప్రభావం ఆనాటి నిజాం రాజ్యంలో కూడా ఎంత మేరకు ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రజలను భాగస్వామ్యం చేయడం కోసం గాంధీజీ దేశవ్యాప్తంగా పర్యటించారు. ఆ పర్యటనలో భాగంగా మహాత్ముడు తెలుగు రాష్ర్టాల్లోని అనేక ప్రాంతాల్లో ఆగారు. రైల్వేస్టేషన్‌లోనే కొద్దిసేపు ఆగి అక్కడి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేవారు. ఇందులో భాగంగా కాజీపేట, వరంగల్ స్టేషన్లలో కాసేపు ఆగినప్పుడు వేలమంది ఆ మహాత్ముడిని చూసేందుకు గంటలకొద్దీ వేచిచూశారంటే ఆయన ప్రభావం ఆనాటి నిజాం రాజ్యంలో కూడా ఎంత మేరకు ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ప్రజాకవి కాళోజీనారాయణరావు, కాళోజీ రామేశ్వరరావు, భూపతి కృష్ణమూర్తి, ఎంఎస్ రాజలింగం, హయగ్రీవాచారి, ఎంఎస్ ఆచార్య.. ఇలా ఎందరో జాతీయోద్యమ నాయకులు గాంధీ బాటలో నడిచారు. ఆరోజు వరంగల్ వీధుల్లో గాంధీజీ తిరిగినప్పుడు ఆయన వెంట వాహనంలో కాళోజీ ప్రభృతులు ఉన్న చిత్రం ఇప్పటికీ మనం చూడవచ్చు.

1946, ఫిబ్రవరి 3, 4 తేదీలలో మద్రాస్‌లో నిర్వహించిన దక్షిణ భారత హిందీ భాషా ప్రచార కార్యక్రమం నుంచి తిరిగి వస్తున్న గాంధీజీ, ఖమ్మం టౌన్ కాంగ్రెస్ శాఖ కోరిక మేరకు మార్గమధ్యంలో ఫిబ్రవరి 5వ తేదీన రైలు ఆగినప్పుడు అక్కడ రైలు దిగి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇలా అనేక సందర్భాల్లో తెలుగునేలపై ఆయన ప్రసంగాల ప్రభావం ఎనలేనిది. గాంధీజీ మాటతో యావత్ తెలుగుజాతి ఆయన మాటలో నడిచింది. జాతీయోద్యమంలో సంపూర్ణంగా భాగస్వామి అయింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

150 గాంధీజీ జయంతి ఉత్సవాలు




దుబాయ్‌లోని బుర్జ్‌ఖలీఫాపై గాంధీజీ బొసినవ్వులు

## 'గాంధీ' స్టాంప్ విడుదలచేసిన పాలస్తీనా


**రమల్లా :** మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని ఆయన స్మారకార్థం పాలస్తీనా స్టాంప్‌ను విడుదల చేసింది. గాంధీ ముఖచిత్రంతో ఉన్న ఈ స్టాంపును మంగళవారం ఆ దేశ మంత్రి ఇసాక్ సేదర్, పాలస్తీనాలో భారత ప్రతినిధి సునీల్‌కుమార్ విడుదల చేశారు. స్టాంప్‌ను విడుదల చేయడం మహాత్ముడి విలువలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని సునీల్‌కుమార్ చెప్పారు.



గాంధీజీ స్మారక స్టాంప్‌ను విడుదల చేస్తున్న సునీల్‌కుమార్, ఇసాక్ సేదర్

## నేపాల్‌లో బాపూ విగ్రహం

**కాఠ్మండు, అక్టోబర్ 2:** నేపాల్‌లో తొలిసారిగా గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాఠ్మండులో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని నేపాల్‌లో భారత రాయబారి మన్జీవ్ సింగ్ పురి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురి మాట్లాడుతూ నేపాల్‌లో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో గాంధీజీ ప్రభావం ఏవిధంగా ఉన్నదో వివరించారు. నేపాల్ మాజీ మంత్రి భద్ర ఘూలే స్పందిస్తూ ప్రపంచంలో జరిగిన పలు స్వాతంత్ర్య పోరాటాల్లో గాంధీజీ సిద్ధాంతాలు ప్రభావం చూపాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ మంత్రులు, ఎంపీలు, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయ సిబ్బంది, పలు రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.



కాఠ్మండులో ఆవిష్కరించిన మహాత్ముడి విగ్రహం




మహాత్ముడికి నివాళిగా ఎయిర్ ఇండియా తమ ఎయిర్ బస్ ఏ-320 విమానం రెక్కపై 11 అడుగుల ఎత్తు, ఐదు అడుగుల వెడల్పుతో గాంధీ చిత్రపటాన్ని గీయించింది. మరో నాలుగు విమానాలపైనా ముద్రిస్తామని తెలిపింది. రైల్వే శాఖ 22 రైలు ఇంజిన్లపై గాంధీజీ, జాతీయ పతాకం ఉన్న చిత్రాలను వేయించింది.





మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ




బాపూజీకి పుష్పాంజలి ఘటిస్తున్న చెన్నైలోని ఓ పాఠశాల విద్యార్థులు

'ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన అహింస ఉద్యమాలకు మహాత్మాగాంధీ దిశానిర్దేశం చేశారు. గాంధీ జన్మించి 150 ఏండ్లవుతుంది. ఇప్పటికీ ఐక్యరాజ్యసమితి కార్యాచరణకు ఆయన సిద్ధాంతాలే మూలంగా ఉన్నాయి. గాంధీజీ చూపిన ధైర్యం, నిబద్ధత మనకు ఎప్పటిలాగే ఇకపైనా స్ఫూర్తినిస్తూ ఉండాలని ఆశిస్తున్నా'

**- ఆంటోనియో గుటేరస్, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి**

## గాంధీజీ యుగపురుషుడు

మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్



**న్యూఢిల్లీ:** అమెరికాలో జాతి వివక్షపై అలుపెరుగని పోరాటం సాగించిన మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ తనకు గాంధీజీనే ఆదర్శమని పేర్కొన్నారు. 1958, జనవరి 30న గాంధీజీ పదో వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తూ ఒక భారతీయ పత్రికకు మార్టిన్ ఒక వ్యాసం రాశారు. అందులోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. 'హింసాత్మక పద్ధతులను అవలంబించకుండానే సామాజిక సమస్యలను పరిష్కరించవచ్చని నిరూపించేందుకు చరిత్రలో మరెవరూ చేయనంతంగా గాంధీజీ కృషిచేశారు. ఆయన యుగపురుషుడు. అమెరికాలో జాతి వివక్ష నిర్మూలనకు గాంధేయ మార్గం ద్వారానే పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నా. హింస అనేది తాత్కాలిక విజయాన్నే అందిస్తుంది. శాశ్వత శాంతిని ఇవ్వదు. అది కొత్త సమస్యలను సృష్టిస్తుంది. గాంధీజీ చరిత్రకు మరో దారి చూపారు. ఎదుటి వ్యక్తి ఎంత హింసకు పాల్పడినా ఆయన అహింస ద్వారా ఎదిరించగలరు. అదే గాంధీయిజం. అది ఎంతో బలమైనది. దీన్ని మాకు అందించినందుకు ఆయన మరణించిన దశాబ్దం తరువాత కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అని ఆయన వివరించారు.

### బాపూ నాటిన మొక్క
## హిందీ ప్రచార్ సభ

**చెన్నై:** శతాబ్దం క్రితం మహాత్మాగాంధీ దక్షిణ భారతదేశంలో హిందీ భాషను వ్యాప్తి చేసేందుకు తమిళనాడులో నాటిన ఒక మొక్క నేడు మహాసంస్థగా ఎదిగింది. అనేక రాజకీయ అవాంతరాలను ఎదుర్కొంటూ గాంధీజీ ఇచ్చిన ప్రేరణతో ముందుకు సాగుతున్నది. హిందీ భాషను ప్రచారం చేసేందుకు గాంధీజీ 1918లో నాడు మద్రాస్‌గా పిలువబడే చెన్నై నగరంలో ఒక సాధారణ తరగతి గదిలో దక్షిణ భారత హిందీ ప్రచార్ సభను ప్రారంభించారు. నేడు ఆ సంస్థ ఆధ్వర్యంలో 33 పీజీ కేంద్రాలు, 33 టీచర్ ట్రెయినింగ్ సంస్థలు, ఐదు సీబీఎస్‌ఈ పాఠశాలలు, ఐదు ప్రాంతీయ సభలు నడుస్తున్నాయి. హిందీ ప్రచార్ సభలో శిక్షణ పొందిన వేల మంది ప్రచారక్‌లు నేడు దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలలో పనిచేస్తున్నారు. హిందీని తీవ్రంగా వ్యతిరేకించే తమిళనాడులోనే అత్యధిక సంఖ్యలో 43వేల మంది ప్రచారక్‌లు ఉండటం విశేషం.

# మహాత్మా.. మనసా స్మరామి!

## ఘనంగా గాంధీజీ 150వ జయంతి


- దేశవ్యాప్తంగా వేడుకలు
- జాతిపిత సేవలను, బోధనలను స్మరించుకున్న ప్రజలు
- రాజ్‌ఘాట్‌లో నివాళులర్పించిన రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోదీ, ఇతర ప్రముఖులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2:** 'హింసోన్మాదంతో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచానికి అహింసామార్గాన్ని చూపించావు. అన్ని వర్గాలను ఐక్యం చేసి అఖండ భారతావనికి స్వేచ్ఛావాయువులను అందించావు. సత్యం, అహింస విలువలను చాటిచెప్తూ తరతరాలకు నిలిచిపోయే స్ఫూర్తిగా నిలిచావు. బాపూ.. మీకు ప్రణామాలు. మీ మాట సర్వదా స్మరణీయం, మీరు చూపిన బాట సదా అనుసరణీయం'.. అంటూ యావత్ ప్రపంచం మహాత్మాగాంధీకి జేజేలు పలికింది. బాపూజీ 150వ జయంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులు అర్పించింది. దేశం మొత్తం జాతిపిత జయంతిని పండుగలా జరుపుకొన్నది. స్వాతంత్ర్యం కోసం ఆయన జరిపిన మహత్తర పోరాటాన్ని గుర్తుచేసుకున్నది.

మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని బుధవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో, బహిరంగ ప్రాంతాల్లో బాపూజీ విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఢిల్లీలోని గాంధీజీ సమాధి 'రాజ్‌ఘాట్' వద్ద రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తదితరులు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, బీజేపీ సీనియర్ నేత ఎల్కే అద్వానీ, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, హర్‌దీప్ సింగ్ పూరీ, బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా తదితరులు సైతం రాజ్‌ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోదీ, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అద్వానీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తదితరులు గాంధీజీకి నివాళులు అర్పించారు. గాంధీ జయంతి సందర్భంగా బీజేపీ నిర్వహించిన 'సంకల్ప్ యాత్ర'ను బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఢిల్లీలో ప్రారంభించారు. ఒకసారి వాడి పడేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్‌ను బహిష్కరించాలని ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'గాంధీ సందేశ్ యాత్ర'ను ఢిల్లీ కాంగ్రెస్ కార్యాలయంలో రాహుల్ గాంధీ ప్రారంభించారు. 'మహాత్మాగాంధీ అమర్ రహే' నినాదాలతో రాజ్‌ఘాట్ వరకు ఆ యాత్ర సాగింది. లక్నోలో నిర్వహించిన పాదయాత్రలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పాల్గొన్నారు.

### గాంధీజీ ఆశయసాధనకు శ్రమిద్దాం

మానవజాతికి బాపూజీ అందించిన సేవలను దేశం మొత్తం గుర్తు చేసుకుంటున్నదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ మేరకు ట్విట్టర్‌లో ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'గాంధీజీ కలలను సాకారం చేయడంతోపాటు మెరుగైన ప్రపంచాన్ని సృష్టించేందుకు ప్రతి ఒక్కరం శ్రమిద్దాం. ఆయన అందించిన శాంతి సందేశం ఈ ప్రపంచానికి సదా అనుసరణీయం' అని పేర్కొన్నారు. ఏడు రుగ్మతల నుంచి మనల్ని కాపాడుకోవాలంటూ గాంధీజీ బోధించిన ఏడు అంశాలను మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. అవి.. శ్రమ లేకుండా సంపద, మనస్సాక్షి లేని ఆనందం, గుణం లేని జ్ఞానం, మానవత్వం లేని శాస్త్రం, త్యాగం లేని మతం, నియమాలు లేని రాజకీయాలు, నైతికత లేని సందర్శన కూడదని బాపూ హితవు పలికారని మోదీ ప్రస్తావించారు. గాంధీజీ నేర్పిన విలువలను ప్రతి ఒక్కరూ నిత్యజీవితానికి అన్వయించుకోవాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ట్విట్టర్ ద్వారా పిలుపునిచ్చారు. 'మహాత్మాగాంధీ 150వ జయంతిని నిర్వహించుకుంటున్న వేళ ఆయన బోధనలను, ఆయన నేర్పిన విలువలను మన నిత్యజీవితానికి అన్వయించుకుందాం' అని ట్వీట్ చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. గాంధీజీ సేవలను కొనియాడుతూ ట్వీట్ చేశారు. 'జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా నా నివాళులు. అణచివేత, మూర్ఖత్వం, ద్వేషాన్ని ఓడించడానికి అహింసే ఏకైక ఆయుధమని, అన్ని జీవుల పట్ల దయతో ఉండాలని ఆయన తన బోధనలు, పనుల ద్వారా నిరూపించారు' అని రాహుల్ పేర్కొన్నారు.



అమెరికాలోని భారత రాయబార కార్యాలయంలో నివాళులర్పిస్తున్న భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్

## వాళ్లకు గాంధీజీ అర్థమవుతారా?

- మహాత్ముడి సత్యనిరతిని, అహింసను, మహాత్యాగాన్ని వాళ్లు అర్థం చేసుకోగలరా?
- ప్రస్తుత పరిణామాలను చూసి ఉంటే మహాత్ముడి ఆత్మ క్షోభించేది
- బీజేపీపై నిప్పులు చెరిగిన సోనియాగాంధీ



రాజ్‌ఘాట్ వద్ద గాంధీజీకి నివాళులర్పిస్తున్న సోనియాగాంధీ. చిత్రంలో రాహుల్, ఖర్గే, ఆజాద్ తదితరులు

**న్యూఢిల్లీ:** కేంద్రంలోని మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ పరోక్షంగా నిప్పులు కురిపించారు. ఎవరైతే అధికార దాహంతో పరితపించిపోతూ తమను తాము అత్యున్నత వ్యక్తులు (సుప్రీం) అనుకుంటారో, ఎవరైతే అబద్ధపు రాజకీయాలకు పాల్పడుతున్నారో వాళ్లకు గాంధీజీ త్యాగాలు, సిద్ధాంతాలు, నీతి నిజాయితీ, నిస్వార్థ సేవల గురించి ఎలా అర్థమవుతాయని ప్రశ్నించారు. గాంధీజీ 150వ జయంతిని పురస్కరించుకొని ఆమె ఢిల్లీలోని రాజ్‌ఘట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలో గత ఐదేండ్ల నుంచి జరుగుతున్న పరిణామాలను చూసి ఉంటే గాంధీజీ ఆత్మ క్షోభించేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'అబద్ధపు రాజకీయాలు చేస్తున్నవారికి సత్యం కోసం గాంధీజీ ఆరాధన ఏమి అర్థమవుతుంది? అధికారం కోసం దేనికైనా తెగించేవాళ్లకు మహాత్ముడు పాటించిన అహింస సిద్ధాంతం గురించి ఎలా తెలుస్తుంది? తొలిసారి అవకాశం లభించగానే (మోదీ 2014లో తొలిసారి ప్రధాని కావడాన్ని ఉద్దేశించి) తమను తాము అత్యున్నత వ్యక్తులుగా భావించే వాళ్లకి గాంధీజీ చేసిన నిస్వార్థ సేవ గురించి ఎలా అర్థమవుతుంది?' అని ఆమె నిలదీశారు.


**భారత్‌కు పర్యాయపదం గాంధీజీనే**

'భారత్‌కు పర్యాయపదం గాంధీజీ. కానీ కొంత మంది భారత్‌కు పర్యాయపదంగా ఆరెస్సెస్ ఉండాలనుకుంటున్నారు. అలాంటి వాళ్లకు నేను చెప్పదలచుకున్నది ఒక్కటే.. భారత్‌కు పర్యాయపదం గాంధీజీనే' అని సోనియా పేర్కొన్నారు. భారత్ స్వావలంబన సాధించాలని మహాత్ముడు కలలు కన్నారని, ఆయన కలలను సాకారం చేయడానికి కాంగ్రెస్ ఎనలేని కృషి చేసిందని చెప్పారు. స్వాతంత్రం అనంతరం దేశాన్ని స్వావలంబన దిశగా నడిపించడానికి, నూతన భారత్‌ను నిర్మించడానికి నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, నరసింహారావు, మన్మోహన్‌సింగ్ చేసిన కృషి అమూల్యమైనదన్నారు.

## భారత్.. ఓడీఎఫ్

- ఐదేండ్లలో 11 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాం
- 2022 నాటికి సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను విడనాడాలి: మోదీ

**అహ్మదాబాద్, అక్టోబర్ 2:** భారత్ నేడు బహిరంగ మలవిసర్జన రహిత దేశంగా మారిపోయిందని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. 'కేవలం 60 నెలల్లో 11 కోట్ల మరుగుదొడ్లు నిర్మించి 60 కోట్ల మందికి అందించినందుకు ప్రపంచం మనలను అభినందిస్తూ, అవార్డులు అందజేస్తున్నది' అని చెప్పారు. ప్రపంచ వేదికలపై దేశ ప్రతిష్ఠ మరింత పెరుగుతున్నదని తెలిపారు. గాంధీజీ 150వ జయంతిని పురస్కరించుకొని అహ్మదాబాద్‌లో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో మోదీ ప్రసంగించారు. భారత పాస్‌పోర్టుకున్న శక్తి, విలువ పెరిగిందని చెప్పారు. ఇటీవల అమెరికాలోని హ్యూస్టన్‌లో జరిగిన 'హౌడీమోదీ' కార్యక్రమం ప్రపంచ నేతలకు చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ, 'నేడు గ్రామీణ ప్రాంతాలు బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతాలుగా ప్రకటించుకున్నాయి' అని చెప్పారు. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ను 2022 నాటికి ముగింపు పలుకాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఆయన సబర్మతి ఆశ్రమంలో గాంధీజీకి నివాళులర్పించారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని రూ.150 నాణేలను విడుదల చేశారు.



రూ.150 నాణేలను విడుదల చేస్తున్న ప్రధాని మోదీ

### మహాత్ముడికి నివాళిగా
## 'ఐన్‌స్టీన్ చాలెంజ్'!

ఆవిష్కరణలతో గాంధీజీ విలువలను భావి తరాలకు చాటి చెప్పాలి: మోదీ

**న్యూయార్క్:** గాంధీజీ ఆదర్శాలను భావి తరాలకు తెలియజేసేలా సరికొత్త ఆవిష్కరణలు జరుపాలని ప్రధాని నరేంద్రమోదీ 'ఐన్‌స్టీన్ చాలెంజ్'ను ప్రతిపాదించారు. 150వ జయంతి వేడుకల సందర్భంగా మహాత్ముడికి ఘన నివాళులర్పిస్తూ.. 'భారత్‌కు, ప్రపంచానికి గాంధీజీ ఎందుకు అవసరం?' అన్న శీర్షికన న్యూయార్క్ టైమ్స్' పత్రికలో ఆయన ఒక వ్యాసం రాశారు. గాంధీజీ గొప్ప ఉపాధ్యాయుడు అని, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిలో నిత్యం ధైర్యం నింపుతున్న 'మార్గదర్శక జ్యోతి' అని కొనియాడారు. 'గాంధీజీకి నివాళిగా నేను ఐన్‌స్టీన్ చాలెంజ్‌ను ప్రతిపాదిస్తున్నా. బాపూజీ గురించి ఐన్‌స్టీన్ చెప్పిన గొప్ప వ్యాఖ్యలు మనందరికీ తెలుసు. ఇలాంటి వ్యక్తి (గాంధీజీ) భూమిపై నడిచాడంటే భవిష్యత్ తరాలు నమ్మడం కష్టమని ఐన్‌స్టీన్ అన్నారు. మహాత్ముడి ఆదర్శాలను భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా మనం ఏం చేయగలం? తమ ఆవిష్కరణల ద్వారా గాంధీజీ విలువలను వ్యాప్తి చేయాలని మేధావులు, పారిశ్రామికవేత్తలు, టెక్ దిగ్గజాలను నేను ఆహ్వానిస్తున్నా' అని ప్రధాని మోదీ ఆ వ్యాసంలో కోరారు. ద్వేషం, హింస, బాధలను అరికట్టేందుకు భుజం భుజం కలిపి పని చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే మనం గాంధీజీ కలలను సాకారం చేసినట్లు అని పేర్కొంటూ గాంధీజీకి ఇష్టమైన 'వైష్ణవ జనతో' శ్లోకంతో వ్యాసాన్ని ముగించారు.

**వైరుధ్యాల మధ్య వారధి!**

'పౌరులకు గౌరవం, సౌభాగ్యం అందించే ప్రపంచం కోసం గాంధీజీ కలగన్నారు. ఆయన మనకు సేవాతత్వాన్ని అందించారు. దాని నుంచి స్ఫూర్తి పొందాలి. భూమికి వారసులుగా, జీవ జంతుజాలంతో సహా భూ సంరక్షణ బాధ్యత మనపై ఉంది. మనకు మార్గనిర్దేశం చేసే గొప్ప ఉపాధ్యాయుడు గాంధీజీలో ఉన్నారు. మానవత్వంపై విశ్వాసమున్న వారిని ఏకం చేయడం నుంచి సుస్థిరాభివృద్ధి, ఆర్థిక స్వావలంబన వరకు గాంధీజీ ప్రతి సమస్యకు పరిష్కారం చూపారు. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, నెల్సన్ మండేలా వంటి గొప్ప వ్యక్తులకు గాంధీజీనే స్ఫూర్తి ప్రదాత. సమాజంలో అత్యంత వైరుధ్యాల మధ్య వారధిగా నిలిచే సామర్థ్యం గాంధీజీకే సొంతం' అని ప్రధాని కొనియాడారు.

**చిటికెడు ఉప్పుతో ఉద్యమాన్ని రగిల్చారు**

చరఖా, రాట్నం, ఖాదీ వంటి సాధారణ వస్తువులను కూడా గాంధీజీ రాజకీయాలతో మిళితం చేయగలిగారని ప్రధాని మోదీ కీర్తించారు. 'చిటికెడు ఉప్పుతో అంత పెద్ద ప్రజా ఉద్యమాన్ని ఎవరు సృష్టించగలరు. 1930లో దండియాత్ర ద్వారా గాంధీజీ ఉప్పు చట్టాలను సవాల్‌చేశారు. అరేబియా సముద్రపు ఒడ్డున చిటికెడు ఉప్పును తీసుకొని చారిత్రక ఉప్పుసత్యాగ్రహానికి నాందిపలికారు' అని ప్రధాని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలు జరిగాయని అయితే పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించడమే గాంధీజీ ఉద్యమానికి వాటికీ తేడా అని వివరించారు. అయితే గాంధీజీ ఏనాడూ అధికారాన్ని కోరుకోలేదని గుర్తుచేశారు. గాంధీజీ కలలను సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పేర్కొన్నారు. 'పేదరిక నిర్మూలనలో భారత్ ముందంజలో ఉన్నది. పారిశుద్ధ్యం కోసం మేం చేస్తున్న కృషి పట్ల ప్రపంచ దేశాలు దృష్టిసారించాయి' అని ప్రధాని చెప్పారు.

### చారిత్రక కట్టడాల వద్ద
## ప్లాస్టిక్‌పై నిషేధం

**భువనేశ్వర్/ఢిల్లీ:** చారిత్రక కట్టడాల లోపల గానీ, వాటి పరిసరాలకు 100 మీటర్ల దూరంలో గానీ సింగిల్ యూజ్ (ఒక్కసారి మాత్రమే వాడి పడేసే) ప్లాస్టిక్‌ను అనుమతించబోమని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్ పేర్కొన్నారు. బుధవారం ఆయన పర్యాటకశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'పరివర్తన్ పర్వ్'ను ప్రారంభించారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ సుస్థిర, పర్యావరణ హిత పర్యాటక రంగాన్ని పెంపొందించడానికే చారిత్రక కట్టడాల వద్ద ప్లాస్టిక్‌పై నిషేధం విధించామని చెప్పారు. బుధవారం నుంచి ఈ నెల 13 వరకు దేశవ్యాప్తంగా పర్యాటకశాఖ 'పరివర్తన్ పర్వ్'ను నిర్వహిస్తుందని తెలిపారు. ఒడిశాలోని పట్టణ ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులపై నిషేధం విధిస్తూ నవీన్ పట్నాయక్ సర్కార్ నిర్ణయం తీసుకున్నది.

**ప్లాస్టిక్ సంచులు వాడొద్దు: అమిత్‌షా**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని సంపూర్ణంగా నిలిపివేద్దామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పిలుపునిచ్చారు. షాలీమార్ భాగ్‌లో ఆయన బుధవారం 'గాంధీ సంకల్ప్‌యాత్ర'ను ప్రారంభించారు.


## సినీఫక్కీలో భారీ చోరీ

- రూ.13 కోట్ల విలువైన ఆభరణాలు దొంగతనం
- తమిళనాడులోని లలితా జ్యువెలర్స్‌లోకి ప్రవేశించి ఎత్తుకెళ్లిన దొంగలు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు; సీసీటీవీ ఫుటేజీల పరిశీలన



మాస్కులు ధరించి దుకాణంలో ప్రవేశించిన దొంగలు

**తిరుచ్చి:** సినిమాల్లో మాదిరిగా ముసుగులు ధరించిన దొంగలు రాత్రి పూట బంగారం దుకాణంలోకి చొరబడి భారీగా ఆభరణాలను దోచుకెళ్లినట్లుగా.. తమిళనాడులో ఓ భారీ దొంగతనం జరిగింది. పక్కా ప్రణాళికతో.. మూడో కంటికి చిక్కకుండా దాదాపు రూ.13 కోట్ల విలువైన 35 కిలోల బంగారు, వజ్రాల అభరణాలను ఇద్దరు దొంగలు ఎత్తుకెళ్లారు. తిరుచ్చి నగరంలో ఛాతిరాం బస్‌స్టేషన్ ప్రాంతంలో ప్రముఖ నగల దుకాణం లలితా జ్యుయెలర్స్ ఉన్నది. ఈ దుకాణంలో దొంగతనం చేయడానికి వ్యూహం పన్నిన ఇద్దరు దొంగలు బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ముసుగులు ధరించి దుకాణం పరిసరాల్లోకి చేరుకున్నారు. దుకాణానికి ఓ వైపు ఉన్న గోడకు డ్రిల్లింగ్ మెషిన్‌తో పెద్ద రంధ్రాన్ని చేశారు. అనంతరం దుకాణం లోపలికి ప్రవేశించి బంగారు, వజ్రాల ఆభరణాలను సంచుల్లో నింపుకొని పరారయ్యారు. రోజువారీలాగే బుధవారం ఉదయం దుకాణాన్ని తెరిచిన సిబ్బంది దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు ఆభరణాలను దొంగిలించి పరారైనట్లు గుర్తించారు. అయితే దుకాణం వద్ద ఆరుగురు వాచ్‌మెన్లు డ్యూటీలో ఉన్నా దొంగతనం ఎలా జరిగిందన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు.



దుకాణానికి రంధ్రం వేసిన దొంగలు

### పక్కా వ్యూహంతోనే..

దొంగతనం జరిగిన విధానాన్ని పరిశీలిస్తే దొంగలు పక్కా వ్యూహంతోనే వ్యవహరించినట్లు అర్థమవుతున్నది. ఎవరికీ అనుమానం రాకుండా, తమ ముఖాలు సీసీటీవీలో నమోదు కాకుండా, పోలీసులకు ఎలాంటి ఆనవాళ్లు దొరకకుండా దొంగలు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ముఖాలకు ముసుగు ధరించడమే కాకుండా చేతులకు గ్లౌజులు ధరించారు. అలాగే దొంగతనం చేసిన తర్వాత అక్కడ కారంపొడి చల్లారు. పోలీసు జాగిలాలు తమ ఆచూకీని గుర్తుపట్టకూడదన్న ఉద్దేశంతో వాళ్లు ఈ పని చేశారు. మరోవైపు లలితా జ్యూయెలర్స్ యజమాని కిరణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. దుకాణంలోని 800 బంగారు, ప్లాటినం, వజ్రాల ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారని చెప్పారు. వీటి విలువ రూ.13 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు.

## నిజాం నిధులు భారత్‌కే


మూడోపేజీ తరువాయి...


7వ నిజాం(మీర్ ఉస్మాన్ అలీఖాన్)కు చెందుతాయి. 7వ నిజాం వారసులుగా చెప్పుకుంటున్న యువరాజులు, భారతదేశానికి మాత్రమే ఆ సొమ్మును పొందే హక్కు ఉన్నది. ఆ సొమ్మును ఇరుపక్షాలలో ఎవరు దక్కించుకోవాలన్నది వారికే వదిలేస్తున్నాను' అని పేర్కొన్నారు. భారత్ అక్రమంగా ఆ నిధులను పొందేందుకు ప్రయత్నిస్తున్నదన్న పాకిస్థాన్ వాదనను కోర్టు తోసిపుచ్చింది. భారత ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానాన్ని చట్టవిరుద్ధంగా ఆక్రమించిందని, అందువల్ల భారత్‌కు, నిజాం వారసులకు ఆ నిధులు దక్కకుండా చూడాలని పాక్ వాదించింది. భారత్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనానికి, ఈ నిధుల కేసుకు ఎటువంటి సంబంధం లేదని భారత్ తెలిపింది. భారత్ వాదనతో జడ్జి ఏకీభవించారు. 1948లో నిజాం నవాబు ఉస్మాన్ అలీఖాన్ తన బ్యాంక్ ఖాతా నుంచి 10,07,940 పౌండ్లు (ప్రస్తుత విలువలో సుమారు రూ.8.9 కోట్లు) బ్రిటన్‌లోని పాకిస్థాన్ హైకమిషనర్ పేరిట బదిలీ చేశారు. ఆ డబ్బు ఇప్పుడు వడ్డీలతో కలుపుకొని 3.5 కోట్ల పౌండ్లు అయింది. ఆ సొమ్ము తమకే దక్కాలని పేర్కొంటూ నిజాం వారసులు ప్రిన్స్ ముకరమ్‌ఝా, అతని తమ్ముడు ముఫక్కమ్ ఝా భారత ప్రభుత్వంతో చేతులు కలిపారు. తమ హైకమిషనర్ పేరిట జమ అయిన ఆ డబ్బు తమకే దక్కాలని పాక్ వాదించింది. 1948లో భారత సర్కార్ హైదరాబాద్ సంస్థానాన్ని దురాక్రమించినప్పుడు.. నాటి నిజాం నవాబు తమను తాము రక్షించుకొనేందుకు ఆయుధాలు సరఫరా చేయాలని కోరుతూ ఆ ధనాన్ని తమకు చెల్లించాడని పాక్ తెలిపింది. 'తమ ముత్తాత తమకు వారసత్వ కానుకగా వదిలివెళ్లిన డబ్బు కోసం 8వ నిజాం (ముకరమ్ ఝా), ఆయన సోదరుడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. కానీ పాకిస్థాన్ గత 70 ఏండ్లుగా వారిని అడ్డుకున్నది. కానీ ఆ నిధులపై 8వ నిజాంను కోర్టు హక్కుదారుగా గుర్తించింది. ఈ వివాదం మొదలైనప్పుడు నా క్లయింట్ (ముకరం ఝా)ఇంకా పసిబాలుడే. ఇప్పుడు ఆయన వయస్సు 80 దాటింది. ఆయన జీవించి ఉండగానే కేసు పరిష్కారం కావడం హర్షణీయం' అని నిజాం వారసుల తరపున వాదనలు వినిపించిన పాల్ హెవిట్ అనే న్యాయవాది పేర్కొన్నారు. బ్రిటన్‌లోని పాక్ హైకమిషనర్‌కు నిజాం వంశస్థులు సహా ఏడుగురు ఇతరులకు మధ్య సాగిన ఈ కేసులో భారత ప్రభుత్వం, భారత రాష్ట్రపతి కూడా ప్రతివాదులుగా ఉన్నారు.

**నిజాం మీమాంసతో సమస్య**

దేశ విభజన సందర్భంగా భారత్‌లోనే ఉండాలా లేక పాక్‌తో కలువాలా అన్న మీమాంసను నాటి నిజాం ఎదుర్కొన్నారు. నాటి హైదరాబాద్ సంస్థానంపై భారత ప్రభుత్వం దండెత్తినప్పుడు.. నిజాం నవాబుకు తాము ఆయుధాలు అందజేశామని, అందుకు ప్రతిగానే ఆయన తమకు నిధులు చెల్లించాడని పాకిస్థాన్ వాదించింది. నిజాం నవాబు 1948లో నాట్‌వెస్ట్ బ్యాంక్‌లోని తన నిధుల నుంచి 10,07,940 పౌండ్లను నాటి పాకిస్థాన్ హైకమిషనర్ హబీబ్ ఇబ్రహీం రహీమతుల్లా ఖాతాకు బదిలీ చేశారు. ఈ విషయాన్ని రహీమతుల్లా కూడా లిఖితపూర్వకంగా అంగీకరించారు. 'మీరు పేర్కొన్న సొమ్మును నా పేరిట భద్రపరిచేందుకు అంగీకరిస్తున్నాను' అని తెలిపారు. కానీ పాక్ పేర్కొన్నట్టుగా ఎక్కడా ఆయుధాల కొనుగోలు ప్రస్తావన చోటుచేసుకోలేదు. అయితే పాక్ హైకమిషనర్‌కు బదిలీ చేసిన ఆ నిధులను తిరిగి వెనుకకు ఇచ్చేయాలని నిజాం నవాబు బ్యాంకును కోరినట్టు తెలుస్తున్నది. వివాదం కోర్టుకెక్కడంతో నాట్‌వెస్ట్ బ్యాంక్ ఆ నిధులను స్తంభింపజేసింది. బ్రిటన్ కోర్టులలో పలు మలుపులు తిరిగిన ఈ కేసుకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది.

## రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ప్రారంభం

**వనపర్తిక్రీడలు:** రాష్ట్రంలో క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో స్వర్గీయ సింగిరెడ్డి తారకమ్మ రాంరెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో 4వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల హాకీ టోర్నీని మంత్రి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాల పది జట్లు పోటీపడుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఒలింపియన్ ముకేశ్ కుమార్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



బుధవారం రాష్ట్ర స్థాయి హాకీ పోటీలను ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి

# ఓపెనర్‌గా రో'హిట్'

## అజేయ సెంచరీతో విజృంభణ.. మయాంక్ అర్ధసెంచరీ

## భారత్ తొలి ఇన్నింగ్స్ 202/0.. దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్




రోహిత్ శర్మ (115★)

**విశాఖపట్నం:** ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో భారత్ తమదైన జోరును కొనసాగిస్తున్నది. కొట్టిన పిండిల్లాంటి సొంత ఇలాఖాలో ప్రత్యర్థిని పడగొట్టేందుకు పక్కా ప్రణాళికతో బరిలోకి దిగింది. తమకు ఎదురైన పరాజయానికి దీటైన ప్రతీకారం తీర్చుకునే దిశగా కచ్చితమైన వ్యూహాలతో సిద్ధమైంది. సాగర తీరాన విశాఖపట్నం వేదికగా బుధవారం దక్షిణాఫ్రికాతో మొదలైన తొలి టెస్ట్‌లో టీమ్‌ఇండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. టాస్ గెలిచిన కెప్టెన్ కోహ్లీ మరో ఆలోచనకు తావులేకుండా బ్యాటింగ్ వైపు మొగ్గు చూపాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ ఓపెనర్లు రోహిత్ శర్మ(174 బంతుల్లో 115 నాటౌట్, 12ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ సెంచరీకి తోడు మయాంక్ అగర్వాల్(183 బంతుల్లో 84 నాటౌట్, 11ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా 59.1 ఓవర్లలో 202 పరుగులు చేసింది. వీరిద్దరి బ్యాటింగ్ జోరులో సఫారీ బౌలర్లకు ఒక్క వికెట్ దక్కలేదు. టీ విరామం తర్వాత వరుణుడి రంగ ప్రవేశంతో స్టేడియం మొత్తం చిత్తడిగా మారడంతో ఆటను నిలిపివేశారు. మొత్తంగా తొలి రోజు ఆటలో భారత్‌దే పూర్తి ఆధిపత్యం.

**రోహిత్ తఢాకా:**

రాణిస్తాడా లేక మళ్లీ పాతకథనే పునారవృతం చేస్తాడా అన్న అనుమానాల మధ్య దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్‌కు జట్టులో చోటు దక్కించుకున్న రోహిత్ తన తఢాకా చూపెట్టాడు. ఆస్ట్రేలియాతో గతేడాది డిసెంబర్ తర్వాత మొదటి సారి సుదీర్ఘ ఫార్మాట్‌లో పోటీకి దిగిన హిట్‌మ్యాన్ మయాంక్‌తో కలిసి ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగాడు. తాను ఎదుర్కొన్న బంతిని వదిలేసిన రోహిత్ మరుసటి బంతిని ఫోర్‌గా మలిచి తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. ఓవైపు సఫారీ బౌలర్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటూనే వీలు చిక్కినప్పుడల్లా చెత్తబంతులను బౌండరీలకు తరలించాడు. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్లో మహారాజ్ రూపంలో స్పిన్నర్‌ను దింపినా..సఫారీ కెప్టెన్ డుప్లెసిస్ పాచిక పారలేదు. ముఖ్యంగా అందరి కండ్లు తనపైనే ఉన్న నేపథ్యంలో ఓపెనర్‌గా వచ్చిన అవకాశాన్ని ఒడిసిపట్టుకునేందుకు రోహిత్ మొదటి నుంచి సాధికారిక షాట్లతో ఆకట్టుకున్నాడు. మహారాజ్ వేసిన 20వ ఓవర్లో క్రీజు వదిలి ముందుకొచ్చి కొట్టిన సిక్స్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. మరోవైపు మయాంక్ తానేం తక్కువ కాదన్నట్లు చెలరేగడంతో స్కోరు బోర్డుకు కీలక పరుగులు జతకలిశాయి. అయితే ఈ జోడీని విడగొట్టేందుకు కెప్టెన్ డుప్లెసిస్ చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. అరంగేట్రం బౌలర్ ముత్తుస్వామి బౌలింగ్‌లో బౌండరీ ద్వారా రోహిత్ అర్ధసెంచరీ మార్క్ అందుకోవడంతో లంచ్ విరామ సమయానికి భారత్ వికెట్ నష్టపోకుండా 91 పరుగులు చేసింది.



మయాంక్ అగర్వాల్ (84★)

**రోహిత్, మయాంక్ జోరు:**

అప్పటికే పిచ్‌పై ఓ అంచనాకు వచ్చేసిన రోహిత్, మయాంక్ సఫారీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. సింగిల్స్‌కు తోడు దాదాపు ఓవర్‌కో బౌండరీ చొప్పున బాదేశారు. పరిమిత ఓవర్ల ఫార్మాట్ తరహాలో రోహిత్ దూకుడు ప్రదర్శించగా, మయాంక్ పరిణతి కనబరుస్తూ బ్యాటింగ్ కొనసాగించాడు. ఈ క్రమంలో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న అగర్వాల్..రోహిత్‌కు చక్కని సహకారం అందించాడు. స్పిన్నర్ డేన్ పీడ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ రోహిత్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. వరుసగా రెండు భారీ సిక్స్‌లు కొట్టిన రోహిత్ తన బ్యాట్ పవరేంటో రుచి చూపించాడు. ముత్తుస్వామి బౌలింగ్‌లో తన టెస్ట్ కెరీర్‌లో నాలుగో శతకం పూర్తి చేసుకున్న రోహిత్ స్టేడియంలోని ప్రేక్షకులకు అభివాదం చేశాడు. హిట్‌మ్యాన్ ఫీట్‌కు ప్రేక్షకులకు తోడు డగౌట్‌లో ఉన్న కెప్టెన్ కోహ్లీ చప్పట్లు చరుస్తూ అభినందించాడు. సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్‌కు వరుణుడు విలన్‌లా రంగప్రవేశం చేశాడు. నల్లని మబ్బులతో కమ్మేస్తూ కుండపోత వర్షం కురిపించడంతో మైదానం మొత్తం చిత్తడిగా మారిపోయింది. ఎంతకు గెరువు ఇవ్వకపోవడంతో మొదటి రోజు పూర్తయ్యింది.

**స్కోరుబోర్డు:** అగర్వాల్ 84 నాటౌట్, రోహిత్ శర్మ 115 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 3; **మొత్తం:** 59.1 ఓవర్లలో 202/0; **బౌలింగ్:** ఫిలాండర్ 11.1-2-34-0, రబాడ 13-5-35-0, మహారాజ్ 23-4-66-0, పీడ్ 7-1-43-0, ముత్తుస్వామి 5-0-23-0.

## సీఏసీకి కపిల్ రాజీనామా



**న్యూఢిల్లీ :** పరస్పర విరుద్ధ ప్రయోజనాల నోటీసులు అందుకున్న దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్.. క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ) చైర్మన్ పదవికి బుధవారం రాజీనామా చేశాడు. కమిటీ చీఫ్‌గా ఉన్న కపిల్ సహ సభ్యులు శాంతా రంగస్వామి, అన్షుమన్ గైక్వాడ్‌లకు బీసీసీఐ ఎథిక్స్ అధికారి డీకే జైన్ విరుద్ధ ప్రయోజనాల విషయంలో అక్టోబర్ 10లోగా వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారమే శాంతా రంగస్వామి కమిటీ నుంచి తప్పుకున్నారు. 'టీమ్‌ఇండియాకు ప్రధాన కోచ్‌ను ఎంపిక చేసిన అడ్‌హక్ సీఏసీలో భాగమైనందుకు సంతోషంగా ఉంది. తక్షణమే విధుల నుంచి తప్పించేలా నేను రాజీనామాను సమర్పించాను' అని కపిల్ చెప్పాడు.



## రాష్ట్ర స్థాయి కరాటే విజేత హైదరాబాద్

**జడ్చర్ల టౌన్ :** రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ విజేతగా నిలిచింది. కటాస్, టీమ్ కటాస్, స్పైరింగ్, వెపన్ విభాగాల్లో జరిగిన పోటీల్లో హైదరాబాద్ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. నాగర్ కర్నూల్, జడ్చర్ల వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్యతదితరులు పాల్గొన్నారు.

# పంచ్‌ల పోటీకి వేళాయె

## నేటి నుంచి మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్



**ఉలాన్‌ఉడ్(రష్యా) :** పవర్ ఫుల్ పంచ్‌లు కురిపించేందుకు భారత మహిళా బాక్సర్లు సిద్ధమయ్యారు. ఆరుసార్లు చాంపియన్, మణిపూర్ మణిపూస మేరీ కోమ్ సహా మహిళా బాక్సర్లు గురువారం ఇక్కడ ప్రారంభమయ్యే మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగనున్నారు. తన అద్భుత ఆటతో, స్వర్ణ పతకాలతో ప్రపంచ మహిళల బాక్సింగ్‌కే అంబాసిడార్‌గా వెలుగొందుతున్న మేరీ ఈసారి 51కేజీల విభాగంలో పోటీ పడనుంది. ఆమె ఇప్పటి వరకు 48కేజీల విభాగంలో ఆరుసార్లు విజేతగా నిలువగా.. అంతగా మెరుగైన రికార్డు లేని 51కేజీల విభాగంలోనూ సత్తాచాటి ఈ సారి కూడా స్వర్ణాన్ని కైవసం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. గత చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సిమ్రన్‌జిత్‌ను ట్రయల్స్‌లో ఓడించిన బాక్సర్ ఎల్.సరితా దేవీ(60కేజీలు) ఎలా ఆడుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఆరు సార్లు ఆసియా చాంపియన్‌గా నిలిచిన సరితది కూడా మణిపూరే. అలాగే అంతర్జాతీయ బాక్సింగ్ సంం(ఏఐబీఏ)లో సభ్యత్వం కోసం సరిత పోటీ పడేందుకు సిద్ధమైంది. చాంపియన్‌షిప్ సందర్భంగా ఎన్నికలు జరుగనున్నాయి. అయితే ఆసియా నుంచి మరొకరు నామినేషన్ దాఖలు చేయరని ఆమె భావిస్తున్నది. ఇండియా ఓపెన్ స్వర్ణ పతక విజేత నీరజ్(57కేజీలు), జమునా బోరో(54కేజీలు) సహా ఐదుగురు తొలిసారిగా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అడుగుపెట్టనున్నారు. 2014లో రజతం సాధించిన స్వీటీ బూర(75కేజీలు)పైనా భారీ అంచనాలు ఉన్నాయి. 'గతేడాది చాంపియన్‌షిప్‌లో నాలుగు పతకాలు వచ్చాయి. తొలి సారి ఈ టోర్నీలో అడుగుపెడుతున్న వారు ఎలా ఆడుతారో చూడాలి. ఇక్కడికి వచ్చే ముందు అందరూ ఇటలీలో కూడా శిక్షణ తీసుకున్నారు' అని జాతీయ కోచ్ మహమ్మద్ అలీ ఖమర్ తెలిపారు. 2006లో మేరీ కోమ్, సరిత స్వర్ణాలు సహా మొత్తం ఎనిమిది పతకాలు భారత్‌కు రాగా, ఇప్పటి వరకు అదే అత్యుత్తమ ప్రదర్శనగా ఉంది.

**పోటీలో ఉన్న భారత బాక్సర్లు :** మంజు రాణి(48కేజీలు), మేరీ కోమ్(51కేజీలు), జమున బోరో (54కేజీలు), నీరజ్ (57కేజీలు), సరితా దేవి (60కేజీలు), మంజు బొంబోరియా (64కేజీలు), లోవ్లీనా బోర్గోహైన్(69కేజీలు), స్వీటీ బూర (75కేజీలు), నందిని (81కేజీలు), కవితా చాహల్ (+81కేజీలు).



## రాష్ట్రస్థాయి ఈత పోటీలు ప్రారంభం

**ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** జిల్లా విద్యాశాఖ సమన్వయంతో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్ 14, 17, 19 ఈత పోటీలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే జోగు రామన్న పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో రాష్ట్రంలోని పాత పది జిల్లాలకు చెందిన 500 బాలబాలికలతో పాటు, 100 మంది కోచ్‌లు ఈ పోటీలకు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రహ్లాద్ పాల్గొన్నారు.

# వాణిజ్య

## లలిత్ మోదీ బ్యాంక్ ఖాతాల వివరాలివ్వండి

- స్విస్‌ను కోరుతున్న భారత్

**న్యూఢిల్లీ/బెర్న్, అక్టోబర్ 2:** ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోదీ, ఆయన భార్య మినాలినీ మోదీలకు చెందిన స్విస్ బ్యాంక్ ఖాతాల వివరాలను భారత్ సేకరిస్తున్నది. విదేశాల్లో భారతీయుల అక్రమ సంపదను వెలికి తీయడంలో భాగంగా లలిత్, మినాల్ ఖాతాలపై కేంద్ర ప్రభుత్వ అధికారులు.. స్విట్జర్లాండ్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. సమాచార మార్పిడి కోసం ఇరు దేశాల మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందాల ప్రకారం ఈ వివరాలను తెలియజేయాలంటూ కోరుతున్నారు. కాగా, ఈ ఇద్దరి బ్యాంక్ ఖాతాల లావాదేవీలను చెప్పాలంటూ 2016లోనూ ఇదే రకంగా స్విట్జర్లాండ్ ఫెడరల్ ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌టీఏ)ను భారత్ కోరింది. కానీ ఇప్పటిదాకా ఆ వివరాలేవీ అందలేదు. 2010లో లలిత్ లండన్‌కు పారిపోయిన విషయం తెలిసిందే. ఈయనపై మనీలాండరింగ్ కేసు నడుస్తుండగా, తాను ఏ తప్పూ చేయలేదని లలిత్ వాదిస్తున్న సంగతీ విదితమే.

## 22 నుంచి మరో దఫా గనుల వేలం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2:** ఈ నెల 22 నుంచి నవంబర్ 1 వరకు ఏడు ఖనిజపు గనులను వేలం వేయబోతున్నట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఒడిశాలో ఉన్న ఈ గనుల్లో 148.011 మిలియన్ టన్నుల రిజర్వులు ఉన్నట్లు అంచనా. వీటిలో నాలుగు లైమ్ స్టోన్, రెండు క్రోమైట్, ఒకటి గ్రాఫైట్ అని కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గత నెలలో కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ..తొలుత వచ్చిన సంస్థలకే ఈ గనులను కేటాయించనున్నట్లు ప్రకటించారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మినరల్ ఇండస్ట్రీస్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న ఈ గనుల వేలం పారదర్శకంగా జరుగనున్నదని, ఒడిశా ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందుతున్నట్లు మంత్రి చెప్పారు.

## రింగ్ 25 సెకండ్లు మాత్రమే

### సమయాన్ని తగ్గించిన మూడు టెలికం సంస్థలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 2:** టెలికం సంస్థలైన భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ఎంపిక చేసిన సర్కిళ్లలో తమ ఫోన్ రింగ్ సమయాన్ని 25 సెకండ్లకు తగ్గించాయి. ప్రస్తుతం ఇది 30 నుంచి 45 సెకండ్లుగా ఉన్నది. ఈ విషయాన్ని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్‌కు సమాచారం అందించినట్లు తెలుస్తున్నది. రింగ్ సమయాన్ని 25 సెకండ్లకు జియో తగ్గించిన నేపథ్యంలో ఇతర టెలికం సంస్థలు ఇదే బాటపట్టాయి. ఇప్పటికే భారీ నష్టాలతో సతమతమవుతున్న టెలికం సంస్థలకు ఇంటర్ కనెక్ట్ యూసేజ్ చార్జి(ఐయూసీ)లు తగ్గడం ద్వారా కొంత ఊరట లభించనున్నది. రింగ్ సమయాన్ని 25 సెకండ్లకు తగ్గించిన విషయాన్ని సెప్టెంబర్ 28న ట్రాయ్ కార్యదర్శికి ఎయిర్‌టెల్ సమాచారం అందించింది. దీంతోపాటు వొడాఫోన్ ఐడియా కూడా ఎంపిక చేసిన సర్కిళ్లలో రింగ్ కాలపరిమితిని 25 సెకండ్లకు తగ్గించినట్లు తెలుస్తున్నది. దీనిపై కంపెనీ ప్రతినిధి స్పందించడానికి నిరాకరించారు. ఈ రింగ్ సమయం తగ్గింపుపై జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల మధ్య భేదాభిప్రాయాలు తారాస్థాయికి చేరుకు న్నాయి. దీనిపై నియంత్రణ మండలి ట్రాయ్ హెచ్చరికలు జారీచేసింది. ముందుగా ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి అన్ని టెలికం సంస్థలు చర్చించుకోవాలని సూచించింది. దీనిపై ఈ నెల 14న సమా వేశం నిర్వహించబోతున్నట్లు ట్రాయ్ వర్గాలు వెల్లడించాయి. కాగా, జియో నెట్‌వర్క్ నుంచి ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌కు వచ్చే కాల్స్‌ను జియో బలవంతంగా డిస్‌కనెక్ట్ చేస్తున్నదని ఎయిర్ టెల్ ఆరోపించడం టెలికం సంస్థల మధ్య మరోమారు కోల్డ్‌వార్ ప్రారంభమైనట్లు తెలుస్తున్నది.

## పన్నేతర ఆదాయంపై దృష్టి సారించాలి

- సీఈఏ కృష్ణమూర్తి సుబ్రమణియన్

**హైదరాబాద్, అక్టోబర్ 2:** నిర్మాణాత్మక సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించిందని ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ అన్నారు. పన్ను తగ్గించడం వల్ల ఏర్పడిన ఆర్థిక లోటును పూడ్చుకోవాలంటే కేంద్రం వెంటనే పన్నేతర ఆదాయంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదన్నారు. గత నెలల్లో జీఎస్టీ వసూళ్లు తగ్గుముఖం పట్టినప్పటికీ.. భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉన్న దానిపై ఆయన గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేశారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న యూపీఏ సర్కార్ ఎలాంటి నిర్మాణాత్మక సంస్కరణలు ప్రకటించలేదని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నుంచి 2019 వరకు ఎన్నో కీలక సంస్కరణలు ప్రకటించారని, వీటిఓల దివాలా చట్టం, జీఎస్టీ కూడా ఉన్నాయన్నారు. ఇక ప్రస్తుతం నిర్మాణాత్మక సంస్కరణల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడిందని ఆయన వ్యాఖ్యానించారు. కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న చారిత్రక నిర్ణయం లాంటిదని, దీంతో విదేశీ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపే అవకాశాలున్నాయని, అలాగే వృద్ధి మరింత పరుగులు పెట్టే అవకాశం ఉందన్నారు.

**8 శాతం వృద్ధి సాధిస్తేనే...**

ప్రపంచంలోని ఇతర దేశాల కంటే అధిక వృద్ధిని సాధించాలంటే భారత్ గరిష్ఠంగా ఎనిమిది శాతం వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. జీఎస్టీ వసూళ్లు తగ్గుముఖం పట్టడంతో జీడీపీ మరింత పడిపోయే ప్రమాదం ఉన్నదని ఆయన హెచ్చరించారు. పన్ను వసూళ్లు తగ్గుతాయని ముందుగానే అంచనావేయడం జరిగిందని, పలు వస్తువులపై జీఎస్టీని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం ఇందుకు కారణమన్నారు.

# హైదరాబాదే టాప్

- జోరుగా ఆఫీస్ స్పేస్ లీజింగ్
- బెంగళూరు, ఢిల్లీ ఎన్‌సీఆర్ వెనక్కి
- భాగ్యనగరంలో మైక్రోసాఫ్ట్ విస్తరణ
- అధిక శాతం ఐటీ సంస్థల చూపు ఇక్కడే
- జేఎల్‌ఎల్ తాజా నివేదిక విడుదల



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ**

ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో బెంగళూరు, ఢిల్లీ ఎన్‌సీఆర్ రీజియన్లను హైదరాబాద్ వెనుకకు నెట్టేసి అగ్రస్థానానికి చేరుకున్నది. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో భాగ్యనగరం ఈ ఘనత సాధించిందని అమెరికాకు చెందిన వాణిజ్య నిర్మాణ రంగ సేవల దిగ్గజం జేఎల్‌ఎల్ స్పష్టం చేసింది. ఈ సంస్థ బుధవారం రెసిడెన్షియల్, ఆఫీసు విభాగాలకు సంబంధించిన త్రైమాసిక నివేదికను విడుదల చేసింది. ఇందులో పలు ఆసక్తికరమైన విషయాల్ని పేర్కొన్నది. దేశంలోని మొత్తం ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ కాలంలో నికరంగా స్థలాన్ని లీజుకు తీసుకోవడంలో హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. ఆఫీసు సముదాయాల్లో కొత్త ఒప్పందాల్ని కుదుర్చుకోవడంలో ముందంజలో ఉన్నది. భాగ్యనగరం తర్వాతి స్థానాల్లో బెంగళూరు, ఎన్‌సీఆర్ రీజియన్లున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్‌దాకా దేశమంతటా కోటి చదరపు అడుగుల స్థలాన్ని వివిధ సంస్థలు లీజుకు తీసుకున్నాయి. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనే దాదాపు 40 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని తీసుకోవడానికి పలు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీన్నిబట్టి మొత్తం దేశీయ లీజుల్లో హైదరాబాద్ వాటా 36 శాతంగా నమోదైంది. గతేడాది ఇదే త్రైమాసికంలో కేవలం 6.3 లక్షల చదరపు అడుగుల స్థలమే (12 శాతం) సంస్థలు తీసుకున్నాయి. ఇక ఐటీ సంస్థలు హైదరాబాద్‌ను ఎంచుకోవడానికి బోలెడు కారణాలున్నాయి. అభివృద్ధిపట్ల రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి చిత్తశుద్ధితో ఉన్నదని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు అర్థం చేసుకున్నాయి. అందుకే ఐటీ దిగ్గజమైన మైక్రోసాఫ్ట్ సైతం హైదరాబాద్‌లో విస్తరణ ప్రణాళికలపై దృష్టి సారించింది. జిలింక్స్, మ్యాథ్ వర్క్స్, జేడీఏ సాఫ్ట్‌వేర్ వంటి ఐటీ సంస్థలు, సింక్రనీ ఫైనాన్షియల్ వంటి ఆర్థిక సంస్థలు నగరంలో తమ కార్యకలాపాల్ని విస్తరించాయి. ఇదే క్రమంలో 'వీ వర్క్' సంస్థ కో వర్కింగ్ స్పేస్‌లోకి అడుగుపెట్టింది. గ్రేడ్-ఏ స్థలాన్ని లీజుకు తీసుకున్నది.

**మనమే అగ్రభాగం..**

దేశవ్యాప్తంగా పూర్తయిన ఐటీ భవనాల్లో కొత్త ఒప్పందాల్ని కుదుర్చుకోవడంలో హైదరాబాద్ అగ్రభాగాన నిలిచింది. ఈ అంశంలో గతేడాది మూడో త్రైమాసికంలో హైదరాబాద్ వాటా ఏడు శాతమే ఉండగా.. ఈ ఏడాది 44 శాతానికి చేరింది. పశ్చిమ హైదరాబాద్‌లో ఐటీ పార్కులుగల మాదాపూర్, గచ్చిబౌలిలు ఇందుకు వేదికగా నిలిచాయి. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. హైటెక్ సిటీలోగల కొత్త భవనాల్లో గతంలో 95 శాతం ప్రీ-కమిట్‌మెంట్ లావాదేవీలు జరిగిన వాటిలో దాదాపు అన్ని సంస్థలు తమ కార్యకలాపాల్ని ప్రారంభించాయి. ఇది బాగా లాభించింది.

### అద్దెలు తక్కువే..

హైదరాబాద్‌లో నేటికీ ఆఫీసు సముదాయాల అద్దెలు అందుబాటులోనే ఉన్నా యి. అందుకే ఇక్కడ తమ కార్యకలాపాల్ని ప్రారంభించడానికి ఆయా సంస్థలు ముందుకొస్తున్నాయి. ఒకప్పుడు తమ కార్యకలాపాల్ని ఇక్కడే ఆరంభించిన కంపెనీల్లో పలు సంస్థలు.. మళ్లీ విస్తరణ ప్రణాళికల్నీ చేపడుతున్నాయి. నగరంలో నాణ్యమైన ఆఫీసు సముదాయం కోసం కొన్ని ఐటీ సంస్థలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ఈ కారణంగానే భాగ్యనగరంలో అనేక ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు వంటివి నగరాన్ని ఎంచుకుంటున్నాయి. భారత్‌లో ప్రప్రథమ రీట్ 2019లో ప్రారంభం కావడం చరిత్రాత్మక నిర్ణయమని, మనదేశం అంతర్జాతీయ ప్రమాణాల్ని అందుకునేందుకు ఇది తోడ్పడిందని జేఎల్‌ఎల్ హెడ్ శమంతక్ దాస్ అభిప్రాయపడ్డారు. రీట్ ఆరంభమవ్వడంతో సంస్థాగత, విదేశీ పెట్టుబడిదారులు భారత వాణిజ్య సముదాయాల్లో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొస్తున్నారని తెలిపారు.




ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మల్లికా-ఈ-కిచెన్ 2019 విజేతలతో ఆ సంస్థ ఎండీ కీ వాన్ కిమ్



## విమానాశ్రయంలో బ్రీత్ ఎనలైజర్

**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ :** పౌర విమానయాన నియంత్రణ మండలి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఆదేశాలకు అనుగుణంగా హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉన్న మెడికల్ సెంటర్‌లో బుధవారం బ్రీత్ ఎనలైజర్ పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. మహాత్మా గాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని ఎయిర్‌పోర్ట్‌లో ఏర్పాటు చేసిన ఈ మెడికల్ సెంటర్‌ను జీఎమ్మార్, డీజీసీఏ ఉన్నతాధికారులు సంయుక్తంగా ప్రారంభించారు. భద్రతా ప్రమాణాలు పెంచడంతోపాటు విమాన పైలెట్లు, ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్‌లో పనిచేస్తున్న సిబ్బంది మద్యం సేవించారా లేదా అనేది నిర్ధారించుకోవడానికి తప్పనిసరిగా బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు జరుపాలని గతంలోనే డీజీసీఏ ఆదేశించింది.

## సంగీతా పండుగ బొనాంజ

**హైదరాబాద్, అక్టోబర్ 2:** ప్రముఖ మల్టీ బ్రాండ్ రిటైల్ దిగ్గజం సంగీతా పండుగ బొనాంజను ప్రకటించింది. ఈ ఆఫర్లలో భాగంగా కంపెనీ రిటైల్ అవుట్‌లెట్లలో కొనుగోలు చేసే స్మార్ట్‌ఫోన్‌పై ఒక ఈఎంఐ ఉచితంగా అందిస్తున్నది. వీటితోపాటు ఉచితంగా జియో సిమ్, రూ.8,400 విలువైన ప్రయోజనాలు కూడా పొందవచ్చును. అలాగే ఈజీమైట్రిప్ ద్వారా బుకింగ్ చేసుకొని రూ.2,650 విలువైన బస్సు/విమానం/హోటల్‌లో ఉండే అవకాశం కల్పించింది. సంగీతా రిటైల్ అవుట్‌లెట్లలో తర్వాత కొనుగోలుపై రూ.3 వేల రాయితీ ఇస్తున్నది. అలాగే రూ.2,750 విలువైన ప్రయోజనాలు కూడాపొందవచ్చును.

# దీవించమ్మా..

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా దేవీ శరన్న వరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం నాలుగోరోజు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నిర్మల్ జిల్లా బాసరలో అమ్మవారు కూష్మాండ అవతారంలో, భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో అమ్మవారు ధనలక్ష్మిగా, శ్రీశైలం భ్రమరాంబికా దేవి, గద్వాల జిల్లా అలంపూర్‌లో జోగుళాంబదేవి అమ్మవారు కూష్మాండ దేవి, వరంగల్‌లోని శ్రీభద్రకాళి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు.


భద్రాచలంలో ధనలక్ష్మి రూపంలో..


బాసరలో కూష్మాండ అవతారంలో సరస్వతీదేవి


వరంగల్‌లో మహాలక్ష్మి అలంకరణలో భద్రకాళి



శ్రీశైలంలో కూష్మాండ దేవిగా దర్శనం



# ఎస్సారెస్పీకి స్థిరంగా వరద

## 75 టీఎంసీలకు చేరిన నీటినిల్వ

### కృష్ణాబేసిన్‌లో ప్రాజెక్టులకు నిలకడగా ప్రవాహం

### సాగర్ రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

**హైదరాబాద్/జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి/నాగర్‌కర్నూల్ ప్రతినిధి/నందికొండ/కేతేపల్లి/మెండోరా/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** గోదావరి బేసిన్‌లోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతున్నది. బుధవారం ఉదయం 11,857 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా సాయంత్రానికి, 1,087.50 అడుగులు (74.826 టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 23.2 అడుగుల వద్ద నిలకడగా ఉండి తర్వాత పెరుగుతూ వస్తున్నది. ములుగు జిల్లా దగ్గర పేరూరు దగ్గర మూడు లక్షల క్యూసెక్కులలోపు ఉన్న గోదావరి వరద ప్రవాహం బుధవారం ఉదయం 5.82 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. శ్రీరాజరాజేశ్వర జలాశయం, లోయర్ మానేరుకు ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. అంతేమేర దిగువకు వదులుతున్నారు. ఎగువన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలో కురుస్తున్న వర్షాలకు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తున్నది. దీంతో ఒకగేటు ద్వారా నీటిని విడుదలచేస్తున్నారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్‌కు వరద నీరు చేరుతున్నది.


**నాగార్జునసాగర్ రెండు గేట్ల ఎత్తివేత**

మరోవైపు కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టులకు వరద స్థిరంగా కొనసాగుతున్నది. కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న ఓ మోస్తరు వానలకు ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్టులకు వరద చేరుతుండటంతో జూరాలకు స్థిరంగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. జూరాల స్పిల్‌వే గేట్లను మూసివేశారు. తుంగభద్ర డ్యాంకు వరద స్వల్పంగా వస్తున్నది. జూరాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కోసం మాత్రమే నీరు దిగువకు వదులుతుండటంతో శ్రీశైలానికి ఇన్‌ఫ్లో గణనీయంగా తగ్గింది. ఫలితంగా శ్రీశైలం గేట్లు మొత్తం మూసివేశారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు రెండుగేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. పులిచింతలకు వచ్చే వరదను దాదాపుగా దిగువకు వదులుతున్నారు. ప్రకాశం బరాజ్ వద్ద కూడా అవుట్‌ఫ్లో క్రమంగా తగ్గుముఖం పడుతున్నది.


బుధవారం వరద నీటితో కళకళలాడుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

**మూసీ గేట్ల మూసివేత**

మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గడంతో బుధవారం రాత్రి 8 గంటలకు ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను అధికారులు మూసివేశారు. మంగళవారం రెండుగేట్ల ద్వారా నీటి విడుదల చేయగా.. బుధవారం ఎనిమిదింటి వరకు ఒక్కగేటు ద్వారా నీటిని విడుదలచేశారు. అనంతరం దానిని కూడా మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులకుగాను ప్రస్తుతం 644.65 అడుగులుగా ఉన్నది. ఇన్‌ఫ్లో రెండువేల క్యూసెక్కులుగా ఉండగా అవుట్‌ఫ్లో 340 క్యూసెక్కులుగా రికార్డయింది.


నాగార్జునసాగర్ ప్రాజెక్టు రెండు క్రస్టుగేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

**వివిధ ప్రాజెక్టుల్లో బుధవారం నాటి నీటిమట్టాల వివరాలు..**

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1704.72 | 129.72 | 128.19 | 25000 | 25000 |
| నారాయణపుర | 1615.00 | 1614.96 | 37.64 | 37.61 | 25000 | 20400 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 4764 | 2500 |
| జూరాల | 1045.00 | 1044.69 | 9.66 | 9.46 | 37000 | 28034 |
| తుంగభద్ర | 1633.00 | 1633.00 | 100.86 | 100.86 | 9575 | 9646 |
| శ్రీశైలం | 885.00 | 884.40 | 215.81 | 212.44 | 29301 | 95893 |
| నాగార్జునసాగర్ | 590.00 | 589.90 | 312.05 | 311.75 | 68101 | 67620 |
| పులిచింతల | 175.00 | 174.77 | 45.77 | 45.41 | 52113 | 49735 |
| సింగూరు | 1717.93 | 1673.56 | 29.91 | 0.73 | 25 | 25 |
| నిజాంసాగర్ | 1405.00 | 1387.62 | 17.18 | 3.16 | 1080 | 59 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1087.50 | 90.31 | 74.83 | 4040 | 759 |
| లోయర్‌మానేరు | 920.00 | 914.00 | 24.07 | 19.15 | 0 | 277 |
| శ్రీరాజరాజేశ్వర | 1043.31 | 992.72 | 25.873 | 3.37 | 0 | 0 |
| కడెం | 700.00 | 699.35 | 7.60 | 7.43 | 890 | 708 |
| ఎల్లంపల్లి | 485.56 | 484.84 | 20.18 | 19.56 | 16686 | 16686 |

## ✦ మహాత్ముడి స్మరణలో..


మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థికమంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి


ఖమ్మం నగరంలోని గాంధీ చౌక్ ప్రాంతంలో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, ఎంపీ నామా నాగేశ్వరరావు తదితరులు


కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఈటల రాజేందర్



కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్‌స్కూల్‌లో జాతిపిత విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు


వరంగల్ హంటర్‌రోడ్డులోని ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు నివాసంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం విశాఖ శారదపీఠం ఉత్తర పీఠాధికారి స్వాత్మానందేంద్ర మహాస్వామి ఆశీస్సులు పొందిన కెప్టెన్ లక్ష్మీకాంతారావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే వీ సతీశ్ కుమార్, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎంపీ దయాకర్ తదితరులు

# గాంధీమార్గమే జాతికి అవసరం

- ఉపఖండంలో శాంతి సామరస్యాలు వెల్లివిరియాలి
- తెలంగాణ వికాస సమితి సదస్సులో ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి


వరంగల్‌లో తెలంగాణ వికాస సమితి సదస్సులో ప్రసంగిస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్

**వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** భారత ఉపఖండంలో శాంతి, సామరస్య వాతావరణం పాదుకొనాలంటే గాంధీమార్గాన్ని ఆచరించడం మినహా వేరేదారిలేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గాంధీజీ కలలుగన్న సమాజ నిర్మాణం, ఆయన ఆలోచనా విధానం భరతజాతికి ఇప్పటికీ అవసరమేనని చెప్పారు. జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా బుధవారం వరంగల్‌లో ప్రజాకవి కాళోజీ ప్రాంగణం, ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు వేదికపై తెలంగాణ వికాస సమితి నిర్వహించిన సదస్సులో వినోద్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సగటు భారతీయులు, పాకిస్థానీయులు స్నేహపూర్వక వాతావరణంలోనే ఉండాలని కోరుకుంటున్నారని, అయితే కొన్ని శక్తులు మాత్రం ఆ శాంతిసామరస్య వాతావరణం ఉండొద్దని కోరుకుంటున్నాయని, వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ సాధన ఉద్యమాన్ని గాంధేయమార్గంలో నడిపి, అహింసాయుతంగా సీఎం కేసీఆర్ స్వరాష్ర్టాన్ని సాధించారని పేర్కొన్నారు. తెలంగాణ వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేశపతి శ్రీనివాస్ అధ్యక్షోపన్యాసంచేస్తూ.. 'నేడు గాంధీమూర్తిని గౌరవిస్తున్నాం.. కానీ ఆయన స్ఫూర్తిని విస్మరించే ఆధిపత్య శక్తుల మధ్యకు సమాజం నెట్టబడింది' అని ఆవేదనవ్యక్తంచేశారు. 'ప్రమాదంలో లౌకికతత్వం-గాంధీజీ ఆశయాలకు విఘాతం' అనే అంశంపై ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ అచిన్ వినాయక్ కీలకోపన్యాసం చేయగా.. ప్రొఫెసర్ జీ హరగోపాల్ 'మహాత్మా గాంధీ ప్రాపంచిక దృక్పథం-పౌరహక్కులు' అనే అంశంపై, సీనియర్ పాత్రికేయుడు, 'నమస్తే తెలంగాణ' డిప్యూటీ ఎడిటర్ పరాంకుశం వేణుగోపాలస్వామి 'గాంధీ-నేటి సందర్భం' అనే అంశంపై ప్రసంగించారు. సదస్సులో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ టి పాపిరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కే సీతారామారావు, కవ్వా లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు

### కరీంనగర్‌లో ప్రారంభించిన జిల్లా జడ్జి అనుపమ చక్రవర్తి

**కరీంనగర్ లీగల్:** బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోక్సో) కింద నమోదైన కేసుల విచారణ కోసం కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో ప్రత్యేక న్యాయస్థానాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి బుధవారం ప్రారంభించారు. హైకోర్టు ఆదేశాల మేరకు గతంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుగా ఉన్న ధర్మసనాన్ని పోక్సో చట్టం కేసుల విచారణ కోసం ప్రత్యేక కోర్టుగా మార్చారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోక్సో కేసులు 541 పెండింగ్‌లో ఉండగా.. ఇప్పటివరకు మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టు ఈ కేసులను విచారిస్తున్నది. కేసుల అపరిష్కృతస్థితి ఎక్కువగా ఉండటంతో వాటి సత్వర పరిష్కారం కోసం అదనంగా ప్రత్యేక కోర్టును ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మాధవికృష్ణ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్, అదనపు జిల్లా జడ్జీలు ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, ప్రేమ రాజేశ్వరి, లలిత శివజ్యోతి, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ మురళీధర్‌రావు, సబ్ జడ్జి సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బుధవారం కరీంనగర్‌లో ప్రత్యేక కోర్టును ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి అనుమప చక్రవర్తి


తిరుమలగిరిలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి. చిత్రంలో సినీనటుడు సునీల్

# గ్రీన్‌చాలెంజ్ స్వీకరించిన హీరో సునీల్

### పాలమూరులో ఆరువేల మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వామ్యం

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి/నమస్తే తెలంగాణ:** భవిష్యత్తుతరాల కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సినీనటుడు సునీల్ పిలుపునిచ్చారు. ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపు మేరకు గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం తిరుమలగిరిలో ఐఆర్‌ఎస్ అధికారి, సింగరేణి డైరెక్టర్ బలరాం పొలంలో బుధవారం ఆరువేల మొక్కలు నాటారు. ఇందులో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా టీ న్యూస్ ఉర్దూ ఎడిటర్ ఖాజా ఖయ్యూం అన్వర్ సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో మొక్కలు నాటారు.

# కోయిల్‌సాగర్‌లో ఇద్దరు గల్లంతు

**కోయిలకొండ/కోటపల్లి:** చేపలవేటకు వెళ్లిన విద్యార్థుల్లో ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు కోయిల్‌సాగర్ లిఫ్ట్ కాల్వలో పడి గల్లంతైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం చందాపూర్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. గల్లంతైనవారిలో నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం నేడుకూర్తితండాకు చెందిన సచిన్ (13), తోళ్లగుట్ట తండాకు చెందిన రోషన్ (8) ఉన్నారు.

**ప్రాణహితలో మరొకరు..**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన బద్ది పోచన్న (36) ప్రాణహితలో గల్లంతైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.



వనపర్తిలోని మినీట్యాంక్ బండ్‌పై మహాబతుకమ్మ సంబురాలకు భారీగా తరలివచ్చిన మహిళలు (ఇన్‌సెట్) జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

# ఘనంగా అట్ల బతుకమ్మ

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రవ్యాప్తంగా ఐదో రోజు బుధవారం అట్లతద్ది బతుకమ్మ సంబురాలు వైభవంగా జరిగాయి. మహబూబాబాద్‌లో ఎంపీ మాలోతు కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో మంత్రి సత్యవతిరాథోడ్ పాల్గొన్నారు. వనపర్తిలో మంత్రి నిరంజన్‌రెడ్డి, కొత్తగూడెంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ బతుకమ్మ సంబురాల్లో పాల్గొని పాటలు పాడారు. జగిత్యాల జెడ్పీ అధ్యక్షురాలు దావ వసంత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు పాల్గొని బతుకమ్మ ఆడారు.


బుధవారం మహబూబాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోతు కవిత, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియనాయక్ తదితరులు

# ఐదు జిల్లాల్లో వర్షం


బుధవారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం

- నల్లగొండ, ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీగా.. సూర్యాపేట, కొత్తగూడెం, పాలమూరులో ఓ మోస్తరు వాన

**న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో బుధవారం వాన కురిసింది. నల్లగొండ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ వర్షం పడగా.. సూర్యాపేట, భద్రాద్రికొత్తగూడెం, పాలమూరులో ఓ మోస్తరు వర్షం పడింది. నల్లగొండ జిల్లాకేంద్రంలో గంటపాటు కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూరు మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గంటపాటు వర్షం కురిసింది. సస్మీర్‌వాగు, లోతు ఒర్రె ఉప్పొంగి ప్రవహించగా.. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాలమూరులో బుధవారం రాత్రి వర్షం దంచి కొట్టింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రం, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, చండ్రుగొండ, పాల్వంచ తదితర మండలాల్లో వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లాలో ఓ మోస్తరు వాన పడింది.

**కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం**

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఆగ్నేయ అరేబియా సముద్రం దానిని ఆనుకొని ఉన్న మాల్దీవులు, లక్ష్యదీవుల ప్రాంతంలో సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నది. వచ్చే మూడ్రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ రాజారావు బుధవారం తెలిపారు.

**24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షసూచన**

రుతుపవనాల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో రాగల 24గంటల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గాలిలో తేమశాతం తగ్గడంతో ఉష్ణోగ్రతలు పెరిగాయని పేర్కొన్నారు.


ఆసిఫాబాద్ జిల్లాలో లోతు ఒర్రె వద్ద బైక్‌ను దాటిస్తున్న యువకులు



బతుకమ్మ పండుగ సందర్భంగా హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ చుట్టూ ఏర్పాటుచేసిన రంగురంగుల విద్యుత్‌దీపాలు



బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా ప్రమాణం చేసిన అనంతరం సుధానారాయణమూర్తికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

## అరసవల్లి ఆదిత్యుడిని తాకిన సూర్యకిరణాలు

**అమరావతి:** శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సూర్యనారాయణస్వామిని బుధవారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ఆలయ పంచద్వారాలను దాటి, గాలిగోపురం మధ్య నుంచి భానుడి కిరణాలు స్వామి వారి పాదాలను తాకాయి. ఈ అద్భుత ఘట్టాన్ని ప్రత్యక్షంగా తిలకించిన భక్తులు పెద్దపెట్టున స్వామి నామస్మరణం చేశారు. దాదాపు ఆరు నిమిషాల పాటు దర్శనం ఇచ్చిన సూర్యకిరణాల వీక్షణ కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే ఎదురుచూశారు. ఉత్తరాయణం నుంచి దక్షిణాయనానికి మారే సమయంలో సూర్యకిరణాలు అరసవల్లి సూర్యనారాయణుడి పాదాల నుంచి శిరస్సు వరకు తాకుతాయి. ఈ అద్భుత ఘట్టం ఏటా మార్చి 9, 10 తేదీల్లో, అక్టోబర్ 1, 2 తేదీల్లో కనిపిస్తుంది. మొదటిరోజు మంగళవారం ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో సూర్యకిరణాలు ప్రసరించకపోవడంతో భక్తులు నిరాశచెందారు. రెండోరోజు అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది.



- బతుకమ్మ ఆర్ట్ క్యాంప్ ప్రారంభం



మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూలో గల నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో బుధవారం తెలంగాణ జాగృతి, తెలంగాణ ఆర్టిస్టుల ఫోరం సంయుక్తంగా 'పువ్వుల పండుగ-అద్భుత తెలంగాణ' అంశంతో తొలిసారి బతుకమ్మ ఆర్ట్ క్యాంప్-2019 నిర్వహించాయి. ఒకేసారి 50 మంది కళాకారిణులు కుంచె పట్టి కాన్వాసులపై తెలంగాణ ఆడపడుచుల ఆనందోత్సవాలను ఆవిష్కరించారు. మూడురోజులపాటు కొనసాగే ఈ క్యాంప్‌ను టీ న్యూస్ సీఈవో నారాయణరెడ్డి ప్రారంభించగా.. ప్రసిద్ధ చిత్రకారిణులు గౌరి వేముల, కోయిలీ మాలతి, మేఘాసింగ్, సీ మాధవి తదితరులు పాల్గొని సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్టిస్టుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ కార్యదర్శి జే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. - సుల్తాన్‌బజార్, నమస్తే తెలంగాణ



బతుకమ్మ సంబురాల్లో భాగంగా బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జయలక్ష్మి బృందానికి చెందిన 125 మంది కళాకారులు వీణావాద్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వీణవాయిస్తున్న దృశ్యం. - రవీంద్రభారతి

## గాంధీజీ కలలను నిజంచేస్తున్నాం

- గ్రామ సచివాలయాల ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం జగన్

**తూర్పు గోదావరి:** గ్రామ సచివాలయాల ద్వారా జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం నెరవేరుతుందని ఏపీ సీఎం జగన్ పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలను గాంధీ జయంతి సందర్భంగా బుధవారం తూర్పుగోదావరి జిల్లా కరపలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. అవినీతిరహిత పాలనే లక్ష్యంగా చేసిన గొప్ప ప్రయత్నమే సచివాలయ వ్యవస్థ అని చెప్పారు. ప్రతి రెండువేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. సచివాలయ ఉద్యోగులందరికీ స్మార్ట్‌ఫోన్లు అందజేస్తామని ప్రకటించా రు.



తూర్పుగోదావరి జిల్లా కరపలో గ్రామ సచివాలయ ప్రారంభోత్సవంలో సీఎం జగన్

## డీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**హిమాయత్‌నగర్:** తెలంగాణ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎన్నికైన రఘుశంకర్‌రెడ్డి బుధవారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా టీ లింగారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం సోమయ్య, ఎం వెంకట్రాములు, పీ శంతన్, వీ రాజిరెడ్డి, కౌసర్‌ఫాతిమా, కార్యదర్శులుగా ఎం సామ్యూల్, ఎస్ భాస్కర్, కే చంద్రమౌళి, ఎం బాలకుమార్, జే రామస్వామి, అధ్యాపకజ్వాల ప్రధాన సంపాదకుడిగా డాక్టర్ ఎం గంగాధర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా డీ ఏసు రెడ్డి ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా రఘుశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలని, విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించి, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులను జారీచేయాలని.. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీచేయాలని కోరారు.



హైదర్‌గూడలో మీడియాతో మాట్లాడుతున్న డీటీఎఫ్ నూతన అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి

## 'సైరా'కు వెళ్లిన ఆరుగురు ఎస్సైలపై వేటు

- కర్నూలు జిల్లాలో ఘటన

**కర్నూలు:** విధి నిర్వహణలో ఉండి సమాచారం ఇవ్వకుండా సైరా సినిమాకు వెళ్లిన ఆరుగురు ఎస్సైలపై బదిలీ వేటుపడింది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన ఆరుగురు ఎస్సైలు బుధవారం తెల్లవారుజామున సైరా సినిమాకు వెళ్లారు. సినిమా హాల్లో వరుసగా కూర్చొని సెల్ఫీ తీసుకొని సోషల్‌మీడియాలో పోస్టుచేశారు. ఈ విషయం ఎస్పీ ఫకీరప్పకు చేరడంతో ఆరుగురు ఎస్సైలను వీఆర్‌కు బదిలీచేశారు. బదిలీవేటు పడినవారిలో అవుకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, కొలిమిగుండ్ల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, నందివర్గం ఎస్సై హరిప్రసాద్, బండి ఆత్మకూర్ ఎస్సై వెంకట సుబ్బయ్య, రాచర్ల ఎస్సై ప్రియతంరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అశోక్ ఉన్నారు.

# సాంకేతిక బతుకమ్మ!

- టీటా ఆధ్వర్యంలో తొమ్మిది 'ఎమర్జింగ్ టెక్నాలజీస్'తో రూపకల్పన
- ప్రశంసించిన ఐటీ, పరిశ్రమలశాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్
- రేపు ఐటీ కారిడార్‌లో టెక్ బతుకమ్మ ఉత్సవాలు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: బతుకమ్మ సంబురాలను సందేశాత్మకంగా నిర్వహించాలని ఐటీ ఉద్యోగులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తంగెడు, గునుగు, బంతి తదితర పూలతో దర్శనమిచ్చే బతుకమ్మను సాంకేతికతతో రూపొందించనున్నారు. ఐటీ రంగంలో నూతన, ఉత్తమ ఉపాధి వేదికలుగా నిలుస్తున్న తొమ్మిది టెక్నాలజీస్‌తో టీటా (తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్) ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించనున్నారు. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో చేపట్టనున్న ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఐటీ, పరిశ్రమలశాఖల ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ ప్రశంసించారు. యువతకు ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలను కల్పించేందుకు పలు టెక్నాలజీలకు సంబంధించిన ప్రత్యక్ష, ఆన్‌లైన్ శిక్షణను టీటా అందజేస్తున్నది. త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, ఇంటర్నెట్ ఓవర్ థింగ్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీస్, సైబర్ సెక్యూరిటీ, సర్వర్‌లెస్ కంప్యూటింగ్, వర్చువల్ రియాలిటీ, డ్రోన్ టెక్నాలజీలతో బతుకమ్మ పండుగను నిర్వహించనున్నారు. ఐటీ రంగంలో ఉపాధి కోరుకుంటున్న యువత ప్రస్తుతం ఉన్న టెక్నాలజీస్‌పై పట్టు సాధించేల ప్రేరణ కలిగించేందుకు సాంకేతిక బతుకమ్మను చేపట్టినట్టు టీటా ఫౌండర్ సందీప్ కుమార్ మక్తాలా తెలిపారు.

### బతుకమ్మ ఇలా..!

- బతుకమ్మ గోపురం 3డీ ప్రింటింగ్ డిజైన్‌తో రూపొందించబడి ఉంటుంది.
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఓవర్ థింగ్స్(ఐవోటీ) ఆధారంగా బతుకమ్మ ఓపెన్ అవుతుంది.
- రోబోటిక్స్ రోవర్ సహాయంతో బతుకమ్మ తన చుట్టూ తాను తిరుగుతుంది.
- డ్రోన్ సహాయంతో ఆ పరిధిలో బతుకమ్మ చక్కర్లు కొడుతుంది. ఇలా పలు సాంకేతిక విశిష్టలతో బతుకమ్మ రూపుదిద్దుకోనున్నది.

## దొరుకని బోటు

**తూర్పు గోదావరి:** ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కచ్చులూరు వద్ద గోదావరిలో మునిగిపోయిన బోటు వెలికితీత మూడోరోజు నిరాశపరిచింది. బుధవారం గాలింపు చేపట్టగా ఎలాంటి పురోగతి కనిపించలేదు. కచ్చులూరు వద్ద బోటును వెలికితీసేందుకు ధర్మాడి సత్యం బృందం ఉదయం 7 నుంచి 11 గంటలవరకు శ్రమించింది. ఆచూకీ లభ్యం కాకపోవడంతో మధ్యాహ్నం మరోసారి ప్రయత్నించారు.







నమస్తే తెలంగాణ

# జిందగీ

గురువారం 3 అక్టోబర్ 2019 WWW.NTNEWS.COM /nt.zindagi




నవరాత్రులు మొదలై ఐదు రోజులవుతున్నది. రోజుకో వంటకంతో దుర్గామాతకు నైవేద్యం.. ఈ తొమ్మిదిరోజులు వెజ్‌తో నోరు చప్పబడుతుంది. నాన్‌వెజ్ ప్రియులు మాత్రం పండుగరోజు కోసం ఎదురుచూస్తుంటారు. మరి ఆరోజు కూడా మామూలు వంటలే చేస్తే ఇంట్లో ఊరుకుంటారా? తెలంగాణాకు తగినట్లుగా, పండుగ స్పెషల్‌గా కొన్ని వంటల్ని ముందుగానే అందిస్తున్నాం..

# దసరా స్పెషల్!

## బగారా కోడి పలావ్

**కావాల్సినవి :**

**బాస్మతీ రైస్ :** 250 గ్రా., **చికెన్ (బోన్) :** 250 గ్రా. **పచ్చిమిర్చి :** 4, **యాలకులు :** 4, **లవంగం :** 4, **దాల్చినచెక్క :** 2, **పుదీనా :** 1 కట్ట, **పెరుగు :** 2 టేబుల్‌స్పూన్లు, **నూనె :** 2 టేబుల్ స్పూన్లు, **అల్లంవెల్లుల్లి పేస్ట్ :** 1 టీస్పూన్, **పలావు ఆకు :** 2, **కొత్తిమీర :** 2 కట్టలు, **నెయ్యి :** 1 టీస్పూన్, **ఉప్పు :** తగినంత.

**తయారీ :**

బాస్మతీరైస్‌ను శుభ్రం చేసి గంటపాటు నానబెట్టాలి. చికెన్ కూడా శుభ్రం చేయాలి. దీనికి అల్లంవెల్లుల్లి వేస్ట్ కలిపి పక్కన పెట్టుకోవాలి. కడాయిలో కొంచెం నూనె, నెయ్యి వేడిచేసి అందులో యాలకులు, లవంగం, దాల్చినచెక్క, పచ్చిమిర్చి, పెరుగు, కొత్తిమీర, పుదీనా వేసి వేయించాలి. తర్వాత చికెన్ వేసి వేయించాలి. ఇందులో తగినంత నీరు, ఉప్పు, ముందుగా నానాబెట్టిన బాస్మతీ రైస్ వేయాలి. రైస్, వాటర్ లెవల్ సమానం అయ్యేవరకూ ఉడికించి కొత్తిమీర, పుదీనా వేసి మూతపెట్టి సన్ననిమంటపై 15 నిమిషాలపాటు ఉడికించాలి. తర్వాత రైస్‌ను అన్నివైపులా కలిసేలా కలుపుకోవాలి. దీన్ని కొత్తిమీర, పుదీనాతో గార్నిష్ చేసుకొని రైతాతో తింటే అద్భుతంగా ఉంటుంది.

## చింతకాయ కోడి వేపుడు



**కావాల్సినవి :**

**నూనె :** అరకప్పు, **పచ్చిమిర్చి :** 4, **చికెన్ (బోన్) :** 250 గ్రా., **అల్లంవెల్లుల్లి పేస్ట్ :** ఒకటిన్నర టీస్పూన్, **గరం మసాలా :** అర టీస్పూన్, **ఉల్లిముద్ద :** అర కప్పు, **కరివేపాకు :** 2 రెబ్బలు, **చింతకాయలు :** 10, **ధనియాల పొడి :** అర టీస్పూన్, **కొత్తిమీర :** 1 కట్ట, **పసుపు :** పావు టీస్పూన్, **ఉప్పు :** తగినంత.

**తయారీ :** ముందుగా చింతకాయ చెక్కు, గింజలు తీసి చిన్న ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. పచ్చిమిర్చిని చీలికలుగా, కొత్తిమీరను సన్నగా తరగాలి. కడాయిలో నూనె వేడి చేసి ఉల్లిముద్ద, పచ్చిమిర్చి, పసుపు, ఉప్పు, కరివేపాకు వేసి దోరగా వేయించాలి. ఇందులో చికెన్ వేసి కలుపుతూ సన్నని సెగపై మూడువంతులు ఉడికించాలి. తర్వాత చిన్న ముక్కలుగా కట్ చేసిన చింతకాయ ముక్కలు, ధనియాల పొడి, గరం మసాలా పొడి వేసి బాగా దగ్గర పడే వరకూ ఉడికించాలి. చివరగా ఉప్పు, కారం, పులుపు సరిచూసుకొని సన్నగా తరిగిన కొత్తిమీరతో గార్నిష్ చేసి వడ్డించుకుంటే టేస్టీగా ఉంటుంది.

## సోయాకు బోటీ



**కావాల్సినవి :**

**బోటీ :** 250 గ్రా., **సోయాకు :** 1 కట్ట, **నూనె :** అరకప్పు, **పచ్చిమిర్చి :** 4, **కరివేపాకు :** అరకప్పు, **కొత్తిమీర :** అర కప్పు, **ఉల్లిముద్ద :** అరకప్పు, **అల్లంవెల్లుల్లి పేస్ట్ :** ఒకటిన్నర టీస్పూన్, **పసుపు :** అర టీస్పూన్, **కారం :** అర టీస్పూన్, **ధనియాల పొడి :** అర టీస్పూన్, **గరం మసాలా :** అర టీస్పూన్, **ఉప్పు :** తగినంత.

**తయారీ :**

ముందుగా సోయాకు, పచ్చిమిర్చి సన్నగా తరగాలి. బోటీని వేడినీటిలో ఐదు నిమిషాలపాటు ఉంచి శుభ్రం చేసుకోవాలి. తర్వాత బోటీని అల్లంవెల్లుల్లి పేస్ట్, ఉప్పు, పసుపు, కారం వేసి తగినంత నీరు పోసి కుక్కర్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించి వార్చుకోవాలి. తర్వాత కడాయిలో నూనె వేడి చేసి పచ్చిమిర్చి, కరివేపాకు, ఉల్లిముద్ద, వేసి దోరగా వేయించాలి. ఇందులో తగినంత సోయాకు వేయాలి. తర్వాత ఉడికించి వార్చి పెట్టుకున్న బోటీ వేసి ఐదు నిమిషాలపాటు మగ్గనివ్వాలి. ఇప్పుడు ధనియాలపొడి, గరం మసాలా, కారం వేసి రెండు నిమిషాలు వేయించాలి. ఉప్పు, కారం సరిచూసుకోవాలి. వేడి వేడి బోటీని సన్నగా తరిగిన కొత్తిమీరతో అలంకరించుకొని సర్వ్ చేసుకోవాలి.

## తెలంగాణ మాంసం కూర

**కావాల్సినవి :**

**చికెన్ :** అరకేజి, **ఉల్లిగడ్డలు :** 2, **యాలకులు :** 3, **దాల్చినచెక్క :** 2, **కారం :** 2 టీస్పూన్లు, **కరివేపాకు :** 2 రెబ్బలు, **కొత్తిమీర :** 1 కట్ట, **పలావు ఆకు :** 2, **నూనె :** అరకప్పు, **పచ్చిమిర్చి :** 6, **లవంగాలు :** 3, **అల్లంవెల్లుల్లి పేస్ట్ :** ఒకటిన్నర టీస్పూన్, **ధనియాలు :** 1 టీస్పూన్, **జీడిపప్పు :** అరకప్పు, **ఉప్పు :** తగినంత.

**తయారీ :**

చికెన్‌ను శుభ్రం చేసి పెట్టుకోవాలి. పాన్‌లో ధనియాలు, జీలకర్ర, జీడిపప్పు వేసి దోరగా వేయించి మిక్సీ పట్టించాలి. పచ్చిమిర్చి, కొత్తిమీర, ఉల్లిగడ్డను కట్ చేసి పెట్టుకోవాలి. తర్వాత కడాయిలో నూనె వేడిచేసి యాలకులు, లవంగం, దాల్చినచెక్క, పలావు ఆకు, పచ్చిమిర్చి, కరివేపాకు, ఉల్లిముక్కలు వేసి దోరగా వేయించాలి. ఇందులో అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేంతవరకు వేయించాలి. దీంట్లో చికెన్ వేసి కలుపుతూ ఐదునిమిషాలపాటు మగ్గనివ్వాలి. దీనికి కారం జోడించి తగినన్ని నీళ్లుపోసి మాంసాన్ని ఉడకపెట్టాలి. ఉడికిన తర్వాత ధనియాలు, జీలకర్ర, జీడిపప్పు ముద్ద వేయాలి. గ్రేవి గుజ్జుగా తయారయ్యే వరకు సన్నని మంటపై ఉడికించాలి. ఉప్పు, కారం సరిచూసి కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి. దీన్ని అన్నంతోగాని, జొన్నరొట్టెతో పాటు తింటే టేస్ట్ అదిరిపోతుంది.



## పొడి మాంసం వేపుడు



**కావాల్సినవి :**

**చికెన్ :** 200 గ్రా., **ఉలిముక్కలు :** 1 గ్రా., **వెల్లుల్లి ముక్కలు :** అర టీస్పూన్, **కొత్తిమీర :** 1 కట్ట, **జీడిపప్పు :** అర కప్పు, **నూనె :** అరకప్పు, **అల్లం ముక్కలు :** అర టీస్పూన్, **పచ్చిమిర్చి :** 4, **కరివేపాకు :** 2 రెబ్బలు, **పసుపు :** పావు టీస్పూన్, **అల్లంవెల్లుల్లి పేస్ట్ :** 1 టేబుల్‌స్పూన్, **ఉప్పు :** తగినంత.


**తయారీ :**

ముందుగా చికెన్‌ను శుభ్రం చేసుకోవాలి. దీనికి పసుపు, అల్లంవెల్లులి పేస్ట్ కలిపి కడాయిలో ఉడికించి పక్కన పెట్టుకోవాలి. మరో కడాయిలో నూనె వేడిచేసి ఉల్లిముక్కలు, పచ్చిమిర్చి, కరివేపాకు. అల్లం, వెల్లుల్లి, జీడిపప్పు వేసి దోరగా వేయించాలి. దీంట్లో ఉడికించిన చికెన్, మిక్సీ పట్టించిన పొడి వేసి సన్ననిసెగపై దోరగా వేయించాలి. చివరగా ఉప్పు, కారం సరిచూసుకొని తరిగిన కొత్తిమీరతో గార్నిష్ చేసుకొని వేడి వేడిగా సర్వ్ చేసుకొని తింటే ఆహా అనాల్సిందే.

**పొడి కోసం**

**అవిశలు :** అరకప్పు
**ఎండుమిర్చి :** 2
**జీలకర్ర :** 1 టీస్పూన్
**ధనియాలు :** అర టీస్పూన్
**ఉప్పు :** తగినంత

**పొడి తయారీ :** పొడికి సంబంధించిన వాటన్నింటినీ విడివిడిగా దోరగా వేయించుకోవాలి. వీటన్నింటినీ కలిపి మిక్సీ పట్టించాలి. ఉప్పు, కారం సరిచూసుకోవాలి.



**జి.యాదగిరి**
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్

శరన్నవరాత్రులు

# విశ్వజనని స్కందమాత



**రూపం:** మాతకే మాతగా శ్వేత వర్ణంలో ఆదిమాతయై కుమారస్వామిని లాలించే అమృతత్త్వపు స్ఫురద్రూపం స్కందమాత అవతారం. అమ్మ భావనలోనే అమృతత్త్వం ఉంది. మన కన్నతల్లిలోని అమ్మతనం కూడా జగన్మాత ప్రకాశమేననీ., మాతృదేవోభవ అనే సందేశాన్నీ మానవాళికి ప్రబోధంగా అందిస్తుంది స్కందీమాత రూపం. ఈ అమ్మ లాలిత్యమే శాశ్వత చైతన్య ఝురి. సకల సృష్టిపై వాత్సల్యపూరిత దృష్టిని ప్రసరించే విశ్వజనని స్కందమాత దృష్టివైభవాన్ని ఎంతగా వర్ణించినా తనివి తీరదు.

**ధ్యానం:** **'సింహాసన గతానిత్యం పద్మాశ్రిత కరద్వియా**
**శుభదాస్తు సదాదేవీ స్కందమాతా యశస్వినీ'**

**నైవేద్యం:** ఆశ్వయుజ శుద్ధపంచమి రోజు స్కందమాతగా జగజ్జననిని పూజించి, లలితా సహస్రనామంతో స్తుతించి సంప్రదాయ రీతిలో దద్ధోజనం లేదా పెరుగు గారెలు నివేదించాలి. చల్లని పెరుగుతో చేసిన వంటకాలను పంచమి ప్రత్యేకంగా నివేదించాలి. ఆ అమృతమయి వాత్సల్యానికి పాత్రులై తరించాలి.

**- ఇట్టేడు**

# చెయ్యి ఎందుకు వణుకుతున్నది?



అడుగండి చెబుతా

**నా వయసు 60 సంవత్సరాలు. నేను ఒక సంవత్సరం క్రితం వరకూ ఆరోగ్యంగానే ఉండేదాన్ని. బీపీ, షుగర్ లాంటి వ్యాధులు ఏమీ లేవు. సంవత్సరం నుంచి బాగా నెమ్మదిస్తున్నాను. ఏ పని చేయాలన్నా చాలా సమయం తీసుకుంటాను. త్వరగా నడవలేకపోతున్నాను. ఒకటి, రెండుసార్లు కింద కూడా పడిపోయాను. కుడి చెయ్యి వణుకుతూ ఉంటుంది. సంవత్సరం నుండి న్యూరోబైన్ మాత్రలు వేసుకుంటున్నా ఫలితం లేదు. దయచేసి పరిష్కారం చెప్పగలరు.**

**- సుజాత**

మీరు పార్కిన్‌సన్స్ జబ్బుతో బాధపడుతున్నట్టు ఉంది. ఈ జబ్బు 60 సంవత్సరాలు నిండిన వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. కూర్చుని ఉన్నప్పుడు చెయ్యి వణకడం, తొందరగా నడవలేకపోవడం, కూర్చునేటప్పుడు గబుక్కున ఒక దిమ్మ మాదిరిగా కూర్చోవడం, ఎవరన్నా వెనుక నుంచి పిలిచినప్పుడు వెంటనే తిరగలేకపోవడం, ముఖంలో కదలికలు లేకపోవడం, నోటి నుంచి ఉమ్మి కారిపోవడం వంటివి ఈ జబ్బు లక్షణాలు. మెదడులో డోపమిన్ అనే కెమికల్ తగ్గిపోవడం వల్ల మనిషిలోని కదలికలు తగ్గిపోతాయి. దీన్ని టాబ్లెట్ రూపంలో ఇవ్వడం ద్వారా మనిషిని నడిచేటట్లు చేయవచ్చు. సిండోసా, రోపాల్క్, పాసిటోన్ వంటి మందులతో ఈ జబ్బుకి వైద్యం చేయవచ్చు. ఈ మందులు వాడుకుంటూ 10–15 సంవత్సరాల వరకు వాళ్ల పనిని వాళ్లు చేసుకొనే అవకాశం ఉంటుంది. ఐదు నుంచి ఏడు సంవత్సరాలు గడిచాక మెడిసిన్స్ సరిగా పని చేయనప్పుడు డిబిఎస్ అనే సర్జరీ ద్వారా రోగిని నడిపించవచ్చు. మీరు ఒక సంవత్సరం నుంచే బాధపడుతున్నారు కాబట్టి సరైన మందులతో మీ రోగాన్ని నయం చేయవచ్చు.

**డాక్టర్ మురళీధర్ రెడ్డి**
కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్



# ఆలోచింపజేసే ఐడియా!






**దేశంలోని చాలా రాష్ట్రాల్లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. చాలాచోట్ల ఇంటి నుంచి కాలు బయటపెట్టలేని పరిస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల సరైన తిండి లేక ఆకలితో తల్లడిల్లుతున్నారు వరద బాధితులు. వరదల కారణంగా మరణాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. అయినా అధికారులు సరిగా స్పందించకపోవడంతో ఈ యువతి ఫొటోషూట్ చేసింది. ఎందుకో తెలుసా?**

వరద బాధిత రాష్ట్రాల్లో బీహార్ కూడా ఉంది. అక్కడ పరిస్థితి రోజు రోజుకూ తీవ్రమవుతున్నది. వరదల కారణంగా ఇప్పటికే 29 మంది మరణించారు. రాబోయే నెల రోజుల్లో భారీ వర్షపాతం నమోదవుతుందని అంచనా. బీహార్‌లోని పాట్నాలో ఎక్కడ చూసినా మోకాళ్ల వరకు నీరు చేరింది. అయినా ప్రజలను పట్టించుకునే అధికారులే కరువయ్యారు. దీంతో పాట్నాలోని రోడ్లు, వీధుల పరిస్థితులపై ప్రజలు, అధికారుల దృష్టిని ఆకర్షించడానికి అదితి సింగ్ అనే ఈ యువతి ఫొటోషూట్ నిర్వహించింది. ఆమె నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)లో చదువుతున్నది. దీనికోసం ఎలాంటి పోరాటం చేయలేదు. ఎవరినీ ఎదిరించలేదు. అందరినీ ఆకర్షించేలా ఫొటోషూట్ చేయించుకుంది. ఎలాగంటే నీటితో మునిగిన కారు దగ్గర నిలబడి ఫొటోకు ఫోజులిచ్చింది. ఫొటో వెనుక దాగి ఉన్న పరిస్థితిని గమనించండంటూ తన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఇలా ఎక్కడైతే దయనీయమైన పరిస్థితి ఉందో అక్కడ ఫొటోలు దిగి అక్కడి పరిస్థితిని ఫొటో రైటప్ ద్వారా వివరిస్తున్నది. మరో ప్రయత్నంగా.. ప్రజలు వరద నీటితో పడుతున్న బాధలను వీడియో రూపంలో చూపించింది అదితి. ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పాట్నా ప్రజల పరిస్థితి అర్థం చేసుకున్నవారు సాయం చేయడానికి ముందుకు వస్తున్నారు. ఫొటోషూట్ ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఆమె ఆలోచనను అందరూ అభినందిస్తున్నారు.

# క్యాన్సర్ బాధితులకు చేయూత

**డాక్టర్ నోర్డన్ కిట్టు తన జీవితాన్ని క్యాన్సర్ బాధితులకు రక్షణగా అంకితం ఇచ్చాడు. క్యాన్సర్‌తో తల్లిని కోల్పోయిన నోర్డన్ ఇంకా ఎవరూ అలా మృతి చెందొద్దని క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి రక్షణగా నిలుస్తున్నారు.**

తమిళనాడులోని ఓ ఆస్పత్రిలో నోర్డన్ వైద్యునిగా పని చేసే సమయంలో లడఖ్‌లోని ఇంటి నుంచి ఫోన్ వచ్చింది. గర్భాశయ క్యాన్సర్‌తో బాధపడుతున్న తల్లి మృతిచెందినట్టు తెలిసింది. ఇది నోర్డన్‌ను బాధించింది. మరోసారి నోర్డన్ పని చేస్తున్న గ్రామంలో ఓ మహిళ క్యాన్సర్‌తో బాధపడడాన్ని చూశాడు. విరాళాలు సేకరించి ఢిల్లీ ఆస్పత్రిలో చికిత్స అందించినా ఆమె ప్రాణాలు నిల్వలేదు. దీంతో నోర్డాన్ నిర్ణయించున్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళలందరికీ సాయం చేయాలనుకున్నారు. అవసరమైన వైద్య చికిత్సలు అందించాలనుకున్నాడు. తిరిగి లఢఖ్ వెళ్లి 'హిమాలయా ఉమెన్ హెల్త్ ప్రాజెక్ట్' చేపట్టారు. స్థానికంగా ఉండే మహిళా క్యాన్సర్ బాధితులను చేరదీసి ఆరోగ్యసేవలు ప్రారంభించారు. త్రీవస్థాయిలో క్యాన్సర్ ఉంటే విదేశీ డాక్టర్లను రప్పించి చికిత్స అందించారు. 2010లో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ద్వారా 10 వేల మందిని నోర్డన్ బృందం పరీక్షించింది. వెయ్యి మందికి ముందస్తు గాయాలను గుర్తించి చికిత్స అందించారు. వాటిని నయం చేయడానికి స్క్రీన్ అండ్ ట్రీట్ విధానాన్ని ఉపయోగించారు. నొప్పి లేకుండా వాటిని నయం చేసినట్టు బృందంలోని సింగపూర్‌కు చెందిన గైనకాలజిస్టు కూక్ స్వీచోంగ్ చెప్పారు. ఇట్లా హెల్త్ క్యాంపే కాకుండా.. లడఖ్‌లోని




పొగాకు నివారణ కార్యక్రమం ద్వారా పొగాకు లేని లడఖ్ కోసం పాటుపడుతున్నారు.

ఆరోగ్య చిట్కాలు



- మాంసాహార పదార్థాలకు గర్భిణులు దూరంగా ఉండాలి. పచ్చి మాంసం, ఉడికీ, ఉడకని మాంసం తినకూడదు.
- గర్భిణులు ఒకేసారి ఎక్కువ మోతాదులో ఆహారం తీసుకునే బదులు వీలైనన్ని ఎక్కువసార్లు మితంగా ఆహారం తీసుకోవడం మంచిది.
- పాలకూరను ఆహారంలో ఎక్కువసార్లు తీసుకుంటే శరీరానికి కావాల్సిన ఐరన్ పుష్కలంగా లభిస్తుంది.
- ప్రతిరోజూ కనీసం 20 నిమిషాల సేపు నడక అలవాటు చేసుకుంటే మానసిక ఒత్తిడి నుంచి బయటపడొచ్చు.
- వేడిగా ఉన్న టీలో కొంచెం తేనె కలిపి తాగితే తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
- బెండకాయలకు రెండు వైపులా తొడిమె, చివరి కొద్ది భాగం తీసివేసి పాలిథిన్ కవర్‌లో ఉంచి ఫ్రిజ్‌లో భద్రపరిస్తే తాజాగా ఉంటాయి.
- అరకప్పు నిమ్మరసంలో కొద్దిగా అల్లం రసం కలిపి తాగితే దగ్గు తగ్గుతుంది.
- భోజనం చేశాక కాస్త ఉప్పు, ఇంగువ చూర్ణాన్ని మజ్జిగలో వేసి తాగితే ఆహారం బాగా జీర్ణమవుతుంది. ఫలితంగా కడుపు ఉబ్బరం సమస్య కూడా తగ్గుతుంది.

11.

నమస్తే తెలంగాణ
# రైతుబడి
[ కరీంనగర్ ]
గురువారం 3 అక్టోబర్ 2019

raithubadi@ntnews.com

రోగాలను కలిగించే సూక్ష్మజీవులు పట్టుపురుగుల పెంపకపు గది లోపల, బయట, పురుగులను పెంచే పరికరాలపై ఉండి పట్టు పురుగులను పెంచేటప్పుడు వాటికి రోగాలను కలిగిస్తాయి. రోగాలను కలిగించే సూక్ష్మజీవులను నాశనం చేయడాన్నే 'రోగ నిరోధక చర్య' అంటారు. పట్టుపురుగులను పెంచడానికి ముందు, తర్వాత పెంపకపు గదిలోపల, బయట, పెంపకపు పరికరాలను రోగ నిరోధక చర్య చేయడం వల్ల పంట నష్టాన్ని అరికట్టి, నాణ్యమైన అధిక పట్టుగూళ్ల దిగుబడిని సాధించవచ్చు.





## వానకాలం పట్టుపురుగుల పెంపకంలో
# రోగనిరోధక చర్యలు, ఫలితాలు

పట్టుగుడ్లను పెట్టించినప్పడి నుంచి అవి పెరిగే వరకు వాటిలోని పిండాలన్ని ఆరోగ్యంగా, సమానంగా ఎదగడానికి, తద్వారా ఎక్కువ పగులు శాతాన్ని సాధించడానికి గుడ్లకు అవసరమైన వాతావరణ పరిస్థితులు కల్పించాలి. కానీ ఎక్కువ వానలు పడటం వల్ల, గాలిలో తేమ శాతం ఎక్కువై సూక్ష్మజీవులు పెరిగి, పట్టు పురుగులపై వ్యాధులు రావడానికి అవకాశం ఉంటుంది. సాధారణంగా పట్టుగుడ్లను పొదగబెట్టే సమయంలో 25 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, 80 శాతం తేమ, రోజుకు 16 గంటల వెలుతురు, 8 గంటల చీకటి గల వాతావరణ పరిస్థితులు అవసరం. అందువల్ల పెంపకపుగది, పరికరాలు శుభ్రంగా, సంపూర్ణంగా రోగ నిరోధక చర్య చేపట్టడం వల్ల, పట్టుపురుగులపై వచ్చే వ్యాధులను సమూలంగా నివారించవచ్చు.



**కింది విధంగా రోగ నిరోధక చర్యను చేపట్టాలి.**

**1) పంట పూర్తయిన తర్వాత చేయాల్సిన పని వివరాలు**

- పట్టుగూళ్ల విడిపించడానికి ముందే చంద్రికల నుంచి రోగం సోకిన చనిపోయిన, పురుగులను, నాసిరకం గూళ్లను ఏరి కాల్చివేయాలి.
- గూళ్లను విడిపించిన తర్వాత చంద్రికలను అంటుకున్న పట్టుపోగులను చీపురుతో తీసివేసి ఆ తర్వాత చంద్రికలను బర్నర్‌తో కాల్చాలి.
- పట్టుగూళ్లను అమ్మిన వెంటనే పెంపకపు గదిని రోగనిరోధక చర్య చేయాలి. గది కిటికీలను గాలి ప్రసరణ కోసం తెరిచి ఉంచాలి.

**4) పెద్దపట్టు పురుగుల దశలో**

- రెండవసారి రేరింగ్ గదిని 97.5 లీటర్ల నీటికి 2.5 లీటర్ల శాంటిక్ ద్రావణం, 5 ప్యాకెట్లు ఉత్తేజకారిని స్ఫటికాలు, అరకిలో కాల్చిన సున్నపు పొడి చొప్పున కలిపి తయారుచేసిన మిశ్రమ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- రేరింగ్ షెడ్‌కు నడిచివెళ్లే దారి వెంట, గది చుట్టూ 1:19 నిష్పత్తిలో కలిపిన బ్లీచింగ్ పొడి, శుభ్రపరుచగా వచ్చే చెత్తపై 1:19 నిష్పత్తిలో బ్లీచింగ్ పొడి, కాల్చిన సున్నంపొడి మిశ్రమాన్ని చల్లి పూడ్చిపెట్టాలి.
- పంట పూర్తయిన తర్వాత మొదటిసారి 100 లీటర్ల నీటికి 2 కిలోల బ్లీచింగ్ పొడి, 300 గ్రాముల కాల్చిన సున్నపు పొడి మిశ్రమాన్ని రోగనిరోధక చర్యగా పెంపకపు గదిని శుభ్రపరుచాలి.

**2) తరువాత పంటకు చాకీ కట్టడానికి ముందు**

- పట్టుపురుగుల పెంపకపు గదిలో, పరికరాలపై గల దుమ్ము, ధూళి పోయేటట్లు నీటితో శుభ్రపరుచాలి. ఎండలో ఆరబెట్టాలి.

**3) చాకీ పురుగుల దశలో**

- ముందు పంట పాలుకారు రోగం లేదా ఫ్లాచరీ రోగాల వల్ల ఎక్కువగా దెబ్బతిని ఉంటే 100 లీటర్ల నీటికి 300 గ్రాముల కాల్చిన సున్నపు పొడి చొప్పున కలిపిన ద్రావణంతో అదనంగా కాల్చిన సున్నపు పొడి మిశ్రమాన్ని చల్లాలి.

**పురుగులను పెంచే సమయంలో రోగనిరోధక చర్య, స్వచ్ఛతను పాటించడం**

**పురుగులను పెంచే సమయంలో శుభ్రతను పాటించడం వల్ల ద్వితీయ రోగ సంక్రమణ, రోగవ్యాప్తిని అరికట్టవచ్చు.**

1) పురుగుల పెంపక గదిలోకి ఎక్కువమందిని వెళ్లనివ్వరాదు.
2) రేరింగ్ గదిలో ప్రతిసారి ఒకటి కంటే ఎక్కువ పట్టుపురుగుల పంటలను పెంచరాదు.
3) పురుగులను పెంచే పరికరాలను ఇతరుల నుంచి తీసుకోరాదు.
4) పురుగులను పెంచేటప్పుడు, గూళ్లను అల్లేటప్పుడు పురుగులకు గాయాలు కాకుండా జాగ్రత్త పడాలి.
5. రోగం వచ్చిన పురుగులను నేలపైగాని లేదా ఎక్కడపడితే అక్కడ పారవేయరాదు.

**చేతులను శుభ్రం చేసుకోవడం**

పట్టుపురుగులు పెంచే గదిలోకి వెళ్లే ముందు చేతులను సబ్బుతో కడుక్కోవాలి. ప్రవేశద్వారం దగ్గర బేసిన్‌లో గల 2.5 శాతం క్లోరిన్ గల 0.5 శాతం సున్నపుపొడి ద్రావణంలో గాని లేదా 2 శాతం బ్లీచింగ్ పొడిగల 0.3 శాతం సున్నంపొడి ద్రావణంలో గాని లేదా 2 శాతం ఫార్మాలిన్‌తో గాని చేతులను శుభ్రం చేసుకున్న తర్వాత పురుగుల పెంపకపు కార్యక్రమాల్లో పాల్గొనాలి. గది నుంచి బయటకు వెళ్లేటప్పుడు కూడా చేతులను మరోసారి కడుక్కోవాలి.

- ప్రవేశద్వారం దగ్గర 5 శాతం బ్లీచింగ్ పొడిగల సున్నపుపొడి చల్లిన గోనె సంచిపై పాదాలను తుడుచుకున్న తర్వాతనే రేరింగ్ గదిలోకి వెళ్లాలి.
- పట్టు గుడ్లు నీలిచుక్క దశకు తిరగకముందే ఉపరితలాన్ని 2 శాతం ఫార్మాలిన్ ద్రావణంలో 10 నిమిషాలు ముంచి తర్వాత మంచినీటితో కడిగి, నీడలో ఆరబెట్టి, పొదగడం చేయాలి.
- జ్వరానికి పోయే ముందు సున్నపు పొడిని, జ్వరం నుంచి లేచిన తరువాత విజేత పొడిని పురుగులపైనా, పడకలపైన సమానంగా చల్లాలి.
- రోగం బారిన పడిన పురుగులను నేలపై పడనీయరాదు. వీటిని పెంపుడు జంతువులకు ఆహారంగా వేయరాదు. పడకలను శుభ్రపరిచే ముందు, రోగం బారిన పడిన పురుగులను వీటి శరీరాలు చిట్లకుండా చిన్న కర్ర ముక్కలతో (చాప్‌స్టిక్స్) వేరు చేసి నాశనం లేదా కాల్చివేయాలి.
- రోగగ్రస్థ పురుగులను 5 శాతం బ్లీచింగ్ పొడి గల సున్నపు పొడి మిశ్రమం గల బేసిన్‌లోకి వేసిన తర్వాత వాటిని పూడ్చి పెట్టడం లేదా కాల్చివేయాలి. వెంటనే చేతులు కడుక్కోవాలి.
- బెడ్ క్లీనింగ్ చేయగా వచ్చే చెత్తను వెడల్పాటి నైల్ షీట్‌లోకి సేకరించి, ఎరువు దిబ్బలో వేసిన తరువాత దానిపై 5 శాతం బ్లీచింగ్ పొడి గల సున్నపు పొడిని చల్లాలి. తరువాత మట్టితో కప్పి కుళ్లింపజేయాలి.
- రేరింగ్ గది, గూళ్లు అల్లించు గదుల చుట్టు పరిశుభ్రత పాటించాలి. రేరింగ్ గదికి నడిచివెళ్లు దారి వెంబడి, గది చుట్టూ 5 శాతం బ్లిచింగ్ పొడి గల సున్నపు పొడిని ప్రతి 2–3 రోజులకోసారి చల్లుకోవాలి.

ఈవిధంగా పట్టు రైతు సోదరులు పైన చెప్పిన విధంగా వానకాలంలో రోగనిరోధక చర్యలు చేపట్టాలి. దీనివల్ల పట్టుపురుగులకు వచ్చే వ్యాధుల బారి నుంచి రక్షించడమే కాకుండా నాణ్యత కలిగిన పట్టుగూళ్ల సంఖ్య పెరిగి, మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది.

**చీకూరి రాజాగౌడ్**
73964 00740
శాస్త్రవేత్త,
(ఎంటమాలజీ విభాగం)
రాష్ట్ర ఉద్యాన
విశ్వవిద్యాలయం



# జింకు లోప నివారణ



రాష్ట్రంలో సాగు చేస్తున్న వరి పంటలో జింకు లోపం సాధారణమైంది. సకాలంలో లోప లక్షణాలు గుర్తించి సవరిస్తే, దిగుబడి, నాణ్యత పెరుగుతుంది.

**జింకు లోపానికి దారితీసే పరిస్థితులు**

సల్ఫర్ లోపంతో జింకు లోపం ముడిపడి ఉంటుంది. ప్రధానంగా తటస్థ నేలలు, సున్నపు నేలలు, ముమ్మరంగా పంటలు వేసే నేలలు,మురుగునీరు పోయే సౌకర్యం లేని నేలలు, క్షారత్వపు, చౌడు నేలలు, ఇసుక నేలలు, ఫాస్ఫరస్, సిలికాన్ మూలకాలు అధికంగా ఉన్న నేలలు, కోతకు గురయ్యే నేలలు, ఆమ్ల నేలలు, గరుకు స్వభావం కలిగిన నేలలు, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం అధికంగా లిగిన నేలల్లో జింకు లోపం అధికంగా ఉంటుంది. కాలుష్యపు మురుగు నీరు పారించే నేలలు, అధికంగా సేంద్రియ ఎరువులు, పంట వ్యర్థాలు వాడే నేలల్లో కూడా జింకు లోప లక్షణాలు కనిపిస్తాయి. వరిలో అత్యధికంగా లోపించే మూలకం జింకు. ఆధునిక రకాలు, పంటల ముమ్మర సాగు, జింకు అధికంగా తీసుకునే రకాల వాడకంతో లోప లక్షణాలు పెరుగుతున్నాయి.

**లోప లక్షణాలు**

- సాధారణంగా ప్రధాన పొలంలో నాటిన రెండు నుంచి నాలుగు వారాలలో జింకు లోప లక్షణాలు కనిపిస్తాయి.
- మొక్కలు గిడసబారుతాయి. గిడస బారిన మొక్కలపై ఆకులపై 'బ్రౌన్' మచ్చలు కనిపిస్తాయి.
- మొక్కలు అసహజంగా పెరుగుతాయి.
- పొలంలో అక్కడక్కడ అంతగా ఎన్నుకోని మొక్కలు ఉంటాయి.
- నత్రజని ఎరువులు వేసిన పైరు పచ్చపడదు.
- కంకులలో తాలు ఏర్పడుతుంది.
- లేత ఆకులలో మొదలు దగ్గర మధ్య ఈనెలు పాలిపోతాయి.
- ఆకు మధ్య ఈనెలు పాలిపోతాయి. ఆకు మధ్య ఈనెల వెంబడి తెల్లని చార ఏర్పడుతుంది.
- ఆకు వ్యాసార్థం తగ్గుతుంది. ఆకులు పెలుసుగా ఉండి, వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి.
- ఆకులు సామర్థ్యం కోల్పోయి, ఉదా రంగులోకి మారుతాయి.

పొలంలో నీరు ఎక్కువగా ఉన్న సమయంలో 'బైకార్బోనేట్లు' సాంద్రత పెరిగి పంట తొలి దశలో జింకు లోపం లేత ఆకులలో కన్పిస్తుంది. అయితే 4–6 వారాలలో పంట తిప్పుకుంటుంది. ఒకవేళ మొదటల్లో లోప లక్షణాలు ఎక్కువగా ఉంటే పంట ఆలస్యంగా కోతకు వస్తుంది. దిగుబడులు తగ్గుతాయి. జింకు లోప లక్షణాలు– ఇనుప ధాతు లోప లక్షణాలతో టుంగ్రో వైరస్ లక్షణాలతో పోలి ఉంటాయి. అయితే ఇనుప ధాతువు ఎక్కువగా వేసి పంటల్లో దాదాపు అవే లక్షణాలు కన్పిస్తాయి.

**లోప లక్షణాల సవరణ**

- వరి నారుమడులలో జింకు సల్ఫేట్ వెదజల్లాలి.
- 2–4 శాతం జింకు ఆక్సైడ్ ద్రావణంలో నారు ముంచి ప్రధాన పొలంలో నాటాలి.
- వరి పంట పండించే భూములలో ప్రతి మూడు పైర్లకు ఒకసారి, రెండు పంటలు పండించినట్లైతే ప్రతి యాసంగి కాలంలో ఆఖరి దమ్ములో ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి. లేదా లీటరు నీటికి 20 గ్రాముల జింకు సల్ఫేటు కలిపి ఐదురోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి.
- జింకు సల్ఫేట్ భాస్వరం ఎరువుతో కలిపి వేయరాదు. ఈ రెండింటి వాడకానికి మధ్య కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి. పురుగు,
- తెగుళ్ల మందులను జింకు సల్ఫేట్ ద్రావణంలో కలిపి వాడరాదు.

**డాక్టర్ అమరపల్లి గీత**
అసిస్టెంట్ ప్రొఫెసర్
వ్యవసాయ కళాశాల, పాలెం



# మొక్కలే ఆమె ఊపిరి

**ఇంటి పంట**



ఇన్ని మొక్కలు పెంచాలంటే
నిజంగా కొంచెం పిచ్చి ఉండి తీరాలి.
పిచ్చి లేకపోతే పట్టణంలో ఇంత పచ్చదనం
పెంచడం అంత సులువు కాదు.
ఓకే.
తమ ఆరోగ్యం కోసం, తమ ఆనందం కోసం
కూరగాయలు, పండ్లు పెంచితే ఆ ఫలం పరిమితం.
కానీ ఈమె చేస్తున్న పని అపరిమితం.
అందుకే వందకు పైగా ఔషధ మొక్కల్ని పెంచి
వాటి ఫలాల్ని తన ఇంటికే పరిమితం చేసుకోకుండా
ఆరోగ్యాన్ని అందరికీ పంచుతున్న అమృతవల్లి
ఆరోగ్య కల్పవల్లి హైమావతి..

కూకట్‌పల్లి కెపిహెచ్‌బి కాలనీ, వసంత్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి హైమావతి తాము అద్దెకు ఉన్న ఇంట్లో వందకు రకాలకుపైగా ఔషధ మొక్క లు పెంచుతుందంటే ఆమెకు మొక్కలపై ఎంత మమకారమో తెలుస్తుంది. ఇరువై ఏండ్లుగా తమ ఇంట్లో రకరకాల పూలమొక్కలు, పండ్లమొక్కలు, కూరగాయలు పండించిన హైమావతి ప్రస్తుతం ఔషధ మొక్కలపై పూర్తి దృష్టి సారించారు. మొక్కల పెంపకం అనేది తనకు చిన్ననాటి నుంచి ప్రకృతిపై ఉన్న ప్రేమ నుంచి వచ్చినా, ఔషధ మొక్క ల పెంపకంపై ప్రత్యేక దృష్టి మాత్రం అందరికీ ఆరో గ్యం అనే కోణంలోంచి వచ్చిందటారు హైమావతి. ఆధునిక జీవనశైలి తీసుకువచ్చిన మార్పుల వల్ల, ఇవాళ ప్రతిఒక్కరూ ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు. ఐతే చిన్న చిన్న సమస్యలకు కూడా డాక్టర్ దగ్గరకు పరిగెత్తి, పూటకు గుప్పెడు మందులు వేసుకుంటున్నారు. ఇది మరిన్ని ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లల శరీరం కూడా మందులతో నిండిపోతున్నది. అసలు ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే, ప్రకృతి చూపిన బాటలో సాగాలంటారు హైమావతి. అందుకోసమే నిత్యం మనకు అవసరమైన మందుమొక్కలు మన చెంతనే ఉండాలనే ఆలోచనతో అందరికీ మందుమొక్కలను అందుబాటులో పెడుతున్నారు హైమావతి. తన దగ్గరికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఒక మొక్కను ఉచితంగా ఇస్తుంటారామె. తమ ఇంట్లో పెరుగుతున్న ప్రతి మొక్కనూ చూపించి, వాటి ఔషధ గుణాల్ని వివరిస్తుంటారు.

లసి, కలబంద, తిప్పతీగ, వావిలి, అర్జున, శతావరి, సరస్వతి ఆకు, పిప్పళ్లు, నేల ఉసిరి, నేల వేము, అశ్వగంధ, రణపాల, నల్లేరు, మిరియాలు, పిప్పంటి, సర్పగంధి, దుంపరాష్ట్రం, వాము, కామంచి, ఉమ్మెత్త, ఉత్తరేణి, బోడతరం, అడ్డసారం, అత్తిపత్తి, పొడపత్రి, తెల్ల ఈశ్వరి, చెన్నంగి, కొండపిండాకు, గుంటగలగర, ఇన్సులిన్ వంటి పలు ఔషధ మొక్కలే కాక గోరింట, శంకుపూలు, మందార, లిల్లీ, పారిజాతం వంటి పూలమొక్కలు, బొప్పాయి, నేరేడు, అరటి, సీతాఫలం, నిమ్మ, ఉసిరి, యాపిల్‌బేర్, స్వీట్‌లైమ్, బత్తాయి, లక్ష్మణఫలం, కొబ్బరి వంటి పండ్లమొక్కలు కనిపిస్తాయి. వీటితోపాటు కుంకుడు, మునగ, చింత, కానుగ, పసుపు, కంద, యాలకులు, మల్టీ విటమిన్ వంటి పలురకాల మొక్కలు ఇక్కడ కనిపిస్తాయి.

ఈ మొక్కలను ఇంట్లో పెంచుకుని చిన్నచిన్న ఆరోగ్యసమస్యలు తలెత్తినపుడు ఎలా వాడాలో హైమావతి వివరిస్తారు. అయితే ఇందులో పెద్దల ద్వారా తెలుసుకున్నది కొంత, అనుభవంలో అర్థం చేసుకున్నది మరికొంత అంటారు. వీటిలో కొన్ని మొక్కలను ఆయుర్వేద నిపుణుల సలహాతో నిత్యం వాడితే చాలావరకు ఆరోగ్య సమస్యలను ముందుగానే నియంత్రించుకోవచ్చంటారు హైమావతి. ఔషధ మొక్కల్లో ముందుగా **తులసి** ఉపయోగాల్ని తెలియనివారు లేరనే చెప్పాలి.

ఉదయాన్నే పరగడపున తులసి రసాన్ని తీసుకోవడం వల్ల జీర్ణ శక్తి మెరుగవుతుందని ఆయుర్వేదం చెబుతున్నది. ప్రతిరోజూ 5 నుంచి 25 గ్రాముల నల్ల తులసి రసాన్ని తేనెతో కలిపి తీసుకుంటే.. ఆస్తమా నుంచి ఉపశమనం పొందవచ్చు. అలాగే నల్లతులసి రసాన్ని మిరియాల పొడిలో వేసి ఆ మిశ్రమాన్నినూనె లేదా నెయ్యితో కలిపి తీసుకుంటే గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి బయటపడవచ్చు. ఇంతే కాక జలుబు చేస్తే కొంచెం తులసి ఆకులు, లవంగాలు, కొంచెం ఉప్పు కలిపి తీసుకుంటే, అన్నిటి నుంచి మంచి ఉపశమనం కలుగుతుంది. తులసి చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలలో ఎంతగానో ఉపయోగపడుతుంది, దగ్గు, జలుబు, విరేచనాలు, మరియు వాంతులు వంటి సాధారణ సమస్యల నుంచి విముక్తినిస్తుంది.



ప్రస్తుతం **కలబంద** ప్రయోజనాలెన్నో పరిశోధనల్లో బయటపడ్డాయి. అలోవెరా పేరిట కలబంద ఉత్పత్తులు అనేకం అందుబాటులోకి వచ్చాయి. సబ్బుల నుంచి మందుల దాకా కలబంద ఎన్నోరకాలుగా మన వినియోగంలో ఉంది. జీర్ణశక్తిని పెంపొందించుకోడానికి, గుండె మంటను తగ్గించుకునేందుకు, అజీర్తివల్ల ఏర్పడే వ్యాధులు అరికట్టడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. శరీరం కాలిన చోట కలబంద రసాన్ని వాడితే పూర్తి ప్రయోజనం చేకూరుతుంది. ఉదయాన్నే పరగడుపున కలబంద ఆకుని తింటే కడుపులో ఉన్న అన్నిరకాల వ్యాధుల్ని మటుమాయం చేస్తుంది. కప్పు నీటిలో చెంచా కలబంద రసం, చెంచా అల్లం రసం వేసి సన్నని మంటపై వేడిచేయాలి. ఈ మిశ్రమాన్ని తాగితే శరీరంలో పేరుకుపోయిన అధిక కొవ్వు కరుగుతుంది.

**తిప్పతీగ**ను ఆయుర్వేదంలో అమృతవల్లి అని అంటారు. తిప్పతీగతో తయారుచేసిన మందులను, పదార్థాలను తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తిప్పతీగలో యాంటీఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. అలాగే శరీరంలోని కణాలు దెబ్బతినకుండా ఉండేందుకు వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు తిప్పతీగ బాగా పని చేస్తుంది. దీనిలో రక్తాన్ని శుభ్రపరిచే గుణాలు ఉన్నాయి. పలు రకాల వ్యాధులకు కారణమయ్యే బ్యాక్టీరియాతో పోరాడగల గుణాలు తిప్పతీగలో ఉంటాయి. కాలేయ సంబంధిత వ్యాధుల బారిన పడకుండా చేస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరిచే శక్తి తిప్పతీగకు ఉంటుంది. కాస్త తిప్పతీగ పొడిని కాస్త బెల్లంలో కలుపుకుని తింటే చాలు అజీర్తి సమస్య పోతుంది.

**అర్జున** దీన్ని తెలుగులో మద్ది చెట్టు అంటారు. దీని బెర డు అధిక రక్తపోటు, గుండె నొప్పి మొదలైన వివిధ రకాలైన గుండె జబ్బులలో చాలా ఉపయోగపడుతుంది. అర్జున బెరడును పాలలో కాచి వచ్చిన డికాక్షన్ ను ఉదయం పూట పరగడుపున తాగితే గుండె జబ్బుల, ఆస్తమా ఉన్నవారికి వారికి ఉపశమనం కలుగుతుంది. అలాగే బెరడును బాగా మెత్తగా నూరి చూర్ణంగా చేసి తింటే ఆస్తమా తగ్గుతుంది. మధ్యవయస్సు స్త్రీలకు వచ్చే ఆస్టియో ప్లోరోసిస్‌కు ఇది మంచి మందు. అర్జున బెరడు కషాయంతో కాలినగాయాలు, పుళ్లు తగ్గుతాయి. దీని చూర్ణాన్ని తేనెతో తీసుకుంటే విరిగిన ఎముకలు త్వరగా అతుక్కుంటాయి.

**ఔషధ మొక్కల్లో శతావరిని** నిజంగా ఆరోగ్యవర్ధిని అని చెప్పవచ్చు. పిత్త దోషం అదుపు చేయడానికి దీన్ని వాడతారు. హార్మోన్ల సమతౌల్యం కాపాడటంలో ఇది కీలకమైనది. కడుపులో వచ్చిన అల్సర్లు, శ్వాస సంబంధ అంటువ్యాధులు, విరేచనాలు వంటి వాటికి శతావరి చక్కనైన మందు. శతావరి వాడటం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది.

**సరస్వతి ఆకు**ను ఆయుర్వేద వైద్యంలో విరివిరిగా ఉపయోగిస్తున్నారు. వీటి రసాన్ని పాలల్లో కలిపి పిల్లలకు ఇస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఏకాగ్రత కలుగుతుంది. మెదడు సంబంధిత వ్యాధులను నివారించడంతో అద్భుతంగా పనిచేస్తుంది. మేధాశక్తిని పెంచుతుంది. ఈ ఆకుల రసం పచ్చకామెర్ల వ్యాధిని నివారించడంలో తోడ్పడటమే కాక రక్తాన్ని శుద్ధి చేయడంలోను ఉపయోగపడుతుంది. ఆ ఆకులు చూర్ణాన్ని కొద్దిగా వాము, నీళ్లతో కలిపి తీసుకుంటుంటే కొలస్ట్రాల్ తగ్గుతుంది.

ఆయుర్వేద వైద్యంలో **వావిలి** ఆకులను వాత సంబంధమైన నొప్పులకు, శరీరంపైన వాపులను తగ్గించడానికి వాడతారు. దీని ఆకుల రసంలో నువ్వుల నూనె కలిపి కాచి, వాతపు నొప్పులకు, వాపులకు, పై పూతగా పూస్తే తగ్గుతాయి. ఆకులు వేసి కాచిన నీటిలో స్నానం చేస్తే, వాతపు నొప్పులకు బాలింత నొప్పులకు బాగా ఉపశమనం కలుగుతుంది. అలాగే వావిలి ఆకులు కషాయం కాచి, మిరియాలు పొడి కలిపి ఇస్తే జలుబు, తల భారంతో వచ్చే జ్వరం త్వరగా తగ్గుతుంది. వావిలి ఆకు, గుంట గలగర ఆకు, తులసి, వాము, కలిపి దంచి రసం తీసి ఇస్తే కీళ్ల నొప్పులకు బాగా ఉపశమనం కలుగుతుంది. వావిలి ఆకు రసం, అల్లంరసం కలిపి ముక్కులో వేస్తే పార్శ్వపు తలనొప్పి తగ్గుతుంది.

**నేల ఉసిరి** ఆకులు చాలా చిన్నగా ఉంటాయి. వీటిని కామెర్ల వ్యాధిలో, చర్మరోగాల్లో, షుగర్ వంటి జబుల్లో ఉపయోగిస్తారు. కామెర్ల వ్యాధిలో ఇది అత్యంత ఉపయుక్తమైన మందు. నేల ఉసిరి చూర్ణాన్ని ఉత్తరేణి ఆకులరసాన్ని, దిరిసెన పట్ట చూర్ణాన్ని సమంగా కలిపి తేనెతో తీసుకుంటే క్రిమిరోగాలు తగ్గుతాయి. దీని కషాయం తాగితే చలి జ్వరం, దీర్ఘకాలిక జ్వరం తగ్గుతుంది. ఆకులు ముద్దగా నూరి సమపాళ్లలో ఉప్పుకలిపి వాపులపై పట్టిస్తే బాధ దూరమవుతుంది. దీని కషాయం గ్లాసునీళ్లలో కలిపి వారం రోజులు తాగితే కిడ్నిలో రాళ్లుకూడ కరుగుతాయని చెబుతారు.

**నేలవేము** కాషాయాన్ని వారానికి మూడుసార్లు తీసుకుంటే షుగర్ వ్యాధి అదుపులోకి వస్తుంది. ఇందులోని యాంటీ ఫంగల్ గుణాల వల్ల చర్మవ్యాధులలో అద్భుతంగా పనిచేస్తుంది. జీర్ణ సంబంధమైన అనేక వ్యాధులలో నేలవేము అద్భుత ఫలితాలు చూపుతుంది.

ఆయుర్వేదంలో అతి ఎక్కువగా వినియోగింపబడేది **అశ్వగంధ.** దీన్నే పెన్నేరుగడ్డ అని కూడా అంటారు. జ్ఞాపకశక్తిని అత్యంత వేగంగా పెంచే ఔషధంగా దీనికి పేరు ఉంది. ఇది స్త్రీలలో రక్తాన్ని శుభ్రపరిచి, రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. ఇందులో యాంటీ ఎజింగ్ గుణాలున్నాయి. అశ్వగంధ కీళ్లనొప్పులు, వాపులను తగ్గిస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఆర్థరైటిస్, యాంటీ బాక్టీరియల్, యాంటీ డిప్రెసెంట్ గుణాలు అనేకం ఉన్నాయి. ఇది ఒత్తిడిని నివారిస్తుంది.

**నల్లేరు** నాలుగు పలకల కాండంతో సన్నగా పెరిగే తీగజాతి మొక్క విరిగిన ఎముకలను అతికించడంలో చాలా ముఖ్యమైంది. పిల్లల ఎముకలు ధృఢంగా పెరగడానికి దోహదపడుతుంది.




మధ్య వయస్కులకు కీళ్లనొప్పులు రాకుండా చూస్తుంది. కీళ్ల నొప్పులుంటే తగ్గిస్తుంది. ఎముకలు పెళుసెక్కడం, ఎముకలు పటు త్వం తగ్గడం వంటి వయోవృద్ధుల సమస్యలకు ఇది చక్కని పరిష్కారం. రెండు చుక్కల నల్లేరు కాడల రసం చెవిలో వేస్తే పోటు తగ్గుతుంది. నల్లేరు ఆకుల రసం 1,2 చెంచాలు తాగితే నీళ్ల విరేచనాలు తగ్గుతాయి. ఈ నల్లేరును వంటల్లో అనేకరకాలుగా ఉపయోగించుకోవచ్చు.

ముట్టుకుంటే ముడుచుకునే **అత్తిపత్తి** రక్తశుద్ధి చేయడంలో చాలా ఉపయుక్తం. ఇది ముక్కు నుంచి కారే రక్తాన్ని ఆపుతుంది. షుగర్ వ్యాధి, బోధకాలు, కామెర్లను, పొడలను, కుష్టును, విరేచనాలను, జ్వరాన్ని తుంటి నొప్పిని తగ్గిస్తుంది. ఆయుర్వేద వైద్యశాస్త్రంలో దీనిని మూత్ర వర్ధకంగాను, ఉత్తేజకారిగాను, జీర్ణకారిగాను, మలబద్ధ నివారిణిగాను ఉపయోగిస్తారు. ఇది గుండెను, ప్లీహాన్ని ఉత్తేజపరుస్తుంది. దీనిని మధుమేహంలో, జ్వరం, ఉబ్బసం నివారణ కోసం వాడుతారు. పొడపత్రి ఆకులతో షుగరు వ్యాధిని దూరం చేయవచ్చు. ఇంకా అనేకరకాలుగా పొడపత్రి ఆరోగ్యవర్ధినిగా పనిచేస్తున్నది.

ఇవేకాక వాము, పసుపు, మిరియాలు, అల్లం, మునగ వంటి వాటి ప్రయోజనాలు అందరికీ తెలిసినవే. ఇలా అన్నీ కాకపోయినా ఇంటి వైద్యానికి అవసరమైన మొక్కలను ఉన్న కొద్ది ప్రదేశంలో నే చిన్న చిన్న కుండీల్లో కూడా పెంచుకోవచ్చుని హైమవతి నిరూపిస్తున్నారు. ఇలా చేసుకోగలుగుతే ప్రతి చిన్నదానికి డాక్టరు దగ్గరికి పరిగెత్తాల్సిన అవసరం రాదంటారామె.

షుగర్ వ్యాధిని నియంత్రణలో ఉంచే ఇన్సులిన్ మొక్కను హైమావతి చాలామంది పరిచయం చేశారు. దీనివల్ల ప్రయోజనం పొందినవారు మాకు చెబుతుంటే వారి కళ్లలో మెరుపును మేమెప్పటికీ మరువలేము అంటారామె. మనం మరిచిపోతున్న, మరిచిపోయిన అనేక మొక్కలను, వాటి ఔషధగుణలను వెలుగులోకి తెస్తున్నారు. ఐతే ఆ పనంతా తన ఒక్కదానివల్లే కాలేదని, ఇందుకు తన భర్త మధు, పిల్లలు అందించిన సహకారం చాలా విలువైనదంటారామె. ఈ మొక్కల పెంపకానికి మట్టి కుండలు, వృథాగా పడేసిన ప్లాస్టిక్ డబ్బాలు వంటి రకరకాల వ్యర్థ వస్తువులను వాడుతుంటారు. ఎవరైనా మొక్కలు పెంచాలనుకున్నపుడు కుండీలు కొత్తగా కొనడం కంటే, వాడిపారేసిన వస్తువులను పునర్వినియోగంలోకితెస్తే పర్యావరణానికి ఎంతో మేలు చేసినవారమవుతామంటారామె.

**హైమావతి గారిని సంప్రదించాల్సిన నెంబర్ 9948666645**

కె.క్రాంతికుమార్‌రెడ్డి, 9603214455
నేచర్స్‌వాయిస్

# పొగాకు, వక్క ఉత్పత్తులపై రాజస్థాన్‌లో నిషేధం



**జైపూర్:** గాంధీ జయంతి సందర్భంగా నికోటిన్, పొగాకు, వక్కపొడి ఉత్పత్తులపై రాజస్థాన్ ప్రభుత్వం నిషేధం విధించింది. పాన్ మసాలాతోపాటు మెగ్నీషియం కార్బొనేట్, నికోటిన్, పొగాకు, మినరల్ ఆయిల్ రుచులతో తయారుచేసిన వక్కపొడి ఉత్పత్తి, నిల్వ, పంపిణీ, అమ్మకాలను రాష్ట్రంలో నిషేధిస్తున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ రఘుశర్మ ప్రకటించారు. 'ఆహార భద్రత చట్టం కింద ఈ ఉత్పత్తులపై పూర్తి నిషేధం ఉంటుంది. యువతలో మాదకద్రవ్యాల అలవాటును నిరోధించేందుకు ఇదొక ముఖ్యమైన ముందడుగు. బీహార్, మహారాష్ట్ర తరువాత ఈ ఉత్పత్తులపై పూర్తి నిషేధం విధించిన మూడో రాష్ట్రం రాజస్థానే' అని శర్మ తెలిపారు.

# మాది రాజ్యకాంక్ష కాదు.. రక్షణవాదం

- ఉగ్రవాదం ప్రపంచానికి పెనుముప్పుగా మారింది
- మాల్దీవుల పర్యటనలో సైన్యాధిపతి బిపిన్ రావత్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2:** ఇతర దేశాలపై పెత్తనం చెలాయించాలనే ఆలోచన భారత్‌కు లేదని, తన భావజాలాన్ని ఇతరులపై రుద్దే ప్రయత్నం ఎన్నడూ చేయదని సైన్యాధిపతి బిపిన్‌రావత్ పేర్కొన్నారు. బాధ్యత కలిగిన అభివృద్ధి చెందుతున్న దేశంగా.. ప్రాంతీయంగా, ప్రపంచవ్యాప్తంగా ఎదురయ్యే భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కొనడానికి కృషిచేస్తున్నదని చెప్పారు. ఐదురోజుల మాల్దీవుల పర్యటనలో భాగంగా రావత్ బుధవారం మాల్దీవుల అధ్యక్షుడు ఇబ్రహీం మహ్మద్ సోలిహ్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మన రెండు దేశాల మధ్య ఒక సారూప్యత ఉన్నది. ఇతర ప్రాంతాలపై పెత్తనం చెలాయించాలని, మన భావజాలాన్ని ఇతరులపై రుద్దాలని ఎన్నడూ ప్రయత్నించం' అని పేర్కొన్నారు. అదేసమయంలో భారత్ వ్యూహాత్మక నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకుంటుందని, పొరుగు దేశాల నుంచి ఎదురయ్యే భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి సైనిక సామర్థ్యాన్ని పెంచుకుంటుందని రావత్ స్పష్టం చేశారు. బాధ్యత కలిగిన దేశంగా ప్రాంతీయంగా, ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కోవడంలో ముందుంటామని చెప్పారు. 'భారత భద్రతా బలగాలు జమ్ముకశ్మీర్‌లో నిత్యం పరోక్ష యుద్ధంలో పాల్గొంటున్నాయి. శత్రువుల దాడిని తిప్పికొడుతున్నాయి. అందుకే దాయాది దేశాల నుంచి పొంచి ఉన్న ఎలాంటి ముప్పునైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్ తన ఆయుధ సామర్థ్యాన్ని పెంచుకునే హక్కు ఉన్నది' అని పాకిస్థాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఉగ్రవాదం అనేది ప్రస్తుతం ప్రపంచానికి పెనుముప్పుగా మారిందని చెప్పారు. భారీ స్థాయిలో ప్రాణహననం చేయగల ఆయుధాలు వ్యాప్తి చెందుతుండటం మరో సవాల్‌గా మారిందన్నారు.



## ధర్మగంట

# దళిత మహిళ భూమి కబ్జా

- కబ్జాదారులతో వీఆర్వో, సర్వేయర్ కుమ్మక్కు
- బాధితురాలికి భూమే లేదంటున్న వీఆర్వో
- రికార్డుల్లోకి ఎలా వచ్చిందంటే తెలియదంటూ దాటవేత
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన కామారెడ్డి జిల్లా బాధితురాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కబ్జాదారులతో కుమ్మక్కైన వీఆర్వో, సర్వేయర్ తమకు తీరని అన్యాయం చేస్తున్నారని కామారెడ్డి జిల్లా కేంద్రం సమీపంలోని సారంపల్లి గ్రామానికి చెందిన దళిత మహిళ దొబ్బాల బాబాయమ్మ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని తనకు విరాసత్ చేయకుండా ఇతరులకు కట్టబెట్టారని వాపోయారు. తనకు, తన భర్త బాలయ్యకు ఆరోగ్యం బాగుండటం లేదని, తమ తరపున తన మేనమామ కుమారుడు బాలరాజు అధికారులను కలిస్తే నీకేమి సంబంధమని అడ్డగోలుగా బూతులు తిడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో బాధితులు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

'నా పేరు బాబాయమ్మ. కామారెడ్డి మండలం సారంపల్లిలోని సర్వే నంబర్ 214/5లో మా నాన్న దొబ్బల ప్రభురాజుకు 26 గుంటల భూమి ఉన్నది. ఈ భూమి మాత్రమే మాకు ఆధారంగా మిగిలింది. మా నాన్న 2004లో చనిపోగా, ఆ తర్వాత అమ్మ కూడా చనిపోయారు. మా నాన్న చనిపోయిన తర్వాత ఆ భూమిని నా పేరిట విరాసత్ చేయ్యాలని కోరితే అధికారులు పట్టించుకోవడంలేదు. 2011-12 వరకు పహాణీలో మా నాన్న దొబ్బల ప్రభురాజు పేరు వచ్చింది. 2013-14 పహాణీలో మా నాన్న పేరిట ఉన్న సర్వే నంబర్‌ను వీఆర్వో తొలగించారు. అడిగితే సమాధానం ఇవ్వడం లేదు. సర్వే చేయాలని కోరితే నాకు ఇక్కడ భూమి లేదని చెప్తున్నారు. నా తరపున మా మేన మామ కుమారుడు బాలరాజు మాట్లాడితే నువ్వు మాట్లాడొద్దంటూ బూతులు తిడుతూ వెళ్లారు. నా భూమిని అగ్రకులానికి చెందిన వాళ్లు కబ్జాచేశారు. తిరిగి స్వాధీనం చేసుకోవడానికి వెళ్తే కొట్టడానికి వస్తున్నారు. సర్వేచేసి హద్దులు నిర్ణయించమని తాసిల్దార్ సెప్టెంబర్ 17న నిర్ణయిస్తే.. వీఆర్వో లేడని సర్వేయర్ వచ్చి సర్వే చేయకుండా వెళ్లారు. తాసిల్దార్ తిరిగి 21వ తేదీ నిర్ణయిస్తే వీఆర్వో, సర్వేయర్లు ఇద్దరూ వచ్చి నాకు భూమి లేదని చెప్పి సర్వేచేయకుండా వెళ్లారు. ఎలాగైనా నా భూమిని కబ్జాదారుల నుంచి విడిపించి నాకు ఇప్పించండి.'

### నేనే స్వయంగా ఫీల్డ్‌కు వెళ్తా

**బాధితులు** వచ్చి కలుస్తే నేనే స్వయంగా సారంపల్లికి వెళ్లి విచారించి న్యాయం చేస్తా. వారి భూమి వారికి వచ్చేలా చేస్తా. రికార్డులు పూర్తిగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాను.

– రాజేందర్, కామారెడ్డి తాసిల్దార్

### వాళ్లకు భూమి లేదు

**కామారెడ్డి** మండలం సారంపల్లికి చెందిన బాబాయమ్మకు సర్వే నంబర్ 214/5లో భూమి లేదు. వాళ్ల నాన్న పేరు ఎలా రికార్డుల్లోకి వచ్చిందో కూడా నాకు తెలియదు. భూమి లేదు కాబట్టి ఆమె పేరును పహాణీలో తొలగించాను. వాళ్ల పేరిట వేరే సర్వే నంబర్‌లో భూమి ఉన్నది. ఆ సర్వే నంబర్ ఊర్లోనే లేదు. 214 సర్వే నంబర్‌లోనిది ప్రభుత్వ భూమి. ఈ భూమిని బాబాయమ్మ తండ్రి ప్రభురాజు పేరిట ఎవరు అసైన్ చేశారో తెలియదు. పాస్‌పుస్తకం, పహాణీల్లో ప్రభురాజు పేరు ఉన్నది. రికార్డులో ఉన్నంత మాత్రాన భూమి ఉన్నట్టు కాదు. వారికి ఎలా వచ్చిందో వాళ్లే రికార్డు తెచ్చి చూపించాలి.

– బాలయ్య, వీఆర్వో

# కోలుకోని బీహార్

## 42కు చేరిన వరద మృతులు

- దారుణంగా దెబ్బతిన్న 13 జిల్లాలు.. 3 జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్
- సహాయ చర్యలు వేగవంతం.. విలేకరులపై సహనం కోల్పోయిన సీఎం నితీశ్
- అమెరికాలోనూ వరదలు పోటెత్తుతున్నాయని ఆగ్రహం



పాట్నాలోని రాజేంద్రనగర్ ప్రాంతంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ప్రతినిధులు అందజేసిన ఆహార ప్యాకెట్లను తీసుకుంటున్న బాధితులు

**పాట్నా, అక్టోబర్ 2:** భారీ వర్షాలతో పోటెత్తిన వరదల నుంచి బీహార్ ఇంకా కోలుకోలేదు. గత నెల 27-30 మధ్య కురిసిన భారీ వర్షాల వల్ల మరణించిన వారి సంఖ్య 42 మందికి చేరుకున్నది. రాష్ట్ర రాజధాని పాట్నాతోపాటు పలు జిల్లాల్లో పరిస్థితి దయనీయంగానే ఉంది. వర్షాలతో పలు సబ్ స్టేషన్లన్నీ జలమయం కావడంతో కొన్ని రోజులుగా పలు ప్రాంతాల్లో ప్రజలు విద్యుత్ సరఫరా లేక అంధకారంలోనే మగ్గుతున్నారు. బుధవారం సహాయ చర్యలు వేగవంతమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని నీటిని మోటారు పంపులతో తోడేస్తున్నారు. కాగా, పాట్నాతోపాటు మరో మూడు జిల్లాలకు వర్ష సూచన ఉన్నదని పేర్కొంటూ భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మరోవైపు మంగళవారం రాత్రి పాట్నాలో సహాయ చర్యలను ఆ రాష్ట్ర సీఎం నితీశ్‌కుమార్ పర్యవేక్షించారు. సహాయ శిబిరాల్లోని బాధితులను పరామర్శించారు. పాట్నాలో వరదల కారణంగా ప్రజల కడగండ్లపై మీడియా ప్రశ్నించడంతో నితీశ్ సహనం కోల్పోయారు. 'పాట్నాలో మాత్రమే వరదలు వస్తున్నాయా? ముంబైతో పాటు అమెరికాలో కూడా వర్షాల వల్ల వరదలు పోటెత్తడం లేదా?' అని ఎదురు ప్రశ్నించారు. భారత్‌లోని ఇతర ప్రాంతాల్లోనూ, ప్రపంచ దేశాలనూ వర్షాలు ముంచెత్తుతున్నాయని ఆగ్రహంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వంలో ఏ ఒక్కరూ ఖాళీగా కూర్చోలేదన్నారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చిన వరదలతో ఏర్పడిన ప్రకృతి విపత్తు ఇది అని పేర్కొన్నారు. చాలా కాలం తర్వాత పాట్నాను వరదలు ముంచెత్తాయని, ప్రజలు సంయమనం పాటించాలని అభ్యర్థించారు. అయితే, నితీశ్ సర్కార్‌పై ఆయన మిత్రపక్షం బీజేపీ కూడా విమర్శలకు దిగింది. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని ఆరోపించారు. నితీశ్ సారథ్యంలోని ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పాట్నా వరద నీటిలో మగ్గుతున్నదన్నారు. సహాయ చర్యల పేరిట లూటీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్షం ఆర్జేడీ స్పందిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా డ్రైనేజీ ప్రాజెక్టుల్లో భారీ అవినీతి చోటుచేసుకున్నదని ఆరోపించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేసింది.



పాట్నాలోని సైదాపూర్‌లో వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం నితీశ్‌కుమార్

ఇబ్బందుల మధ్య 17 లక్షల మంది ప్రజలు

వరదల వల్ల బీహార్‌లో 17.09 లక్షల మంది ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. పాట్నాతోపాటు 12 జిల్లాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. పాట్నాలో 342.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇది రాష్ట్ర సగటు 255 మి.మీ. కంటే ఎక్కువ. కాగా, రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు సహాయ సిబ్బంది, ఆరు జాతీయ విపత్తు నివారణ సంస్థ (ఎన్డీఆర్‌ఎఫ్), రెండు రాష్ట్ర విపత్తు నివారణ సంస్థ (ఎస్డీఆర్‌ఎఫ్) బృందాల సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. 10 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 31 మంది గర్భిణులతోపాటు 361 మంది రోగులను దవాఖానలకు తరలించారు. డిప్యూటీ సీఎం సుశీల్‌కుమార్ మోదీ, పద్మభూషణ్ అవార్డు గ్రహీత, జానపద గాయకురాలు శ్రద్ధ సిన్హా కుటుంబాలను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బాధిత ప్రజల కోసం ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్‌లతోపాటు భారత వాయుసేనకు చెందిన హెలికాప్టర్ల నుంచి ఆహార పొట్లాలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఔషధాలు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు జార విడిచారు. మంగళవారం రాత్రి పాట్నాలోని నాలా రోడ్డులో కొన్ని రోజులుగా నీటిలోనే మునిగి ఉన్న ఒక పెట్రోల్ పంపులో అగ్ని ప్రమాదం సంభవించింది. దీనికితోడు పెట్రోల్ పంపు ట్యాంకర్ల నుంచి పెట్రోల్ లీకవ్వడంతో మంటలు వ్యాపించాయి. ఆ ప్రాంతం అంతా చీకటిగా ఉండటంతో ఘటనా స్థలానికి చేరుకోవడానికి అగ్ని మాపక దళ సిబ్బంది ఇబ్బందులు పాలయ్యారు. కొన్ని గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు.

# ఉత్పాదకత పెంపే లక్ష్యం

- కొత్త వ్యవసాయ విధాన ముసాయిదా సిద్ధం
- రూపకల్పనచేసిన సెంటర్ గుడ్ గవర్నెన్స్ సంస్థ
- వ్యవసాయంలో ప్రైవేటు పెట్టుబడులు, అద్దెయంత్రాల వినియోగంపై సిఫారసు
- భూసార నిర్వహణ, బ్యాంకు రుణాలపై కూడా సూచనలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయంలో ఉత్పాదకత పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన వ్యవసాయ విధానాన్ని తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నది. అదే సమయంలో మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపర్చేందుకు వ్యవసాయరంగంలో భారీగా ప్రైవేట్ పెట్టుబడులను తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా కాంట్రాక్టు వ్యవసాయంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహించాలని చూస్తున్నది. వ్యవసాయ ఆదాయం పెంచడంతోపాటు ఆచరణీయ ప్రతిపాదనను తయారుచేసేందుకు వ్యవసాయ ముసాయిదాకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) రూపకల్పన చేసింది. ఈ వ్యవసాయ విధానం ఐదేండ్ల పాటు అమల్లో ఉండనున్నది. మూడేండ్ల తర్వాత సమీక్షించుకొనేలా ముసాయిదాను తయారుచేశారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు దీర్ఘకాలిక, స్థిరమైన పరిష్కారాలు చూపడమే ధ్యేయంగా వ్యవసాయ విధాన ముసాయిదాను సిద్ధం చేస్తున్నట్టు అధికారులు చెప్తున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో సమానంగా దిగుబడులు పొందడంతోపాటు, పర్యావరణానికి అనుకూలమైన, సహజ వనరులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఉన్నది.

**కూలీల కొరత.. అదనపు విలువల జోడింపు**

వ్యవసాయ విధాన ముసాయిదాలో తెలంగాణ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పలు సవాళ్లను పేర్కొనడంతోపాటు, అందుకు తగిన పరిష్కారమార్గాలను కూడా సూచించారు. ఇందులో ప్రధానంగా 85 శాతం వ్యవసాయ భూములు చిన్న, సన్నకారు రైతులే సాగు చేస్తుండటం, నీటిపారుదల ప్రాంతం కేవలం 41శాతం మాత్రమే ఉండటం.. అందులోనూ నీటి వినియోగ సామర్థ్యం తక్కువగా ఉండటం, వాతావరణ మార్పుల ప్రభావం, పంట ఉత్పత్తులకు అదనపు విలువల జోడింపు వ్యవస్థ లేకపోవడం, గ్రామీణ యువత వ్యవసాయాన్ని వదిలేయడం, కూలీల కొరత పెరగడం వంటివి ఉన్నాయి.

**వ్యవసాయ రుణాలు, పంటల బీమా**

సీజన్ ప్రారంభానికి ముందు పంటరుణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ఇందుకోసం మండలస్థాయిలో తహసిల్దార్, బ్యాంకు మేనేజర్, మండల వ్యవసాయాధికారితో కమిటీ ఏర్పాటుచేసి.. బ్యాంకులు, రైతులకు అనుసంధానంగా ఉంటూ వ్యవసాయ రుణాలు ఇప్పించాలి. బీమా కంపెనీలు క్షేత్రస్థాయిలో రైతులకు కస్టమర్ సేవలు అందించేలా చూడాలి.

**భూసార నిర్వహణ**

పంటల ఉత్పాదకతలో భూసారమే ప్రధానమైంది. దీంతో రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్‌ను వినియోగించి రాష్ట్ర ఉత్పాదకత, ఉత్పాదకత లేని భూములను మ్యాపింగ్ చేయాలని ముసాయిదాలో పేర్కొన్నారు. గ్రామస్థాయిలో భూసార పరీక్షల కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు దశలవారీగా రైతులకు శాశ్వత (వాటర్ ప్రూఫ్) భూసారన మూనా కార్డులివ్వాలని, వ్యవస్థాపక మోడల్‌లో గ్రామీణ సేంద్రియ పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు.

**రైతులకు అందుబాటులో పరిశోధనా ఫలితాలు**

వ్యవసాయ పరిశోధన, విద్య ఫలాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించవచ్చునని ముసాయిదాలో వివరించారు. ఇందుకోసం వాతావరణ మార్పులపై రైతులతోపాటు వ్యవసాయాధికారుల్లో అవగాహన కల్పించనున్నారు. ప్రతి ఏఈవో క్లస్టర్‌లో ఆటోమెటిక్ వాతావరణకేంద్రం ఏర్పాటు చేసి, గ్రామస్థాయిలో దీర్ఘకాల వాతావరణ సూచనలను రైతులకు అందుబాటులో ఉంచడంతోపాటు వాతావరణానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సిఫారసు చేశారు. అవసరమైతే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దాతల నుంచి నిధుల సమీకరణ ఉండాలని పేర్కొన్నారు. వీటితోపాటు వ్యవసాయ విధానముసాయిదాలో పలు అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.

### విత్తనాలు, యాంత్రీకరణ

**సోయాబీన్,** శనగ, వేరుశనగ విత్తనాలను రాష్ట్రానికి సరిపడా మనవద్దే ఉత్పత్తి చేసుకోవాలి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వ విత్తనకేంద్రాలను ఆధునిక సాంకేతికతో పునరుద్ధరించాలి. రైతులు విత్తనాలు చల్లడానికంటే ముందే అన్నిస్థాయిలో పరీక్షించాలి. విత్తన నియంత్రణను బలోపేతం చేసేందుకు విత్తన ఉత్పత్తి, పంపిణీలో పాల్గొనే సంస్థల మధ్య సంబంధాన్ని ఏర్పరిచేందుకు ఒక నోడల్ ఏజెన్సీని ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. వ్యాపార నమూనాలో కస్టమ్ హైరింగ్ కేంద్రాలను ప్రోత్సహించడంతోపాటు వరినాటు యంత్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పత్తితీత యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు, ఓలా, ఉబేర్ తరహాలో వ్యవసాయయంత్రాలను అద్దెకు ఇవ్వడానికి అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

# సౌదీలో అజిత్ దోవల్

- ఆ దేశ యువరాజుతో కశ్మీర్‌పై చర్చలు
- ఇటీవల పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పర్యటన నేపథ్యంలో సమావేశం
- అబుదాబి యువరాజుతోనూ భేటీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2:** జమ్ముకశ్మీర్ అంశంపై భారత్, సౌదీ అరేబియా చర్చించాయి. బుధవారం సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో భారత జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురు చర్చించారు. ప్రధానంగా జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని భారత్ రద్దు చేయడం, సౌదీ అరేబియాలోని చమురు నిల్వ కేంద్రాలపై ఇటీవల జరిగిన డ్రోన్ దాడి గురించి ఇరువురు చర్చించుకున్నారు. అలాగే ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, భద్రత చర్యల్లో సహకారం, సమకాలీన జాతీయ విషయాలు తదితర అంశాలు కూడా చర్చకు వచ్చాయి. జమ్ముకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడంలో తమకు సహకరించాలంటూ ఇటీవల సౌదీ అరేబియాలో పర్యటించిన పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్.. యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌ను కోరారు. ఈ నేపథ్యంలో అజిత్ దోవల్ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. అబుదాబి యువరాజు మహమ్మద్ బిన్ జయాద్ నయ్యాన్‌తోనూ దోవల్ సమావేశమయ్యారు. అధికారులు మాట్లాడుతూ ఇరుదేశాల యువరాజులతో దోవల్ చాలా అంశాలపై చర్చించారని చెప్పారు. జమ్ముకశ్మీర్ విషయంలో భారత్ చర్యలను యువరాజు సల్మాన్ అర్థం చేసుకున్నారని తెలిపారు. ఈ చర్చలు ఇటు భారత్‌కు, అటు సౌదీ అరేబియా, అబుదాబి దేశాలకు ప్రయోజనం చేకూర్చనున్నాయని పేర్కొన్నారు.

# అసైన్డ్ భూమి ఆక్రమణ

- తిరిగి ఇప్పించాలని అధికారులను కోరుతున్న బాధితులు
- రికార్డుల్లో ప్రభుత్వ స్వాధీనంగా నమోదు
- క్షేత్రస్థాయిలో కబ్జాదారుల చేతుల్లో భూమి
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన సిద్దిపేట జిల్లావాసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం అసైన్‌చేసిన భూమి కబ్జా అయింది. కబ్జాదారులు అసైన్‌దారులను భూమివద్దకు కూడా రానివ్వడం లేదు. భూమిని విడిపించుకోవడానికి బాధితులు రెండేండ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తాసిల్దార్ మొదలుకొని జిల్లా కలెక్టర్‌వరకు అర్జీలు పెట్టినా సమస్య పరిష్కారం కాలేదు. రికార్డుల్లో మాత్రం రెవెన్యూ అధికారులు ఈ భూమిలో ప్రభుత్వ స్థలమంటూ ఒక బోర్డు ఏర్పాటుచేసి, ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్టుగా పహాణీలో రాసుకోవడం ఇక్కడ కొసమెరుపు. కబ్జాదారుల నుంచి భూమిని కాపాడుకోవడానికి సిద్దిపేట జిల్లా బాధితులు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం రేగులపల్లికి చెందిన కరీం రాళ్లు కొట్టుకొని కుటుంబాన్ని పోషించేవారు. మూడు దశాబ్దాల కింద భూమిలేని నిరుపేదలకు భూమి ఇచ్చే పథకం కింద కరీంకు అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్ 414లో 2.25 ఎకరాల భూమిని కేటాయించింది. కరీంకు కుమారులు సయ్యద్ హైదర్, సయ్యద్ మదార్, సయ్యద్ మౌలానా ఉన్నారు. వీరు చిన్నకోడూర్ మండలం మల్లారంలో రాళ్లు కొట్టుకుంటూ కొంతకాలం ఉన్నారు. రెండేండ్లు ఈ భూమిని రావులపల్లి నర్సయ్యకు కౌలుకు ఇచ్చినట్టు కరీం కుమారుడు మదార్ తెలిపారు. ఆ తర్వాత మూడేండ్లు వీరి బావ కౌలుచేశారని, అదే సమయంలో గౌని తిరుపతి అనే మరో వ్యక్తి ఆక్రమించుకొనే ప్రయత్నంచేయగా, తాము అడ్డుకున్నామని మదార్ చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లో కేసులు కూడా పెట్టామని వివరించారు. 2017 నుంచి తాసిల్దార్‌కు, జిల్లా కలెక్టర్‌కు, ప్రజావాణిలో డివిజన్ అధికారికి ఇలా వరుసగా విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నామన్నారు. గిర్దావర్, వీఆర్వో వచ్చి విచారించి పంచనామా చేశారని, ఆ తర్వాత ఫైల్ దొరుకలేదని నివేదిక ఇచ్చారని తెలిపారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కబ్జాదారులు తమను భూమిపై రానివ్వడం లేదని వాపోయారు. ఎలాగైనా తాసిల్దార్ స్వయంగా విచారించి తమకు న్యాయంచేయాలని, వారసత్వంగా వచ్చిన అసైన్డ్ భూమిని తమకు అప్పగించాలని బాధితుడు కోరుతున్నారు.

**బాధితులకు న్యాయం చేస్తా**

నేను స్వయంగా గ్రామానికి వెళ్లి విచారించి బాధితులకు న్యాయంచేస్తాను. కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాను. బాధితులు నన్ను కలిశారు. రికార్డుల్లో 1999 ప్రాంతంలో రెండేండ్లపాటు కరీంవారసులు సయ్యద్ మదార్, సయ్యద్ హైదర్ పేర్లు వచ్చాయి. ఈ భూమిపై వివాదం రావడంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బోర్డు కూడా ఏర్పాటు చేసింది. రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదుచేశాం. దీనిపై వీఆర్వో క్షేత్రస్థాయిలో విచారణచేసి నివేదిక ఇచ్చారు. నేను స్వయంగా గ్రామానికి వెళ్లి విచారించి చర్యలు తీసుకుంటాను.

– హరిబాబు, బెజ్జంకి తాసిల్దార్



బుధవారం హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైద్యవిద్య ప్రొఫెసర్లు

# పదోన్నతుల్లో రిజర్వేషన్లు పాటించేలా చూడండి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వైద్యవిద్య ప్రొఫెసర్ల వినతి


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను ప్రభుత్వ బోధన దవాఖానలకు చెందిన ప్రొఫెసర్లు కలిసి వినతిపత్రం సమర్పించారు. బుధవారం కమిషన్ కార్యాలయానికి వెళ్లిన ప్రొఫెసర్లు పదోన్నతుల్లో రిజర్వేషన్లు పాటించడం లేదని చైర్మన్‌కు విన్నవించారు. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ దవాఖానల్లో పదోన్నతుల్లో అన్యాయం జరిగిందని, అర్హులు ఉన్నా సరైన విధానంలో పదోన్నతులు కల్పించలేదని వివరించారు. పదోన్నతులకు సంబంధించిన అంశంలో విచారణ జరిపి తమకు న్యాయంచేయాలని కమిషన్ చైర్మన్‌ను కోరారు.

# లండన్‌లో ఘనంగా బతుకమ్మ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం యూకే, యూరప్ ఆధ్వర్యంలో లండన్‌లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. లండన్ బార్కింగ్‌లోని బార్కింగ్ అబ్బె స్కూల్ హాల్‌లో నిర్వహించిన ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రానికిచెందిన దాదాపు 500 మంది హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో టీడీఎఫ్ యూకే, యూరప్ సభ్యులు కమల్ ఓరుగంటి, శ్రీనివాస్‌రెడ్డి పింగిళి, రాజు చక్రి, శశికృష్ణ గోవింద్, శ్రవణ్ ఉప్పల, జూపల్లి ప్రవీణ్, నాగరాజు అడ్డగల్ల, రాజేంద్ర పూజారి, శ్రీకాంత్ కాంచనపల్లి, మాదాల శ్రీనివాస్, శ్రీకాంత్ బెల్దె, నగేశ్ బత్తుల, డాక్టర్ మోహన్, డాక్టర్ కమల్ పాల్గొన్నారు.

# ఆసియా దేశాల్లో ఉల్లి ఘాటు

- ఉల్లిగడ్డ ఎగుమతులను భారత్ నిలిపివేయటంతో భారీగా పెరిగిన ధరలు
- సొమ్ము చేసుకుంటున్న ఈజిప్టు, టర్కీ, చైనా



**ముంబై/ఢాకా, అక్టోబర్ 2:** ఆసియా దేశాల ప్రజలు ఉల్లిగడ్డ లేని వంటను ఆస్వాదించడం బహు అరుదు. ఈ దేశాలన్నీ ఉల్లిగడ్డ కోసం భారత్‌పైనే ఆధారపడుతుంటాయి. అలాంటిది భారత్ ఒక్కసారిగా ఉల్లి ఎగుమతులను నిలిపివేసింది. దీంతో ఆయా దేశాలలో ఉల్లి ధరలు ఆకాశానికెక్కి వెక్కిరిస్తున్నాయి. దేశంలో క్వింటాలు ఉల్లి ధర రూ.4,500కు చేరిన నేపథ్యంలో భారత్ గత ఆదివారం నుంచి ఉల్లి ఎగుమతులపై నిషేధం విధించింది. ఉల్లి ధర ఇంత ఎక్కువగా పెరుగడం గత ఆరేండ్లలో ఇదే మొదటిసారి. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా చాలాచోట్ల ఉల్లి పంట నీటిపాలైంది. మరికొన్ని ప్రాంతాలలో వర్షాల కారణంగానే పంట కోతలు చేపట్టలేదు. దీంతో మార్కెట్లకు ఉల్లి రాక ఆలస్యమైంది. ఉల్లి ఎగుమతులపై భారత్ నిషేధం విధించడంతో బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్ వంటి దేశాలు ఈజిప్ట్, టర్కీ, చైనా వైపు చేతులు చాచాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో భారత్ 22 లక్షల టన్నుల ఉల్లిని ఎగుమతి చేసింది. భారత్ ఉల్లి ఎగుమతులను నిలిపివేయడంతో ఇతర దేశాలు ఈ పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నాయి.

**బంగ్లాదేశ్‌లో తొలిసారి రెట్టింపు ధర**

బంగ్లాదేశ్‌లో 15 రోజుల వ్యవధిలో ఉల్లి ధర రెట్టింపైంది. 2013 డిసెంబర్ తరువాత బంగ్లాలో ఉల్లిధరలు ఈ స్థాయిలో పెరుగడం ఇదే మొదటి సారి. దీంతో బంగ్లాదేశ్ తమ ప్రభుత్వ వాణిజ్య సంస్థ ద్వారా సబ్సిడీ రేట్లపై ఉల్లిగడ్డను విక్రయిస్తున్నది. తక్కువ వ్యవధిలో తమకు ఉల్లిని ఎగుమతి చేసే దేశాల వైపుచూస్తున్నామని బంగ్లా వాణిజ్య సంస్థ ప్రతినిధి హుమాయూన్ కబీర్ చెప్పారు. భారత్ నుంచి భారీ స్థాయిలో ఉల్లిని కొనుగోలు చేసే రెండో దేశం మలేషియా. భారత్ విధించిన నిషేధం స్వల్ప కాలమేనని, భయపడాల్సిందేమీ లేదని మలేషియా వ్యవసాయ మంత్రి సిమ్ త్జె జిన్ తమ దేశ ప్రజలకు భరోసానిస్తున్నారు. కానీ ప్రస్తుతం భారత్ కూడా ఈజిప్టు నుంచి ఉల్లిగడ్డలను దిగుమతి చేసుకుంటున్నది. గత వేసవిలో వేసిన పంటలు మార్కెట్‌కు వస్తే తప్ప ఉల్లి ధరలు తగ్గే పరిస్థితి లేదని ముంబై ఉల్లి ఎగుమతిదారుల సంస్థ అధ్యక్షుడు అజిత్ షా పేర్కొన్నారు. వేసవి ఉల్లి పంట నవంబర్ మధ్యకాలంలో మార్కెట్లల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
గురువారం 3 అక్టోబర్ 2019

# పారితోషికం తీసుకోకుండా నటించా

**'నటుడిగా మూసధోరణితో కూడిన పాత్రలకు పరిమితమవ్వడం నచ్చదు. వైవిధ్యతను నమ్మి సినిమాల్ని అంగీకరిస్తాను. పారితోషికాన్ని పట్టించుకోను. ఉచితంగా నటించిన సందర్భాలున్నాయి' అని అన్నారు అవసరాల శ్రీనివాస్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. బాలాజీ సానల దర్శకుడు. శ్రీహరి మంగళంపల్లి, రమ్య గోగుల, పి.ఎల్.ఎన్. రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 5న విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో అవసరాల శ్రీనివాస్ పాత్రికేయులతో ముచ్చటించారు.**


అవసరాల శ్రీనివాస్

**కు**టుంబ విలువలతో తెరకెక్కిన చక్కటి చిత్రమిది. సంస్కృతి సంప్రదాయాలకు విలువనిచ్చే రెండు జంటల జీవన గమనానికి దృశ్యరూపంగా ఉంటుంది. ఇందులో తమిళ బ్రాహ్మణ యువకుడిగా కనిపిస్తాను. ప్రేమించిన అమ్మాయి కోసం ఓ పల్లెటూరి వస్తాను. ఆ తర్వాత ఏం జరిగిందన్నది ఆసక్తిని పంచుతుంది. పెళ్లి అనేది వ్యక్తిగత ఆసక్తులతో పాటు కుటుంబం, ఊరి అభిప్రాయాల్ని గౌరవించేలా ఉండాలని ఈ చిత్రం చాటి చెబుతుంది. సున్నితమైన అంశానికి వినోదం, ప్రేమ, సెంటిమెంట్‌ను జోడించి దర్శకుడు బాలాజీ సినిమాను రూపొందించారు.

**పులిమీద స్వారీనే**

సినిమాలో నా పాత్ర చిన్నదా, నిడివి ఎక్కువగా ఉంటుందా అని ఎప్పుడూ ఆలోచించను. ఆ క్యారెక్టర్ నన్ను సినీ పరిశ్రమలో మనగలిగేలా చేస్తుందా, ప్రాముఖ్యత ఉందా అనే అంశాలను బేరీజు వేసుకుంటూ సినిమాల్ని అంగీకరిస్తాను. నటుడిగా వరుసగా అవకాశాల్ని అందుకుంటూ కెరీర్‌ను కొనసాగించడం అంటే పులిమీద స్వారీ లాంటిదే. అలాగని దర్శకుడిగా విరామం లేకుండా సినిమాలు చేయడం కుదరదు. ఆ ఒత్తిడులు ఉండకూడదనే నటన, దర్శకత్వం రెండింటిని బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నాను. నటీనటులందరికి రచనాపరిజ్ఞానం కొంతైనా ఉండాలని నేను విశ్వసిస్తాను. ఫిలిం మేకింగ్ కోర్సులో అదే నేను నేర్చుకున్నాను. హిందీలో కంగనా రనౌత్‌తో పాటు పలువురు తారలకు స్క్రిప్ట్‌రైటింగ్‌పై మంచి పట్టు ఉండటంతో పాత్రల్లో సులువుగా ఒదిగిపోతుంటారు. కథను ఎంపికచేసుకునేవారకే ఆ నాలెడ్జ్ వాడాలి. ఒకసారి సినిమా ఒప్పుకున్న తర్వాత అందులో జోక్యం చేసుకోకూడదు.

**ఇండియా..అమెరికా..**

ప్రస్తుతం దర్శకుడిగా 'ఫలానా అబ్బాయి, ఫలానా అమ్మాయి' సినిమా చేస్తున్నాను. నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా నటిస్తున్నారు. పద్దెనిమిదేళ్ల వయసు నుంచి ఇరవై ఎనిమిదేళ్ల వరకు ఓ జంట జీవితంలో జరిగే సంఘటనల సమాహారంగా సాగుతుంది. సగం సినిమా ఇండియాలో, సగం అమెరికాలో ఉంటుంది. ఇండియా టాకీపార్ట్ పూర్తిచేశాం. వర్క్‌వీసాలు లభించకపోవడంతో అమెరికా ఎపిసోడ్ ఆలస్యమైంది. డిసెంబర్‌లో తిరిగి షూటింగ్ ప్రారంభించాలని అనుకుంటున్నాం ప్రస్తుతం మరో కథను సిద్ధం చేస్తున్నాను. దర్శకుడిగా నానితో ఓ సినిమా చేయాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను. నాని శైలికి తగ్గ కథ రాసిన తర్వాత సినిమాపై నిర్ణయానికి వస్తాం.

# మనసుకు నచ్చినట్లుగా

**'చి**త్రసీమలో పేరుప్రఖ్యాతులకు అనుగుణంగా మనల్ని అభిమానించే వారితో పాటు శత్రువులు పెరుగుతారు. అవకాశం దొరికితే అధఃపాతాళానికి అణిచివేయాలని చూస్తుంటారు. స్వీయవ్యక్తిత్వాన్ని కోల్పోకుండా నమ్మిన విలువలకు కట్టుబడి పోరాటం చేసినప్పుడే వారిని ఎదుర్కోగలం' అని అంటోంది కంగనా రనౌత్. సుదీర్ఘసినీప్రయాణంలో తనకు ఎదురైన ఆటుపోట్లను గురించి కంగనా రనౌత్ మాట్లాడుతూ 'ఇన్నేళ్లు చిత్రసీమలో నిలదొక్కుకుంటానని ఎవరూ అనుకోలేదు. కొన్ని సినిమాతోనే నా ప్రయాణం ఆగిపోతుందని భావించారు. నా ఎదుగుదలను చూసి చాలా మంది అసూయ చెందారు. విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎలా ముందడుగు వేయాలి, ఏ విధమైన నిర్ణయాలు తీసుకోవాలనే విషయంలో స్పష్టతతో ఆలోచిస్తాను. ఎవరికి భయపడకుండా ధైర్యంగా ఆ సవాళ్లను స్వీకరిస్తాను. ఆ తత్వమే సినిమాల్లో, జీవితంలో నాకు విజయాల్ని తెచ్చిపెట్టింది. ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలంటే అందరికి నచ్చేలా ఉండాలనే నియమమేదీ లేదు. ఎదుటివారు నా గురించి ఏమనుకుంటున్నారనేది పట్టించుకోకుండా నా మనసుకు నచ్చినట్లుగా నేనుంటాను' అని తెలిపింది.


కంగనా రనౌత్

# గీతగోవిందం హిందీలో


రోహిత్‌శెట్టి

**వి**జయ్‌దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'అర్జున్‌రెడ్డి' చిత్రం బాలీవుడ్‌లో 'కబీర్‌సింగ్' పేరుతో పునర్నిర్మితమై మూడు వందల కోట్లకుపైగా వసూళ్లను సాధించింది. ఈ సినిమా తర్వాత విజయ్ దేవరకొండ సినిమాల రీమేక్ హక్కులపై బాలీవుడ్ దర్శకనిర్మాతలు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. తాజాగా 'గీతగోవిందం' చిత్రాన్ని హిందీలో దర్శకుడు రోహిత్‌శెట్టి రీమేక్ చేయబోతున్నారు. కుటుంబ బంధాలు, వినోదం సమ్మిళితంగా రూపొందిన ఈ చిత్ర రీమేక్ హక్కుల్ని రోహిత్‌శెట్టి ఇటీవలే సొంతం చేసుకున్నట్లు చెబుతున్నారు. ఈ రీమేక్‌కు అయన దర్శకత్వం వహిస్తారా? నిర్మాతగా మాత్రమే వ్యవహరిస్తారా అన్నది ఇంకా వెల్లడికాలేదు. ఇందులో షాహిద్‌కపూర్ సోదరుడు ఇషాన్ కథానాయకుడిగా నటించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా రూపొందుతున్న 'సూర్యవన్షీ' చిత్రానికి రోహిత్‌శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు.

# నా పుస్తకాలకు వంశీనే ప్రేరణ


పులగం చిన్నారాయణ, వంశీ, ఓం ప్రకాశ్

**'1950–70** మధ్యకాలంలో తెలుగునాట వెండితెర నవలలు ఓ వెలుగు వెలిగాయి. వాటిలో ముళ్ళపూడి వెంకటరమణ రాసిన పుస్తకాలు నాకు ఇష్టం. నేను నాలుగు వెండితెర నవలలు రాశాను. అందులో 'తాయారమ్మ బంగారయ్య' మినహా మిగిలినవి ప్రచురితమయ్యాయి' అని అన్నారు సీనియర్ దర్శకుడు వంశీ. సీనియర్ సినీ పాత్రికేయులు పులగం చిన్నారాయణ, వడ్డి ఓం ప్రకాశ్ నారాయణ రాసిన 'వెండి చందమామలు' పుస్తకాన్ని బుధవారం హైదరాబాద్‌లో వంశీ ఆవిష్కరించారు. దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారి రవిప్రసాద్ పాడి తొలికాపీని అందుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు వంశీ మాట్లాడుతూ 'తెలుగులో ఉన్న అనేక వెండితెర నవలల మీద ఇలాంటి పరిశోధనాత్మక రచన ఇంతవరకు రాలేదు. ఎవరూ రాయలేదు. ఈ పుస్తకం పాఠకాదరణను చూరగొనాలని ఆశిస్తున్నాను' అని అన్నారు. పులగం చిన్నారాయణ మాట్లాడుతూ 'ఇంతకుముందు నేను రాసిన పుస్తకాలకు, ఈ పుస్తకానికి ప్రేరణ వంశీగారే. వెండితెర నవలలపై పుస్తకం రాయమని నాకు, మిత్రుడు ఓం ప్రకాశ్‌కు ఆయనే సలహా ఇచ్చారు. నేను తొలి నంది అవార్డును అందుకున్న 'ఆనాటి ఆనవాళ్లు' పుస్తకానికి పేరును వంశీనే సూచించారు' అని చెప్పారు. ఈ పుస్తకంలో వెండితెర నవలల గురించి రాయడమే కాకుండా స్వర్గీయ ముళ్ళపూడి వెంకటరమణ, నవోదయ రామ్మోహనరావు, శ్రీరమణ, సింగీతం శ్రీనివాసరావు లాంటి పెద్దల అభిప్రాయాల్ని పొందుపరిచామని, పరిశోధన గ్రంథాన్ని తలపించే ఈ రచన అందరి మన్ననల్ని పొందుతుందనే నమ్మకం ఉందని వడ్డి ఓం ప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు రెంటాల జయదేవ పాల్గొన్నారు.


శ్రీవిష్ణు

# కొత్త దర్శకుడితో..

**శ్రీ** విష్ణు కథానాయకుడిగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై ఓ చిత్రం తెరకెక్కనున్నది. హసిత్ గోలి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. టి.జి. విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించనున్నారు. ఈ ఏడాది చివరలో ఈ చిత్రం ప్రారంభంకానుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'భిన్నమైన కథ, కథనాలతో రూపొందనున్న చిత్రమిది. 'మెంటల్ మదిలో', 'బ్రోచేవారెవరురా' చిత్రాలకు దర్శకత్వ శాఖలో పనిచేసిన హసిత్ గోలి నవ్యమైన పాయింట్‌ను సిద్ధంచేశారు. హీరోగా శ్రీవిష్ణును కొత్త పంథాలో ఆవిష్కరిస్తుంది. ఈ చిత్రంలోని ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సహనిర్మాతలు: వివేక్ కూచిభోట్ల, కీర్తిచౌదరి.


లక్ష్

# సస్పెన్స్ థ్రిల్లర్ వలయం

**లక్ష్** హీరోగా శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న తాజా చిత్రానికి 'వలయం' అనే టైటిల్‌ను ఖరారుచేశారు. రమేష్ కుడుముల దర్శకుడు. చదలవాడ పద్మావతి నిర్మాత. దిగంగన సూర్యవన్షీ కథానాయిక. టైటిల్ లోగోను బుధవారం చిత్రబృందం విడుదలచేసింది. నిర్మాతలు మాట్లాడుతూ 'ఆసక్తికరమైన ఇతివృత్తంతో రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. కనిపించకుండా పోయిన ఓ అమ్మాయిని అన్వేషిస్తూ యువకుడు సాగించిన ప్రయాణమే ఈ చిత్ర ఇతివృత్తం. ఊహకందని మలుపులతో ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది. లక్ష్ పాత్ర నవ్యరీతిలో ఉంటుంది. 2020 ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్‌చంద్ర, సినిమాటోగ్రఫీ: రామకృష్ణ.ఎస్. సమర్పణ:చదలవాడ బ్రదర్స్

